www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



అంతరిక్ష టూరిస్ట్‌గా 2

తెలుగు తేజం!

ఏపీ వాసి గోపీచంద్ తోటకూరకు అరుదైన గౌరవం

'బ్లూ ఆరిజన్' మిషన్‌లో అంతరిక్షయానం చాన్స్

ఈ ఘనత సాధించనున్న తొలి తెలుగు వాడిగా రికార్డు

శనివారం | 13-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 359 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ. 12.05 తదుపరి షష్ఠి; నక్షత్రం: మృగశిర రా. 12.49 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: ఉ. 6.26-8.02, దుర్ముహూర్తం: ఉ. 6.04-7.43, అమృతఘడియలు: సా. 4.01-5.37, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.27

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



- 'పేదలందరికీ ఇళ్ల పట్టాలు'... అని రెండేళ్లుగా రాగాలు తీస్తూనే ఉన్నారు!
- పేదలకు కన్వేయన్స్ డీడ్‌లు ఇవ్వకుండా సర్కారును ఎవరూ అడ్డుకోలేదు!
- రెండు నెలల కిందట ఇవ్వొచ్చు! ఎన్నికల షెడ్యూలుకు ముందే ఇచ్చి ఉండొచ్చు! ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వమూ ఇవ్వొచ్చు! కానీ... సరిగ్గా ఇప్పుడే, ఎన్నికల ముందే పట్టాలు ఇచ్చేస్తారట! ఏకంగా 21 లక్షల పట్టాలు జారీ చేసేస్తారట!
- ఇది... ఎన్నికల ఎత్తుగడ కాదా? ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం కాదా!?

పేదలపై కపట ప్రేమే!

సీఎస్.. ఇదేం పని?

జగన్ రెడ్డి కోసం 'పట్టా'లు తప్పిన జవహర్ రెడ్డి

సరిగ్గా ఎన్నికల ముందే పట్టాల నాటకం

రెండేళ్ల కిందటే పేదల ఇళ్ల కోసం భూసేకరణ

ఆ పేరుతో కోట్లు నొక్కేసిన వైసీపీ నేతలు

ఇన్నాళ్లుగా 8 లక్షల మందికి మాత్రమే పట్టాలు

ఆ తర్వాత అటకెక్కించిన జగన్ సర్కారు

ఎన్నికల ముందు మళ్లీ తెరపైకి

సీఎంవో ఒత్తిడి, సీఎస్ హుకుంతో రెవెన్యూ ఫైలు

పాత పథకమే అంటూ అమలుకు స్క్రీనింగ్ కమిటీ

అన్నీ తెలిసీ జవహర్ రెడ్డి నేతృత్వంలోనే ఆమోదం!?

సుమోటో కుల ధ్రువీకరణపై వెనకడుగు

కోడ్ ఉల్లంఘన అవుతుందని తగ్గిన జగన్ సర్కారు

ఎన్నికల తర్వాతే అమలు.. కలెక్టర్లు, జేసీలకు ఆదేశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీ మరో వంకర ఎత్తుగడకు తెర లేపింది. 'సుమోటో కుల ధ్రువీకరణ, పరిశీలన' పేరిట రెవెన్యూ సిబ్బందిని జనంలోకి పంపించాలనే ఆలోచన చేసిన సర్కారు.. ఇప్పుడు ఇళ్ల పట్టాల పేరుతో కొత్త నాటకం మొదలుపెట్టింది. 21 లక్షల మంది లబ్ధిదారులకు జగన్ బొమ్మలు ముద్రించిన ఇంటి పట్టాలను 'కన్వేయెన్స్ డీడ్'ల రూపంలో పంచాలని యోచిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఇలా చేయకూడదని తెలిసీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి స్వయంగా ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం! ఒకవైపు సీఎస్ హోదాలో ఎన్నికల కోడ్ అమలుపై అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తూనే... మరోవైపు జగన్‌కు లబ్ధిచేకూర్చేలా 'పట్టా'లు తప్పుతుండటంపై అధికార యంత్రాంగంలోనే విస్మయం వ్యక్తమవుతోంది. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' స్కీమ్ కింద 30 లక్షల మంది పేదలకు ఇంటి పట్టాలను కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో ఇవ్వాలని జగన్ సర్కారు రెండేళ్ల కిందటే నిర్ణయించింది. లబ్ధిదారుల జాబితానూ సిద్ధం చేసింది. ఆ జాబితా నిజమైనదా, కాదా అనే విషయాన్ని పక్కనపెడితే.. ఇప్పటి వరకు 8 లక్షల మంది పేదలకు జగన్ ఫొటో, నవరత్నాల లోగోలు ముద్రించి ఉన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. నిజానికి పేదల ఇంటి స్థలాలకు భూసేకరణ 2022లోనే ముగిసిపోయింది. ఈ పేరుతో వైసీపీ నేతలు కోట్లు దండుకున్నారు. జగన్ సర్కారుకు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే... ఎన్నికల షెడ్యూలు వెలువడక ముందే పట్టాలు పంపిణీ చేసేవాళ్లు. కానీ... పేదలకు ముందుగానే

మిగతా 12వ పేజీలో...

కొంగుచాపి అడుగుతున్నాం

న్యాయం చేయండి



పులివెందుల సభలో తమకు న్యాయం చేయాలని కొంగుచాపి కోరుతున్న షర్మిల

ఓవైపు వైఎస్ బిడ్డ.. ఇంకోవైపు వివేకాను చంపిన అవినాశ్

ఓవైపు న్యాయం, ధర్మం.. ఇంకోవైపు అధికారం, డబ్బు

ఎంపీగా ఎవరు కావాలో.. ఎవరివైపు ఉంటారో చెప్పండి

పులివెందుల వేదికగా షర్మిల, సునీత తీవ్ర భావోద్వేగం

వీధిలైట్లు ఆర్పి లింగాలలో వైసీపీ మూకల అల్లరి

దీటుగా ఎదుర్కొన్న షర్మిల, సునీత.. ప్రజల బ్రహ్మరథం

కడప, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): "కొంగు చాపి అడుగుతున్నాం, మీ ఆడబిడ్డలం అడుగుతున్నాం.. మాకు న్యాయం చేయండి. ఓ వైపు రాజశేఖర్‌రెడ్డి బిడ్డ నిలబడింది. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడు వివేకాను హత్య చేయించిన అవినాశ్‌రెడ్డి ఇంకో వైపు నిలబడ్డాడు. మీకు ఎంపీగా రాజశేఖర్‌రెడ్డి బిడ్డ కావాలా... అవినాశ్ రెడ్డి కావాలా? తేల్చుకోండి" అని పీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల.... పులివెందుల నియోజకవర్గ ప్రజలను కోరారు. ఓ వైపు న్యాయం ధర్మం... ఇంకో వైపు

మిగతా 2వ పేజీలో...

అమెరికాకు విజయలక్ష్మి!

అన్నా చెల్లెళ్ల యుద్ధంతో తల్లికి సంకటం

తన తరఫున ప్రచారం చేయాలని జగన్ ఒత్తిడి

దాని వల్ల షర్మిలకు నష్టమని తల్లి భావన

ఎటూ తేల్చుకోలేక విదేశాలకు! 2





రేపల్లె సభకు హాజరైన జనం. ప్రసంగిస్తున్న చంద్రబాబు

దళిత ద్రోహి జగన్

ఎస్సీల నెత్తిన సీఎం భస్మాసుర హస్తం: చంద్రబాబు

25 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు

27 సంక్షేమ పథకాలు రద్దు

ఓట్లు వేసిన దళితులను ముంచేశాడు

దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకు తిరుగుతున్నాడు

అంబేడ్కర్ విదేశీ విద్యకు తన పేరా?

ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తా

జరిగేది క్లాస్‌వార్ కాదు.. క్యాష్‌వార్

ఈ ఐదేళ్లలో పేదలు నిరుపేదలయ్యారు

గుంటూరు/బాపట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహి అని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పాము తన గుడ్లను తానే మింగినట్లు.. తన పిల్లలను తానే తిన్నట్లు తనకు ఓట్లు వేసిన దళితులను ముంచేశాడని ధ్వజమెత్తారు. మూడుముక్కలాటతో రాజధాని లేకుండాచేసి రాష్ట్రాన్ని తలలేని మొండెంలా మార్చాడని దుయ్యబట్టారు. శుక్రవారం బాపట్ల జిల్లా

మిగతా 11వ పేజీలో...

వలంటీర్లూ.. జగన్ మాయలో పడొద్దు

కొల్లూరు, రేపల్లె ప్రజాగళంలో బాబు

సీట్ల మార్పును రెండ్రోజుల్లో సరిచేద్దాం!

ఎన్డీయే పక్షాల నిర్ణయం.. చంద్రబాబు నివాసంలో భేటీ

అనపర్తి తీసుకుని ఉంగుటూరు ఇవ్వాలన్న బీజేపీ.. కుదరదన్న పవన్

తంబళ్లపల్లె ఇస్తామన్న టీడీపీ అధినేత.. నరసాపురం లోక్‌సభ, ఉండి అభ్యర్థుల మార్పుపైనా చర్చ.. ఉమ్మడి సభలకు మోదీ, షా, నడ్డా, రాజ్‌నాథ్! 11

వలంటీర్లంతా బానిసలన్నట్టు..

జగనన్న ఆదేశాలు పాటించాల్సిందే

కార్యకర్తల్లా సేవలు అందించాల్సిందే

కాదూ కూడదంటే ఊరుకునేది లేదు

వలంటీర్లపై వైసీపీ నేతల జులుం

ససేమిరా అంటున్న వలంటీర్లు

వైసీపీకి ఇక 'నో చాన్స్' అనే అంచనా

చంద్రబాబు హామీల ప్రభావం

భవిష్యత్తు బాగుపడుతుందనే ఆశ

వైసీపీకి దూరం జరుగుతున్న వలంటీర్లు

రాజీనామాలపై వైసీపీ 'రాజకీయం'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మొన్నటి దాకా 'వలంటీర్లకు వందనం' అని సన్మానాలు చేశారు. అంతకుముందు నుంచే వారిని 'కార్యకర్తలు'గా మార్చేసుకున్నారు. ఇప్పుడు... సొంత పనివాళ్లలాగా, ఇంకా చెప్పాలంటే బానిసల్లా చూస్తున్నారు! ఎన్నికల ముందు ఇదీ వైసీపీ నేతల వైఖరి! 'రాజీనామా చేసి మా పార్టీ సేవలో తరించండి' అని వైసీపీ ఒత్తిడి తెస్తున్నా... అతి తక్కువమంది వలంటీర్లు మాత్రమే రాజీనామాలు చేశారు. దీంతో అధికార పార్టీ నాయకులు అసహనంతో రగిలిపోతున్నారు. 'మీరు మా జీతగాళ్లు. మేం చెప్పినట్లు వినాల్సిందే' అంటూ కన్నెర్ర

మిగతా 12వ పేజీలో...

రాజీనామా చేయాల్సిందే

లేదంటే సచివాలయం గేటైనా తాకలేరు

టీడీపీ కోవర్టుల్లా చూస్తాం

ఓ వైసీపీ నేత హెచ్చరిక 12

రాజీనామా చేయించి.. కార్యకర్తల్లా పనిచేసేలా చూడండి: ధర్మాన



వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడ్డ జలీల్ ఖాన్

బ్రహ్మారెడ్డిని ఊర్లోకి తెచ్చేంత

మగాడివారా?

ఇకపై టీడీపీకి ప్రచారం చేస్తే అదే నీకు చివరి రోజు!

టీడీపీ ముస్లిం మైనార్టీ నేతపై వలంటీర్లు, వైసీపీ నేతల దాడి

ఒంటరిని చేసి.. చేతులు వెనక్కి విరిచి కట్టి పిడిగుద్దులు

కర్రలు, రాడ్లతో దాడి, తలకు తీవ్ర గాయం 11

అడ్డుకున్న మరో వ్యక్తిపైనా దాడి

రెంటచింతలలో బరితెగించిన వైసీపీ గ్యాంగ్

డీజీపీ ఏం చేస్తున్నారు?

కేసుల వివరాలివ్వడానికి ఎంత టైం కావాలి?

నెల క్రితమే వినతిపత్రం ఇచ్చారుగా?

ఏఐతో మూడు గంటల్లోనే ఇవ్వచ్చు

సుప్రీం మార్గదర్శకాలు పాటిస్తే కేసుల సమాచారం తెప్పించేవారు

కేసుల్ని ప్రస్తావించకుంటే అభ్యర్థుల్ని అనర్హులుగా ప్రకటిస్తారుగా

16లోగా సమాచారం ఇవ్వండి

హైకోర్టు మౌఖిక ఆదేశాలు



అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తమపై నమోదైన కేసుల వివరాలు అందజేయాలని ఎన్నికల్లో పోటీ చేయబోతున్న పలువురు అభ్యర్థులు ఇచ్చిన వినతిపత్రాలపై డీజీపీ స్పందించకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం పిటిషనర్లు డీజీపీకి వినతి పత్రం అందజేస్తే, సమాచారం ఇవ్వకుండా

మిగతా 12వ పేజీలో...

లోకేశ్ ఫోన్ ట్యాపింగ్!



ఐ-ఫోన్ వ్యవస్థ హెచ్చరిక.. నెల రోజుల్లో ఆపిల్ నుంచి రెండో వార్నింగ్

జగన్ ప్రభుత్వంపై టీడీపీ ఆగ్రహం.. ట్యాపింగ్ కోసం పెగాసెస్ సాఫ్ట్‌వేర్?

ఇంకొందరు టీడీపీ నేతల ఫోన్లపైనా నిఘా.. ఇందుకు ప్రత్యేక బృందాలు

వైసీపీ తొత్తుల్లా డీజీపీ, నిఘా చీఫ్.. వారిద్దరినీ తక్షణమే తొలగించండి 12

సీఈసీకి కనకమేడల లేఖ.. సీఈవో ఆఫీసులో టీడీపీ బృందం ఫిర్యాదు

ఇంటర్‌లో ఉత్తీర్ణత 72.2%

గతంతో పోలిస్తే భారీగా పెరుగుదల

ఫస్టియర్ 67.. సెకెండియర్ 78%.. కృష్ణా టాప్.. అల్లూరి, చిత్తూరు జిల్లాలు లాస్ట్

ఈసారీ బాలికలదే పై చేయి.. మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు 3

అంతరిక్ష టూరిస్ట్‌గా తెలుగు తేజం!



▸ ఏపీ వాసి గోపీచంద్‌కు అరుదైన గౌరవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: భారత పైలట్, తెలుగుతేజం గోపీచంద్ తోటకూరకు అరుదైన గౌరవం దక్కింది. అంతరిక్షంలోకి వెళ్లే తొలి తెలుగు టూరిస్ట్‌గా గోపీచంద్ రికార్డు సృష్టించనున్నారు. విజయవాడలో జన్మించిన ఆయనను బ్లూ ఆరిజన్ సంస్థ న్యూషెపర్డ్ (ఎన్ఎస్)-25 మిషన్‌లో భాగంగా టూరిస్టుగా రోదసీలోకి తీసుకెళ్లనుంది. బ్లూ ఆరిజన్ వ్యోమనౌకలో పర్యాటకుడిగా అంతరిక్షంలోకి వెళ్లేందుకు గోపీచంద్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా మరో ఐదుగురు కూడా ఎంపిక య్యారు. 1984లో భారత సంతతికి చెందిన రాకేశ్ శర్మ కూడా అంతరిక్ష యానం చేసిన సంగతి తెలిసిందే. అలాగే గతంలో అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్, రాజాచారి, శిరీష బండ్ల కూడా భారత మూలాలున్న అమెరికా పౌరులు. భారత్ తరఫున తొలి స్పేస్ టూరిస్టుగా అవకాశం దక్కించుకున్న గోపీచంద్ ప్రస్తుతం అమెరికాలోనే ఉంటున్నప్పటికీ ఆయనకు భారత పాస్‌పోర్టు ఉండడం గమనార్హం. దీంతో అంతరిక్ష యానం చేయనున్న తొలి తెలుగు వాడిగా ఆయన రికార్డు నెలకొల్పనున్నారు.

విజయవాడలో పుట్టి.. పైలట్ శిక్షణ పొంది..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టిన గోపీచంద్ (30) ఒక పారిశ్రామిక వేత్త, పైలట్. అమెరికాలోని ఎంబ్రీ రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీ నుంచి ఏరోనాటికల్ సైన్స్‌లో బీఎస్సీ చేసిన గోపీచంద్.. పైలట్‌గానూ శిక్షణ పొందారు. గోపీచంద్‌కు సాహస యాత్రలంటే కూడా ఇష్టం. ఇటీవలే ఆయన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఆయన ప్రిజర్వ్ లైఫ్ సంస్థ సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇదొక వెల్‌నెస్ సెంటర్. దీన్ని అట్లాంటా శివారులో మిలియన్ డాలర్లతో ఏర్పాటుచేశారు. బ్లూ ఆరిజన్ సంస్థ ఆయన పేరుని అధికారికంగా ప్రకటించే వరకూ తన కుటుంబానికి సైతం ఈ విషయం తెలియదని గోపీచంద్ మీడియాకు తెలిపారు. అంతరిక్ష రంగంపై ఎనిమిదేళ్ల క్రితమే ఆసక్తి కలిగిందని ఆయన చెప్పారు.

బ్లూ ఆరిజన్ ఏడో మిషన్

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజన్ ఇప్పటికే న్యూషెపర్డ్ మిషన్ పేరిట అంతరిక్ష యాత్రలకు శ్రీకారం చుట్టింది. 2021లో బెజోస్ సహా ముగ్గురు టూరిస్టులు రోదసీయాత్ర చేశారు. దాని తర్వాత చేపట్టబోయే మిషన్ ఈ ఎన్ఎస్-25. దీనికోసం గోపీచంద్ సహా మొత్తం ఆరుగురిని ఎంపిక చేశారు. వారిలో వెంచర్ క్యాపిటలిస్ట్ మాసన్ ఏంజెల్, పారిశ్రామిక వేత్తలు సిల్వియన్, కారోల్ షెల్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కెన్నెత్, ఆస్ట్రోనాట్ ఎడ్ డ్వైట్ ఉన్నారు. వీరి ప్రయాణ తేదీ ఇంకా ఖరారు కాలేదు. బ్లూ ఆరిజన్.. న్యూ షెపర్డ్ ప్రోగ్రామ్ కింద చేపడుతున్న 25వ మిషన్ ఇది. అలాగే మానవ సహితంగా చేపడుతున్న ఏడో ప్రాజెక్టు. బ్లూ ఆరిజన్ ఇప్పటివరకు 31 మందిని అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీరంతా సముద్ర మట్టానికి 80-100 కిలోమీటర్ల ఎత్తులో ఉండే కర్మన్ లైన్ వరకు వెళ్లివచ్చారు.

లోకం తీరు



రామేశ్వరం కేఫ్ బాంబు పేలుళ్ల కేసులో..

ఇద్దరు నిందితులు అరెస్టు

▸ బెంగాల్‌లో తలదాచుకున్న నిందితులు



బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సంచలనం కలిగించిన రామేశ్వరం కేఫ్ బాంబు పేలుళ్ల కేసులో సూత్రధారి సహా ఇద్దరు ప్రధాన నిందితులను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న ముసావిర్ హుసేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహాను పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఇంప్రవైజ్‌డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ)ను షాజిబ్ కేఫ్‌లో పెట్టగా.. ఈ పేలుడు ప్రణాళిక, అమలు వెనుక ప్రధాన సూత్రధారి తాహా అని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. 'కేఫ్‌లో బాంబు పేలుళ్ల తర్వాత పరారీలో ఉన్న నిందితులను గుర్తించడంలో ఎన్ఐఏ విజయవంతమైంది. కోల్‌కతా సమీపంలో తప్పుడు గుర్తింపు పత్రాలతో అజ్ఞాతంలో ఉన్న వారిని ఈ నెల 12న అదుపులోకి తీసుకున్నాం' అని ఎన్ఐఏ అధికారి ఒకరు వెల్లడించారు. కాగా.. షాజిబ్, అహ్మద్ తాహాలకు సాయం చేసిన ముజామిల్ షరీఫ్‌ను ఇప్పటికే అరెస్టు చేశారు. పేలుళ్లు జరిగిన తర్వాత పరారీలో ఉన్న షాజిబ్, తాహాలను గుర్తించేందుకు ఎన్ఐఏ అధికారులు దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో గాలించారు. వీరి ఆచూకీ తెలిపినవారికి రూ.10 లక్షల చొప్పున నగదు బహుమతి ఇస్తామని ప్రచారం చేశారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో ఇద్దరినీ అరెస్టు చేసి బెంగళూరు తరలించారు. మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్లు చోటు చేసుకోగా సుమారు 8 మంది గాయపడ్డారు.

నిందితులను పట్టించిన టోపీ!

రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు జరిగిన నాటినుంచి పరారీలో ఉన్న షాజిబ్, అహ్మద్ తాహా అస్సాం, పశ్చిమబెంగాల్‌లో తలదాచుకున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. వారి ఆచూకీని కనుగొనే క్రమంలో షాజిబ్ ధరించిన టోపీ (క్యాప్) వారిని గుర్తించడానికి సహాయపడింది. పేలుళ్లు జరిగిన తర్వాత ఎన్ఐఏ ఆ క్యాప్‌ను స్వాధీనం చేసుకుంది. చెన్నైలోని ఒక మాల్‌లో షాజిబ్, తాహా ఈ క్యాప్‌ను కొనుగోలు చేసినట్టు గుర్తించింది. అప్పుడు రికార్డయిన సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి, నిఘా పెట్టారు. పేలుళ్ల అనంతరం షాజిబ్, తాహా తరచూ సిమ్ కార్డులు మార్చుతూ అండర్ గ్రౌండ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ ఎన్ఐఏ రాడార్ నుంచి తప్పించుకోలేకపోయారు.

కశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా

అక్కడ అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో సమయం లేదు.. రామమందిరం ఎప్పటికీ ఎన్నికల అంశం కాబోదు

▸ ఇండియా కూటమి నేతలది మొఘలుల మనస్తత్వం: మోదీ



ఉధంపూర్, ఏప్రిల్ 12: జమ్ము కశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో సమయం లేదని చెప్పారు. శుక్రవారం జమ్ము కశ్మీర్‌లోని ఉధంపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదం, రాళ్ల రువ్వడం, సీమాంతర కాల్పుల భయం లేకుండా లోక్‌సభ ఎన్నికలు కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని తెలిపారు. 'గత పదేళ్లలో ఈ ప్రాంతం పూర్తిగా మారిపోయింది. ఇక్కడి ప్రజల దీర్ఘకాలిక బాధలకు ముగింపు పలుకుతామని ఇచ్చిన హామీని నెరవేర్చా' అని మోదీ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని దమ్ముంటే తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు ఆయన సవాల్ విసిరారు. 'ప్రజల మనోభావాలంటే ఇండియా కూటమి సభ్యులకు లెక్కలేదు' అని ఆర్జేడీ నేత తేజస్విని ఉద్దేశించి మోదీ ధ్వజమెత్తారు. బిహార్‌లో వసంత నవరాత్రుల వేళ తేజస్వీ మాంసాహారం తినడం, ఆ వీడియోను సోషల్ మీడియాలో పంచుకోవడంపై వివాదం రేగిన నేపథ్యంలో మోదీ ఇలా స్పందించారు. 'తమకు నచ్చినది తినకుండా చట్టం, మోదీ ఎవరినీ అడ్డుకోరు. కానీ వారి ఉద్దేశం వేరు. మొఘలులు దేశంపై దాడి చేసినప్పుడు వారు రాజులను ఓడించడంతోనే సంతృప్తి చెందలేదు. ఇక్కడి ఆలయాలను ధ్వంసం చేస్తే గానీ వారికి తృప్తి కలగలేదు. ఆ చర్యను వారు ఆస్వాదించారు. ఆదేవిధంగా ఇలాంటి వీడియోలు పోస్టు చేయడం ద్వారా వారు మొఘలుల కాలం నాటి ఆలోచనలను ప్రదర్శిస్తున్నారు' అని మోదీ ఆరోపించారు. ప్రజలు తల్చుకుంటే రాకుమారులు సైతం తమ సింహాసనాలను వదిలిపెట్టాల్సి వస్తుందని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. అయోధ్యలో రామమందిరం బీజేపీకి ఎన్నికల అస్త్రంగా మారిందని ఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలపై మోదీ మండిపడ్డారు. ఇది దేశ ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశమన్నారు. అది ఎప్పుడూ ఎన్నికల అంశం కాదని, ఇకపై కూడా కాబోదని చెప్పారు. బీజేపీ పుట్టక ముందే రామమందిర ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

అంబేడ్కరే వచ్చినా..

రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను రాజస్థాన్‌లోని బార్మర్‌లో నిర్వహించిన ర్యాలీలో మోదీ తోసిపుచ్చారు. బీజేపీ ప్రభుత్వానికి దేశ రాజ్యాంగమే సర్వస్వం అని, ఇప్పుడు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్వయంగా వచ్చినా కూడా దానిని రద్దు చేయలేరని స్పష్టం చేశారు. దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని, ఇప్పుడు రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని మోదీని దూషిస్తోందని మండిపడ్డారు.

సమస్యలపై మాట్లాడరు: తేజస్వి

ఉధంపూర్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై తేజస్వీ యాదవ్ స్పందించారు. ప్రధాన సమస్యలపై మాట్లాడటానికి బదులు... ప్రజలు ఏం తింటున్నారు, ఏ దుస్తులు ధరిస్తున్నారనే విషయాలపైనే బీజేపీ దృష్టి పెడుతోందని ఆరోపించారు. బిహార్‌లో సమస్యలపైనా, వలసలను ఎలా ఆపుతారో, అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లలో ఏం చేస్తారో అనే దానిపై మాత్రం ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదన్నారు. పదేళ్లుగా కేంద్రంలో, 17ఏళ్లుగా బిహార్‌లో వారు చేసిందేమీ లేదని మండిపడ్డారు.

మోదీ... రాముడిపై ప్రమాణం చేస్తారా?

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి పైకి కనిపించని ప్రజామద్దతు ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఆ భయంతోనే ఎన్నికలలో మోదీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. తానిచ్చిన హామీల మేరకు దేశ ప్రజల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ చేశామని, నల్లధనాన్ని వెనక్కి తెచ్చామని, రైతుల ఆదాయం రెట్టింపు చేశామని, కనీస మద్దతు ధర అమలు చేశామని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించామని అయోధ్య రామునిపై ప్రధాని మోదీ ప్రమాణం చేయగలరా అని ఖర్గే సవాలు విసిరారు. ధరల భారం మోపి ప్రజలను పీడిస్తూ రామనామ స్మరణ చేస్తున్నారంటూ ప్రధానిపై ఆయన ధ్వజమెత్తారు. కలబుర్గిలో తన అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి నామినేషన్ సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర పార్టీల్లో ఉన్న అవినీతి నేతలు బీజేపీలోకి మారగానే ఎలా పునీతులై పోతున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐలతో అందరినీ మోదీ బెదిరిస్తున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు.

సిద్ధాంత పోరులో 'ఇండియా'దే విజయం

▸ తిరునల్వేలి ప్రచార సభలో రాహుల్

చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మతతత్వవాద పార్టీలకు, లౌకికవాద పార్టీలకు మధ్య సైద్ధాంతికపరమైన పోరే ఈ లోక్‌సభ ఎన్నికలని, ఇందులో ఇండియా కూటమి ఘనవిజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పెరియార్, సామాజిక న్యాయానికి - ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు మధ్య పోరాటంగా ఈ ఎన్నికలను రాహుల్ అభివర్ణించారు. తిరునల్వేలి లోక్‌సభలో శుక్రవారం సాయంత్రం ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా పెట్టిన సభలో రాహుల్ ప్రసంగించారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి శ్రీమంతులకు దేశంలోని ప్రధాన హార్బర్లు, విండ్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు అప్పగించడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయారని రాహుల్ తెలిపారు.

భారత జీడీపీ వృద్ధి రేటుకు బ్రేక్

▸ ఈ ఏడాది 6.1% మించదు: మూడీస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: మూడీస్ అనలిటిక్స్ సంస్థకు భారత ఆర్థిక వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. 2023లో 7.7 శాతంగా నమోదైన భారత జీడీపీ వృద్ధి రేటు.. 2024లో 6.1 శాతం మించదని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్‌తో పాటు ఫిచ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలన్నీ ఈ ఏడాది కూడా భారత జీడీపీ వృద్ధి రేటు 6.5 నుంచి 7.5 శాతం మధ్య ఉంటుందని ప్రకటించాయి. ఈ ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి తగ్గదని ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడీస్ అనలిటిక్స్ సంస్థ ఒక్కటే ఈ ఏడాది భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.1 శాతానికి కుదించడం విశేషం. కాగా, భారత్‌లో ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగానే ఉన్న విషయాన్ని మూడీస్ గుర్తు చేసింది.

కాశీలో ఖాకీ బదులు కుర్తా-ధోతీ



వారాణసీ, ఏప్రిల్ 12: ఉత్తరప్రదేశ్‌లోని కాశీ విశ్వనాథ ఆలయం వద్ద విధులు నిర్వర్తించే పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త డ్రెస్ కోడ్ ప్రకటించింది. ఇకపై, పోలీసులు ఖాకీ దుస్తుల్లో కాకుండా సంప్రదాయ వస్త్రధారణలో ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తారని వెల్లడించింది. వారాణసీ పోలీసు కమిషనర్ ఇందుకు సంబంధించిన ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో పోలీసులు ధోతీ-కుర్తా ధరించి మెడలో రుద్రాక్ష మాలలు వేసుకుని ఆలయం వద్ద విధులు నిర్వర్తించారు. ఈ వస్త్రధారణలో పోలీసులు పూజారుల్లా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు అర్చకుల్లా దుస్తులు ధరించి విధులకు హాజరవ్వడం ఏ పోలీసు మాన్యువల్ ప్రకారం సబబు? అని ప్రశ్నించారు. పోలీసు డ్రెస్ కోడ్‌పై ఈ ఉత్తర్వులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల విషయంలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని దొంగలు ఎవరైనా అవకాశంగా తీసుకుని భక్తులను మోసం చేస్తే ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందన్నారు. కాగా, డ్రెస్ కోడ్ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని వారాణసీ పోలీసు కమిషనర్ మోహిత్ అగర్వాల్ సమర్థించుకున్నారు. ఆలయంలో విధులు నిర్వర్తించే పోలీసులు అర్చకుల్లా కనిపిస్తే భక్తులు నుంచి తమకు మరింత సహకారం లభిస్తుందనే డ్రెస్‌కోడ్ మార్చామని పేర్కొన్నారు.

హెచ్‌ఏఎల్‌కు 65 వేల కోట్ల కాంట్రాక్టు!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ప్రభుత్వరంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు రక్షణశాఖ రూ.65 వేల కోట్ల విలువైన భారీ టెండర్‌ను విడుదల చేసింది. స్వదేశంలో తయారైన 97 'తేజస్ ఎల్‌సీఏ మార్క్ 1 ఏ యుద్ధ విమానాల' కోసం ఈ టెండర్‌ను ఇచ్చింది. హెచ్‌ఏఎల్ చరిత్రలోనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అతిపెద్ద కాంట్రాక్టు ఇది. దీనిపై స్పందించటానికి హెచ్‌ఏఎల్‌కు మూడు నెలల సమయం ఉంది. రూ.48 వేల కోట్ల విలువైన 2021 నాటి ఒప్పందం ప్రకారం హెచ్‌ఏఎల్ ఇప్పటికే వాయుసేనకు 83 తేజస్ మార్క్-1 ఏ విమానాలను సరఫరా చేస్తోంది. ఈ మేరకు తాజాగా తయారైన బ్యాచ్‌లోంచి ఒక మార్క్ ఏ 1ను ఇటీవలే బెంగళూరులో 18 నిమిషాలపాటు గగనతలంలో తిప్పారు. ఈ కొత్త విమానాలను వాయుసేనకు మరో మూడు నాలుగు నెలల్లో అందించనున్నారు. వాస్తవానికి తేజస్ విమానాల సరఫరా 2016లో మొదలైంది. అయితే, అప్పట్లో తేజస్ మార్క్-1 విమానాలను హెచ్‌ఏఎల్ అందించింది. వాయుసేనకు 40 విమానాలను సరఫరా చేసింది. ఈ మార్క్ 1 విమానాల్లో దాదాపు 40 చిన్నా, పెద్ద మార్పులు చేసి మార్క్ 1 ఏ విమానాలను రూపొందించారు. రక్షణశాఖ తాజాగా ఇచ్చిన టెండర్ ద్వారా.. హెచ్‌ఏఎల్ ఉత్పాదక సామర్థ్యం ఇప్పుడున్న ఏడాదికి 10-12 యుద్ధవిమానాల నుంచి 24 విమానాలకు పెరిగే అవకాశం ఉంది. దీనిపై ఆ సంస్థ అధినేత సీబీ అనంత కృష్ణన్ హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బెంగళూరు, నాసిక్‌లలో ఉన్న తమ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 2025-26 నాటికి ఏటా 24 విమానాలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దానిని సాధించిన తర్వాత ఏటా 30 యుద్ధ విమానాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంటామన్నారు. వాయుసేన ఆధునికీకరణలో భాగంగా పాతబడిన మిగ్ విమానాలను తొలగిస్తూ.. వాటి స్థానాన్ని అత్యాధునిక తేజస్‌లతో భర్తీ చేస్తున్నారు.

కొంగుచాపి అడుగుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

అధికారం డబ్బు ఉన్నాయన్నారు. కడప నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిల న్యాయ్‌యాత్ర పేరిట ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం సొంత గడ్డ పులివెందుల నియోజకవర్గం పరిధిలోని వేంపల్లె, వేముల, లింగాల, సింహాద్రిపురం, పులివెందులలో ఆమె బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందులలో ఆమె మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "పులివెందులలోని వెంకటేశ్వరస్వామి టెంపుల్ వద్ద బహిరంగసభకు మేం వస్తున్నామని చెప్పి లైట్లు తీసేశారంట. లైట్లు లేవంటే జగన్ ఫెయిల్ అయినట్లే. లైట్లు కావాలనే తీసివేశారు. అంటే అవినాశ్‌కు భయం పట్టుకున్నట్లు" అని వ్యాఖ్యానించారు. జగన్ జైలుకెళితే 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. "ఎండనక, వాననక, నా ఇంటిని, బిడ్డలను, నా కుటుంబాన్ని పక్కనబెట్టి పాదయాత్ర చేశాను. దాదాపు సంవత్సరంపాటు రోడ్డుపైనే బతుకుతూ పాదయాత్ర చేశాను. జగన్ సీఎం కాకముందు నేను చెల్లెను. ఆ తర్వాత నేను ఎవరో! సీఎం అయ్యాక కనీసం సునీతమ్మ విషయంలో కూడా న్యాయం చేయలేదు. జగన్ అధికారం అడ్డుపెట్టుకుని హంతకులను కాపాడుకుంటున్నారు. సీబీఐ అన్ని సాక్ష్యాలు బయటపెట్టింది, హత్య చేసింది అవినాశ్ కుటుంబమే అని చెప్పింది. అన్ని ఆధారాలు ఉన్నా కూడా సీబీఐ అవినాశ్ వెంట్రుక కూడా పీకలేకపోయింది. జనాలు నమ్మి ఓటు వేస్తే చేసేది ఇదేనా!" అని షర్మిల తీవ్రస్వరం వినిపించారు. జగన్ పులివెందుల పిల్లి అని, పిల్లిగా మారి బీజేపీకి బానిసగా మారారని దుయ్యబట్టారు.



పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో వైఎస్ షర్మిల రోడ్ షోకు హాజరైన జనం

షర్మిలను గెలిపిస్తే నా గొంతుక అవుతుంది : సునీత

గత ఎన్నికలకు ముందు వివేకానందరెడ్డిని దారుణంగా హత్యచేశారు. ఆ తర్వాత జగన్ సీఎం అయ్యారు. న్యాయం చేస్తానని హామీఇచ్చారు. అయినా కేసు తెగడంలేదు. అనుమానం వచ్చి సీబీఐకి పోదాం అన్నాను. అప్పుడు జగన్ సీబీఐకి వద్దు అన్నారు. 'మనం సీబీఐకి పోతే అవినాశ్‌రెడ్డి బీజేపీలోకి పోతాడ'న్నారు. అప్పుడే సీబీఐకి పోవాలని నిర్ణయం తీసుకున్నా" అని వైఎస్ వివేకా కుమార్తె డాక్టర్ సునీత వివరించారు. "వివేకాను చంపితే ఆయనకు కొడుకు లేడనుకున్నారు. ఉన్న ఒక ఆడదీ ఏం చేస్తుందనుకున్నారు. ఆడది అంటే అబల కాదు ఆదిపరాశక్తి. ఇది న్యాయపోరాటం, దోషులకు శిక్ష పడే దాకా సాగే పోరాటం. హత్య చేసినవారికి శిక్షపడాలి అనుకున్నాను. షర్మిలను గెలిపిస్తే నా గొంతుకగా పార్లమెంటుకు వెళుతుంది" అని సునీత వివరించారు.

వైసీపీలో భయం పట్టుకుంది

లింగాలలో బస్సుయాత్రలో షర్మిల మాట్లాడుతుండగా కొంతమంది వైసీపీ అల్లరి మూకలు జై జగన్ అంటూ అల్లరి చేశారు. రోడ్‌షోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. "మా సభలో వైసీపీ నాయకులు ఉంటే మాకు అభ్యంతరం లేదు. మీరు గొడవకు దిగుతున్నారంటే వైసీపీ ఓడిపోతుందని అవినాశ్‌కు భయం పట్టుకున్నట్టే"నని తీవ్ర స్వరంతో షర్మిల అన్నారు. అయితే, రాజశేఖర్‌రెడ్డి బిడ్డను అడ్డుకుంటున్నామనేది మరిచిపోయినట్టు ఉన్నారని వ్యాఖ్యానించారు. కాగా, పులివెందుల పూలంగళ్ల వద్ద అందరి సమక్షంలో వివేకా హత్య గురించి పంచాయితీ పెట్టుకుంటామని.. వైసీపీ మూకలను ఉద్దేశించి సునీత సవాల్ చేశారు. కాగా, షర్మిల బస్సు యాత్రకు సొంత గడ్డ పులివెందులలో జనం అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. బస్సుయాత్రలో భాగంగా.. వివేకా హత్య, జగన్ వైఫల్యాలు ప్రస్తావిస్తూ ప్రధానంగా అవినాశ్‌ను అటాక్ చేస్తూ కడిగి పారేశారు. శుక్రవారం వివేకా ఇంట్లో షర్మిల, సునీత బస చేశారు. అనంతరం లింగాలకు వెళ్లారు. అక్కడ సభలో మాట్లాడారు.

అమెరికాకు విజయలక్ష్మి!

▸ అన్నా చెల్లెళ్ల యుద్ధంతో తల్లికి సంకటం

▸ ఎటూ తేల్చుకోలేక విదేశాలకు!

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైఎస్ విజయలక్ష్మి అమెరికా వెళ్లిపోయారు. మనసు కూతురు షర్మిల వైపే లాగుతున్నా... కుమారుడు జగన్ ఒత్తిడి భరించలేక... ఎటు ఉండాలో తేల్చుకోలేక విదేశాలకు వెళ్లిపోయినట్లు సమాచారం. ఎన్నికలు ముగిసిన తర్వాతే ఆమె తిరిగి స్వదేశం చేరుకుంటారని తెలుస్తోంది. ప్రస్తుతం వైసీపీ అధినేత జగన్ కు... ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు మధ్య 'పొలిటికల్ వార్' జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇది తల్లికి సంకటంగా మారింది. జగన్ సీఎం అయ్యేందుకు తల్లీకూతుళ్లిద్దరూ కష్టపడ్డారు. అధికారంలోకి రాగానే జగన్... ఆ ఇద్దరినీ పక్కనపెట్టారనే విమర్శలు వచ్చాయి. సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన విజయలక్ష్మి... ఆ తర్వాత అడపా దడపా మాత్రమే ఆయనతో కనిపించారు. గౌరవాధ్యక్ష పదవి నుంచి 'తప్పుకునేలా' పార్టీ ప్లీనరీలోనే ఆమె చేత ప్రకటన చేయించారు. అన్నతో విభేదించి షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టినప్పుడు... విజయలక్ష్మి ఆమెతోనే ఉన్నారు. అప్పుడు హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత 'వైఎస్సార్ జీవన సాఫల్య' పురస్కారాల సమయంలో మాత్రమే ఏపీలో ఆమె వేదికపై కనిపిస్తున్నారు.

అటూ... ఇటూ

షర్మిల ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి... జగన్‌పై యుద్ధం ప్రకటించగానే విజయలక్ష్మికి ఇక్కట్లు మొదలయ్యాయి. తల్లి మద్దతు తనకే ఉందనిపించుకునేందుకు జగన్ రకరకాలుగా ప్రయత్నించారు. గతనెల 27న జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ప్రారంభానికి ముందు ఇడుపులపాయలో వైఎస్ ఘాట్ వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆ తర్వాత షర్మిల బస్సుయాత్ర చేపట్టిన సమయంలోనూ ఇడుపులపాయలో కూతురి కోసం ఆమె ప్రత్యేక ప్రార్థనలూ చేశారు. ఆ సంగతి ఎలా ఉన్నా... ఎన్నికల్లో తన తరఫున ప్రచారం చేయాలని, జనంలో తిరగాలని, తనకే మద్దతు ఉన్నట్లు సంకేతాలు పంపించాలని జగన్ తన తల్లిని గట్టిగా కోరినట్లు సమాచారం. ఈ ఒత్తిడి భరించలేక ఒక దశలో ఆమె ఇందుకు అంగీకరించినట్లు కూడా తెలుస్తోంది. కానీ... ఆ తర్వాత మనసు మార్చుకున్నట్లు సమాచారం. కడప జిల్లాలో షర్మిలకు లభిస్తున్న మద్దతు, వైఎస్ బిడ్డగా జనం ఆదరిస్తున్న తీరు, వివేకా హత్య ఉదంతం... వీటన్నింటి నేపథ్యంలో జగన్ తరఫున ప్రచారం చేయడం సరికాదని, ఇది కూతురికి నష్టం చేస్తుందని విజయలక్ష్మి భావించినట్లు చెబుతున్నారు. ఈ సంకటం నుంచి బయటపడలేకే ఆమె అమెరికాలో బంధువుల వద్దకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

గుంటూరులో యాత్ర వెలవెల

▸ 5వేలమంది పట్టే ప్రాంగణం.. 1150 బస్సులు

▸ అయినా.. బస్సు యాత్రకు కనిపించని స్పందన

▸ వర్షంతో 3 గంటలు ఆలస్యంగా సభ



గుంటూరులో బస్సు మీదనుంచి జగన్ అభివాదం

గుంటూరు (ఆంధ్రజ్యోతి) సత్తెనపల్లి, ఏప్రిల్ 12 : అదేమైనా 50 వేలు మంది పట్టే ప్రాంగణమా అంటే కాదు, పట్టుమని ఐదు వేలు మంది ఉంటే కిక్కిరిసిపోయినట్లుగా కనిపించే ప్రాంగణమది. అయినా.. జగన్ బహిరంగ సభ కోసం సిద్ధంచేసిన ప్రాంగణం వెలవెలబోయింది. వెనక ఉన్న గ్యాలరీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. జగన్ ప్రసంగం ప్రారంభించగానే ప్రాంగణంలో ఉన్న కొద్దిపాటి ప్రజలు సైతం మెల్లగా బస్సుల వద్దకు జారుకొన్నారు. జగన్ ప్రసంగం కూడా చప్పగా సాగడంతో నిరాశగా వెనుదిరిగారు. శుక్రవారం సాయంత్రం గుంటూరు నగరంలో జగన్ బస్సు యాత్ర, 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ప్రాంగణంలో నిర్వహించిన సభకు ప్రజాస్పందన కొరవడింది. జగన్ సభ కోసం ఆర్టీసీ ద్వారా 1150 బస్సులు సమకూర్చుకొన్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా జిల్లాల నుంచి బస్సులను తీసుకొచ్చారు. యాత్ర జరిగింది మూడు నియోజకవర్గాల మీదగా కాగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా బస్సులను పెట్టి జనాన్ని తీసుకొచ్చారు. అయితే శుక్రవారం సాయంత్రం 3గంటల సమయంలో గుంటూరు నగరంలో భారీ వర్షం కురవడంతో సభా ప్రాంగణం బురదమయంగా మారింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా మూడు గంటల ఆలస్యంగా 6.30 గంటలకు మొదలైంది. అప్పటికే బస్సుల్లో తీసుకొచ్చిన జనం కాస్త వెనుదిరగడం ప్రారంభించారు. చాలామంది బస్సులు దిగకుండా వాటిల్లోనే కూర్చుండిపోయారు. మరోవైపు బస్సులన్నీ సీఎం సభకు తరలించడంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, జగన్ సభ కోసం గుంటూరు నగర శివారులోని బొంతపాడు సమీపంలో ఎన్‌హెచ్-16 డివైడర్‌ని పూర్తిగా ధ్వంసం చేశా రు. అలానే సబ్‌వేకు ఉండే ఇనుప కంచెని సుమారు అర కిలోమీటర్ దూరం పైగా తొలగించారు. కనీసం వాహనాల రాకపోకలను మళ్లించకుండా హైవే మీద వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు.

బాబు అనని వి అన్నట్టుగా...

▸ గుంటూరు సభలో జగన్ పదేపదే అబద్ధాలు

ప్రతీ ఇంటికి కేజీ బంగారం ఇస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ఏనాడూ ప్రజలకు హామీ ఇవ్వలేదు. అలానే ఆడబిడ్డ పుడితే కుటుంబానికి రూ.25వేల డిపాజిట్ చేస్తానని చెప్పలేదు. అయినప్పటికీ సీఎం జగన్ పదేపదే సభలో చంద్రబాబు ప్రతీ ఇంటికి కేజీ బంగారం, రూ. 25వేల డిపాజిట్ చేస్తానని చెబుతూ మోసం చేసేందుకు వస్తున్నారని పచ్చి అబద్ధాలు మాట్లాడారు. ఒక్క రూపాయి కూడా డ్వాక్రా రుణాలను చంద్రబాబు మాఫీ చేయలేదని జగన్ మరో అబద్ధమాడారు. 2014-19 మధ్యన డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చాలావరకు అమలుచేశారు. రూ.17వేల కోట్లకు పైగా రైతు రుణమాఫీ చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే రుణమాఫీ చేయలేదని సీఎం చెప్పారు. ఎన్నికల్లో పోరాటం తనకు, చంద్రబాబు కాదట.. ప్రజలకు, చంద్రబాబుకని జగన్ చేసిన వ్యాఖ్యలు ముందే కాడిపడేసినట్లుగా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. శనివారం విజయవాడలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తున్న సందర్భంగా పెద్దఎత్తున చెట్లను కొట్టేశారు.

'హైస్కూల్ ప్లస్‌లు' అట్టర్ ఫ్లాప్!

- ఇక్కడ ఇంటర్‌లో దారుణ ఫలితాలు
- రాష్ట్ర సగటులో సగం కూడా లేని ఉత్తీర్ణత
- ఫస్టియర్ 28శాతం, సెకెండియర్ 35శాతం
- గతేడాది ఫస్టియర్‌లో కేవలం 12శాతమే
- హైస్కూల్ ప్లస్‌లతో నష్టపోయిన బాలికలు
- ల్యాబ్స్ లేకుండానే ప్రాక్టికల్స్.. ప్రభుత్వ కాలేజీలదీ అదే దారి
- ఫస్టియర్ 38శాతం, సెకెండియర్ 58శాతమే..

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన హైస్కూల్ ప్లస్‌లు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంటర్మీయట్ కోర్సుల్లో దారుణమైన ఫలితాలతో మిగిలిపోయాయి. ఓవైపు ప్రైవేటు కాలేజీలు ఉత్తీర్ణతలో అగ్రస్థానంలో నిలుస్తుంటే హడావుడిగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లు సగటు ఉత్తీర్ణతకు చాలా దూరంగా ఉండిపోయాయి. శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో హైస్కూల్ ప్లస్‌లలో చదివిన విద్యార్థులు ఫస్టియర్‌లో 28శాతం మంది, సెకెండియర్‌లో 35 శాతం మంది మాత్రమే పాసయ్యారు. ఈ ఏడాది రాష్ట్ర సగటు ఉత్తీర్ణత ఫస్టియర్ 67శాతం, సెకెండియర్ 78శాతం కాగా హైస్కూల్ ప్లస్‌లలో వచ్చిన ఫలితాలు ఇందులో సగం కూడా లేకపోవడం గమనార్హం. ఈ ఫలితాలు చూసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, గతేడాది మొదటి బ్యాచ్‌లో ఇంటర్ చదివిన వారిలో ఫస్టియర్‌లో కేవలం 12శాతం మంది మాత్రమే పాసయ్యారు. అయితే ఫలితాలు దారుణంగా ఉండటంతో ప్రభుత్వం వీటిని బయట పెట్టకుండా గోప్యంగా ఉంచుతోంది.

పేరు కోసం గొప్పలు

ప్రతి మండలంలో బాలికల కోసం ఒక ఇంటర్మీడియట్ కాలేజీ ప్రారంభిస్తామని ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయలేకపోయారు. మాట తప్పారు అనే అపవాదు లేకుండా హైస్కూల్ ప్లస్ అనే ప్లాన్ చేసి, ఖర్చు లేకుండా కాలేజీల విధానం తెచ్చారు. ఎక్కడైతే కేజీబీవీలు లేవో ఆ మండలాల్లో ఒక ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించారు. దీనికి హైస్కూల్ ప్లస్ అనే పేరు పెట్టారు. ఎలాంటి వసతులు లేకపోయినా, హడావుడిగా 2022-23లో రాష్ట్రవ్యాప్తంగా 292 ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభించారు. 292 హైస్కూల్ ప్లస్‌లలో సుమారు 3200 మంది బాలికలు చేరారు. కానీ పూర్తిస్థాయిలో టీచర్లు లేకపోవడంతో బోధన అంతంతమాత్రంగానే సాగింది. చివరికి విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత అక్కడ బోధిస్తున్న 1752 మంది టీచర్లను పీజీటీలుగా గుర్తించారు. మరోవైపు ఇంటర్మీడియట్‌కు కీలకమైన ల్యాబ్స్‌ను ఎక్కడా నిర్మించలేదు. తీరా గత మార్చిలో జరిగిన పరీక్షల్లో సెకెండియర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడానికి సమీపంలోని కాలేజీలకు వెళ్లాల్సి వచ్చింది. పరీక్షలకైతే సమీపంలోని కాలేజీలకు వెళ్లారుగానీ, అసలు ముందు వారు ప్రాక్టికల్స్ ఎక్కడ నేర్చుకున్నారు? అంటే ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, ఈ సంవత్సర కొత్తగా మళ్లీ 210 ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేయడం కొసమెరుపు.

ప్రభుత్వ కాలేజీల్లోనూ అంతే..

ఇక ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ దారుణమైన ఫలితాలే వచ్చాయి. ఫస్టియర్‌లో 38శాతం మంది, సెకెండియర్‌లో 58శాతం మంది విద్యార్థులు మాత్రమే పాసయ్యారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో తక్కువ ఫలితాలు వస్తుండటం వల్లే ఇంటర్ విద్యా మండలి ఫలితాలను మేనేజ్‌మెంట్ల వారీగా ఇవ్వడం లేదు. మేనేజ్‌మెంట్ల వారీగా ఇస్తే ప్రభుత్వ కాలేజీలు, హైస్కూల్ ప్లస్‌లు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లోని ఉత్తీర్ణతా వైఫల్యం బయటపడుతుందనే ప్రభుత్వం వీటిని దాచిపెడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫస్టియర్.. అందరూ ఫెయిలే!

- రాజవొమ్మంగి హైస్కూల్ ప్లస్‌లో పరిస్థితి ఇది

రాజవొమ్మంగి, ఏప్రిల్ 12: అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో హైస్కూల్ ప్లస్ పేరిట ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో రెండేళ్లుగా ఫలితాలు ప్రభుత్వ తీరుకు అద్దం పడుతున్నాయి. గతేడాది 24 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా అందరూ ఫెయిలయ్యారు. దీంతో రెండో ఏడాది హైస్కూల్ ప్లస్‌లో అడ్మిషన్లకు అధికారులు, ఉపాధ్యాయులు నానా తంటాలుపడినా ఏ ఒక్కరూ కళాశాలలో జాయిన్ అయ్యేందుకు ఇష్టపడలేదు. చివరికి ఆరుగురు విద్యార్థినులు మొదటి ఏడాదిలో జాయిన్ అవ్వగా నలుగురు పరీక్షలు రాశారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో వారంతా ఫెయిల్ అయ్యారు. ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 23 మంది విద్యార్థుల్లో కేవలం ఆరుగురు మాత్రమే పాసయ్యారు.

ఇంటర్‌లో 72.2% ఉత్తీర్ణత

- గతంతో పోలిస్తే భారీగా పెరుగుదల
- ఫస్టియర్ 67.. సెకెండియర్ 78 శాతం
- కృష్ణా టాప్.. అల్లూరి, చిత్తూరు జిల్లాలు లాస్ట్
- ఈసారీ బాలికలదే పై చేయి
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఫలితాల్లో ఉత్తీర్ణత భారీగా పెరిగింది. గతంలో పోలిస్తే ఈ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,61,273 మంది పరీక్షలు రాస్తే 3,10,875 (67శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 3,93,757 మందికి గాను 3,06,528 (78శాతం) మంది పాసయ్యారు. మొత్తంగా 8,55,030 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,17,403 (72.2 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్ 38,483 మందికి గాను 23,181 (60శాతం), సెకెండియర్ 32,339 మందికిగాను 23,000 (71శాతం) మంది పాసయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్-2024 ఫలితాలను ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుబ్బారావు శుక్రవారం తాడేపల్లిలోని ఇంటర్ కార్యాలయంలో విడుదల చేశారు.

బాలికల ముందంజ

ఎప్పటిలానే ఈసారి కూడా ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో అబ్బాయిలు... 2,26,240 మందికి గాను 1,43,688 (64శాతం) మంది, సెకెండియర్‌లో 1,88,849 మందికిగాను 1,41,465 (75శాతం) పాసయ్యారు. ఫస్టియర్‌లో 2,35,033 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే 1,67,187 (71శాతం), సెకెండియర్‌లో 2,04,908 మందికిగాను 1,65,063 (81శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లోనూ అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు.

గత ఆరేళ్ల ఉత్తీర్ణత వివరాలు

	ప్రథమ సంవత్సరం			ద్వితీయ సంవత్సరం		
	హాజరు	ఉత్తీర్ణత	శాతం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2018	478613	295958	62	484936	336557	69
2019	476419	286934	60	480749	325569	68
2020	50723	300619	59	488839	289750	59
2021	466614	466615	100	474774	474774	100
2022	445604	241591	54	423455	258446	61
2023	433275	266326	61	379758	272001	72
2024	461273	310875	67	393757	306528	78

మేలో సప్లిమెంటరీ పరీక్షలు

సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. అప్పుడే ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు కూడా రాసుకోవచ్చని పేర్కొంది. ప్రాక్టికల్ పరీక్షలు మే 1 నుంచి 4వ తేదీ వరకు జరుగుతాయి. వీటికి ఈ నెల 18 నుంచి 24లోపు విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు కూడా ఈ నెల 18 నుంచి 24లోగా దరఖాస్తు చేసుకోలని సూచించింది.

భారీగా పెరిగిన ఉత్తీర్ణత

ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గతంతో పోలిస్తే చాలా ఎక్కువగా నమోదైంది. గత ఆరేళ్లలో సప్లిమెంటరీతో కలిపి కూడా రాని ఉత్తీర్ణత ఈసారి పబ్లిక్ పరీక్షల్లోనే వచ్చింది. ఇక సప్లిమెంటరీ పరీక్షల అనంతరం ఇది ఇంకా పెరుగుతుంది. 2018 నుంచి చూస్తే కోవిడ్ సంవత్సరం ఆల్ పాస్(2021) మినహా ఎప్పుడూ ఫస్టియర్‌లో 62శాతం దాటలేదు. కానీ ఇప్పుడు 67శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఆరేళ్లలో సెకెండియర్‌లో 72 శాతం అత్యధికం కాగా.. ఇప్పుడు 78 శాతం నమోదైంది.

అగ్రస్థానంలో కృష్ణా

జిల్లాల వారీగా ఫలితాలను చూస్తే కృష్ణా జిల్లా టాప్‌లో నిలిచింది. జనరల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో 84శాతంతో కృష్ణా టాప్‌లో ఉంటే, అల్లూరి సీతారామరాజు జిల్లా 48 శాతంతో లాస్ట్‌లో నిలిచింది. సెకెండియర్‌లో కృష్ణా 90శాతంతో అగ్రస్థానంలో ఉండగా, చిత్తూరు 63శాతంతో చివర్లో ఉంది. ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో మన్యం 77శాతంతో టాప్‌లో ఉంటే, కడప జిల్లా 48శాతంతో అట్టడుగున ఉంది. సెకెండియర్‌లో మన్యం 83శాతంతో అగ్రస్థానంలో ఉండగా, పల్నాడు 59శాతం చివర్లో మిగిలింది.

జిల్లాలవారీగా ఉత్తీర్ణత శాతాలు

జిల్లా	ఫస్టియర్	సెకెండియర్
కృష్ణా	84	90
గుంటూరు	81	87
ఎన్టీఆర్	79	87
విశాఖపట్నం	77	84
తూర్పుగోదావరి	75	83
ఏలూరు	72	80
తిరుపతి	70	81
నెల్లూరు	69	81
పశ్చిమగోదావరి	69	80
కర్నూలు	68	76
మన్యం	65	77
పల్నాడు	65	73
విజయనగరం	62	70
బాపట్ల	61	71
కాకినాడ	60	71
అనంతపురం	60	78
కోనసీమ	60	72
ప్రకాశం	59	72
నంద్యాల	59	70
శ్రీసత్యసాయి	58	76
శ్రీకాకుళం	57	67
కడప	55	69
అన్నమయ్య	53	69
అనకాపల్లి	52	66
చిత్తూరు	50	63
అల్లూరి	48	70

కృష్ణా టాప్.. అల్లూరి, చిత్తూరు జిల్లాలు లాస్ట్

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయ కేతనం

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను చింతు రేవతి 467 మార్కులతో ఫస్ట్ ర్యాంకు సాధించినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. 466 మార్కులకు పైన 17 మంది, 116 మంది 465కు పైగా, 1763 మంది 460 మార్కులకు పైగా సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకు గాను 436 మార్కులతో టి.దివ్య స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని, 18 మంది 435 మార్కుల కంటే ఎక్కువ, 360 మందికి 430 కంటే ఎక్కువ మార్కులు వచ్చాయన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఎ.వి.దుర్గా మధులిక 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్క్, బైపీసీలో ఎస్.పావని 991 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్క్, 12 మందికి 990 మార్కులకు పైన, 301 మందికి 985 మార్కులకు పైన, 1061 మందికి 980కి పైన, 20,569 మంది 900 మార్కుల కంటే ఎక్కువ సాధించారని సుష్మశ్రీ వెల్లడించారు.

ఇంటర్‌లో 'నారాయణ' ప్రభంజనం

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను స్టేట్ ఫస్ట్ మార్క్ 467, 466 మార్కుల పైన 35 మంది, 465 మార్కుల పైన 177మంది విద్యార్థులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. 1954 మందితో 460.. ఆపై అత్యున్నత మార్కులు ఏ విద్యాసంస్థ కూడా సాధించలేదని పేర్కొన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 14 మంది విద్యార్థులు 435 మార్కులు సాధించారని.. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు 991, 991 టాప్ మార్కులతోపాటు, ఆరుగురికి 990, 20 మందికి 989, 29 మందికి 988, 58 మంది 987 మార్కులు, సీనియర్ ఇంటర్ బైపీసీలో 988 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు.

'భాష్యం' విద్యార్థుల హవా

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షా ఫలితాలలో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జూనియర్ ఎంపీసీ విభాగంలో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎం.హేమప్రియహాసిని, జి.సాయిమనోజ్ఞ 470 మార్కులకుగానూ 466 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో మొత్తం 230 మంది విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారన్నారు. అదే విధంగా సీనియర్ ఎంపీసీ విభాగంలో జి.చంద్రలేఖ్య 1000 మార్కులకుగానూ 990 మార్కులు, బి.అభిజ్ఞ, ఎం.లహరి, పి.సాయిమనోజ్ఞ, కె. వినోదిని 988 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ విభాగంలో మొత్తం 97 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారని రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా జూనియర్ బైపీసీ విభాగంలో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ఎల్.నవ్య, షేక్ వసీమా 440 మార్కులకుగానూ 436 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. మొత్తం 68 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపీసీ విభాగంలో ఎం.హంసినిలాలిత్య, ఐ.యోషిత 1000 మార్కులకుగాను 985 మార్కులు, ఎస్.శ్రీషా 984 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

'విజ్ఞాన్' విజయభేరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు కె.లీలావతి (989), జి.వైశాలి (988), ఎం.స్నేహ (987), ఎస్‌కె.మీరావలి, కె.వంశీకృష్ణ (987), టి.సంజయ్ తేజ, సీహెచ్.మనస్వి (986) మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా చైతన్య చంద్రశేఖర్, జి.శశిధర్, జి.హారిక, వి.వి.మేఘన, టి.చైతన్య చంద్రశేఖర్, జి.శశిధర్ (985) మార్కులు సాధించారు. అదే విధంగా మొదటి సంవత్సరం విద్యార్థుల్లో వి.కౌశిక్ (466), జీవీఏ తేజస్వి, వై.పార్థసారథి, జె.హేమంత్ సందీప్, కె.విష్ణువర్ధన్, ఆర్.శ్రీకాంత్, ఎం.అఖిలేష్, ఎం.హర్షవర్ధన్ (464) మార్కులు సాధించారని తెలిపారు. ఇంకా బి.చాంద్‌బాషా, ఆర్.చరణ్‌తేజ, రామ సిద్దార్థ, ధనుష్ కోటి, సీహెచ్.నిఖిల, ఎల్.వర్షిత, పి.కంచన్ కుమార్, సీహెచ్.అక్షిత, టి.జాహ్నవి (463) మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంకా కె.లక్ష్మీ భవాని, ఎం.కవిత, ఒ.భవ్య, కె.యశస్వి (462)మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'రత్నం' ఘనత

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల స్థాపించిన ప్రథమ సంవత్సరంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు బైపీసీలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. బైపీసీ విభాగంలో సీహెచ్.జాహ్నవి 440 మార్కులకు 436 సాధించినట్లు చెప్పారు. ఎంపీసీ విభాగంలో జి.మునిసాయి రేవంత్ 470 మార్కులకు 463 సాధించారన్నారు. అలాగే ఎంపీసీ విభాగంలో 450 మార్కులకుపైగా 17 మంది, బైపీసీ విభాగంలో 415 మార్కులకుపైగా 9 మంది విద్యార్థులు రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. సమగ్ర బోధన, విద్యావిధానాలు, వినూత్న కార్యాచరణతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రుల సమష్టి కృషితోనే ఈ విజయాన్ని సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తామన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ నరసయ్య నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్కూటీ సరే...!

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ప్రతిచరాస్తి వివరాన్ని కచ్చితంగా తెలియచేయాలన్న నియమమేమీ లేదని సుప్రీంకోర్టు ఇటీవల ఓ తీర్పు సందర్భంగా తేల్చేయడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. పోటీచేస్తున్న అభ్యర్థికి సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకోవడం ఓటరుకు కచ్చితమైన హక్కేమీ కాదని కూడా కోర్టు ఈ సందర్భంలో వ్యాఖ్యానించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజు ప్రాంతం నుంచి 2019లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన కరిఖో క్రి అనే వ్యక్తి ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన కేసులో తీర్పు చెబుతూ సర్వోన్నత న్యాయస్థానం ఓటరుకూ, అభ్యర్థికీ మధ్య ఉన్న సంబంధం మీద లోతైన వ్యాఖ్యలు చేసింది. కరిఖో తన నామినేషన్‌తో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో కుటుంబీకుల పేరిట ఉన్న మూడు వాహనాల వివరాలు వెల్లడించలేదని, ఈ చరాస్తి వివరాలు దాచిపెట్టినందుకు అతడిని అనర్హుడుగా ప్రకటించాలని ప్రత్యర్థి కేసువేశాడు. గువాహటి కోర్టు కరిఖో ఎన్నికను రద్దుచేసింది. కానీ, అభ్యర్థి ప్రతీ చరాస్తినీ అఫిడవిట్‌లో చూపాలన్న నియమం ఏమీ లేదని, వివరాలన్నీ వెల్లడించకపోవడం తప్పుకాదని సుప్రీంకోర్టు అతడిని కాపాడుకొచ్చింది. ఆస్తి అత్యంత విలువైనదై, సదరు అభ్యర్థి విలాసవంతమైన జీవితాన్ని ప్రతిబింబిస్తే తప్ప జాబితాలో ప్రతీదీ రాయనక్కరలేదన్నది ఈ తీర్పు సారాంశం.

తీర్పులో భాగంగా చేసిన వ్యాఖ్యలు విస్తృత చర్చకు దారితీశాయి. అభ్యర్థికి సంబంధించిన వివరాలు తెలుసుకొనే హక్కు ఓటరుకు ఏ పాటిది, అభ్యర్థి ఎంతమేరకు గోప్యత పాటించవచ్చు అన్న ప్రశ్నలు ఉదయించాయి. ఖరీదైన జీవనశైలి అన్నదానిని ఎలా నిర్వచించాలన్న అనుమానాలను అటుంచితే, ప్రతీ ఆస్తివివరం చెప్పనంతమాత్రాన అది మోసం కాబోదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్య రాజకీయనాయకులకు ఇకపై ఎంతో స్వేచ్ఛనిస్తుందన్న భయాలూ మొదలైనాయి. కోర్టు ఇచ్చిన ఈ మినహాయింపు దాదాపు ప్రతీ ఏటా ఏదో ఒక ఎన్నిక ఎదుర్కొనే ఈ దేశంలో కొత్త సమస్యలు తెచ్చినా తేవచ్చు. తాను ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించి పుట్టుపూర్వోత్తరాలనుంచి ఆస్తులు, కేసుల వరకూ సమస్తమూ తెలుసుకొనే హక్కు ఓటరుకు ఉన్నదని, ఎంపిక వాటి ఆధారంగానే జరుగుతుందని అంటున్నప్పుడు ఆవగింజంత ఆస్తిని కూడా దాచకుండా తనకు ఎరుకలో ఉన్న ప్రతీ వివరాన్నీ అభ్యర్థి చెప్పాల్సిందే. కానీ, రాజకీయనాయకులకు కూడా ఇతరుల మాదిరిగానే గోప్యత హక్కు ఉన్నదని, ఓ చిన్న స్కూటీ గురించి చెప్పనంతమాత్రాన అతడు ఓటరును మోసం చేసినట్టు కాదని కోర్టు భావిస్తోంది. అభ్యర్థులు అన్నీ చెప్పనక్కరలేదు, పౌరులకు అన్నీ తెలియనక్కరలేదు అన్నది తీర్పు సారాంశం. పైగా, అఫిడవిట్ ద్వారా అభ్యర్థి వెల్లడించిన తన మొత్తం ఆస్తిపాస్తుల్లో, ఇలా చూపకుండా వదిలేసిన ఆస్తివిలువ ఆవగింజంత కూడా లేనందున దానిని పట్టుకొని అది ఉద్దేశపూర్వకంగా చేసినదిగా భావించలేమని, విస్మరించదగ్గదని కోర్టు వ్యాఖ్యానించడం విశేషం.

కరిఖో తన అఫిడవిట్‌లో చూపని చరాస్తులు ఒక స్కూటీ, ఓ మోటార్‌బైక్, ఓ చిన్నవ్యాన్ కావడం, వాటికారణంగా దిగువకోర్టు అతడిని అనర్హుడుగా ప్రకటించడం సుప్రీంకోర్టుకు బాధ కలిగించి వుంటుంది. అతడు ప్రకటించిన మొత్తం ఆస్తులు ఓ ఎనిమిదికోట్ల వరకూ ఉన్నందున ఆ మేరకు పోల్చిచూస్తే ఈ వాహనాల విలువ బాగా తక్కువే. కరిఖోవరకూ బాగున్నది కానీ, అదే సూత్రం ప్రకారం వేలాదికోట్ల ఆస్తిపాస్తులున్న ఓ అభ్యర్థి తన హెలికాప్టర్‌నో, ఇతరత్రా విలువైన వాహనాలనో అఫిడవిట్‌లో పేర్కొనకుండా వదిలేయవచ్చునా? అని కొందరి అనుమానం.

అభ్యర్థి గోప్యత హక్కును గుర్తిస్తూ, తన అభ్యర్థిత్వానికీ, ఓటరుకు సంబంధం లేని వివరాలు విప్పనక్కరలేదనీ, సమస్తం చెప్పనక్కరలేదనీ అన్న మినహాయింపు రాజకీయనాయకులకు ఎంతో ఆశ్వాసననిస్తుంది, ప్రత్యర్థులనుంచి రక్షిస్తుంది. కానీ, ఐదేళ్ళకోమారు మళ్ళీ ఎన్నికల్లో నిలబడి, తిరిగి అధికారం సాధించడం కోసం నాయకులు విధిలేక సమర్పించాల్సి వస్తున్న ఈ అఫిడవిట్లలో వారు సంపాదించినదంతా తెలియచెబుతున్నారన్న భ్రమలు ఎవరికీ లేవు. కానీ, తాము ఎన్నుకోబోయే వారి వివరాలు తెలుసుకొనే హక్కు, ఓటరు ఎంతో కష్టపడిసాధించుకున్నది. అది సంపూర్ణమైనది కాదు అని సర్వోన్నతన్యాయం తేల్చేయడం బాధాకరం. రాజకీయపార్టీలకు విరాళంగా వచ్చే ప్రతీరూపాయి ఎక్కడనుంచి వస్తున్నదో పౌరులకు తెలియాల్సిందేనని ఎన్నికలబాండ్ల గుట్టు విప్పిన సుప్రీంకోర్టు ఈ కేసులో గట్టిగా నిలబడివుంటే బాగుండేది.

2024: కాంగ్రెస్ సంకల్పాలు



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రగతిని, అభివృద్ధిని ఆశిస్తున్న వ్యక్తులు, సంస్థలు నిర్దిష్ట సందర్భాలలో విధిగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సంకల్పాలు చెప్పుకోవడం, మనోరథాలు వెల్లడించడం కద్దు. ఎన్నికలు అనే ప్రజాస్వామిక ప్రక్రియ రాజకీయ పక్షాలకు విధిగా వచ్చే ఒక ప్రత్యేక సందర్భం. ఎన్నికలలో గెలిచి అధికారాన్ని చేపట్టడమనేది ప్రతి రాజకీయపక్షానికి ఒక పరమ లక్ష్యంగా ఉంటుంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మన రాజకీయ పక్షాలు అన్నీ మానిఫెస్టోలను విడుదల చేస్తున్నాయి. సంబంధిత రాజకీయ పార్టీ లక్ష్యాల లిఖితపూర్వక ప్రకటనే ఒక మానిఫెస్టో. అది ఆ పార్టీ సంకల్ప పత్రం. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై సదరు రాజకీయ పార్టీ భావాలు, అభిప్రాయాలు ఆ పార్టీ మానిఫెస్టోలో ఉంటాయి. 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, ఆగస్టు 14–15, 1947న జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగం 'భవితవ్యంతో భేటీ' అన్నవి లక్ష్యాల ప్రకటనకు చరిత్రాత్మక ఉదాహరణలు. వాటిని తప్పక గుర్తు చేసుకోవలసి ఉన్నది. జూలై 24, 1991న, భారత ఆర్థిక వ్యవస్థను ఒక మౌలిక మలుపు తిప్పిన తన చరిత్రాత్మక ప్రసంగంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ విఖ్యాత ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో మాటలను ఉటంకించారు. 'ఒక భావం, ప్రపంచాన్ని ప్రభావితం చేసే సమయం ఆసన్నమయినప్పుడు ధరిత్రిపై ఏ శక్తి కూడా ఆ భావ గమనాన్ని, పురోగతిని నిరోధించలేదు' అని విక్టర్ హ్యూగో ఉద్ఘోషించాడు. ఆ ప్రకటనలు, లక్ష్యాలు స్వాతంత్ర్యం సాధించుకున్న దేశాల కొత్త పాలకుల ఉద్దేశాలు, ఆశయాలను స్పష్టంగా, సకల మానవాళిని ప్రభావితం చేసేలా ప్రకటితమయ్యాయి.

ఒక ప్రకటన, దాన్ని ప్రకటించిన వ్యక్తి నిజ ఉద్దేశాలనూ దాచిపెట్టగలదు. మిథ్యా ప్రవక్తలు మోసపూరిత ప్రకటనలు చేస్తారు. నరేంద్ర మోదీని వెన్నాడే ప్రకటనలు: 'ప్రతి భారతీయుని బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తాను'; 'ఏటా 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తాను'; రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాను' మొదలైనవి. ఆయన సహచరులే ఆ ప్రకటనలను పరిహసించారు. అవన్నీ ఎన్నికల జుమ్లా (వంచన)గా వాటిని కొట్టివేశారు.

ఆసేతు హిమాచలం భారత ప్రజలను విశేషంగా ప్రభావితం చేయగల రెండు ప్రధాన రాజకీయ పక్షాలు: భారత జాతీయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ. బీజేపీ తన మానిఫెస్టో కమిటీని మార్చి 3న ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ తన మానిఫెస్టోను ఏప్రిల్ 5న విడుదల చేసింది. నిజానికి ఈ కాలమ్‌లో ఆ రెండు మానిఫెస్టోలను తులనాత్మకంగా పరిశీలించాలని అనుకున్నాను. అయితే కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో మాత్రమే అందుబాటులో ఉన్నది. కాంగ్రెస్ మానిఫెస్టోలోని ప్రముఖ అంశాలను క్లుప్తంగా, నిశితంగా పేర్కొంటాను. బీజేపీ మానిఫెస్టో అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ రెండు పార్టీల మానిఫెస్టోలను పాఠకులు, ఓటర్లు తులనాత్మకంగా పరిశీలించగలరని ఆశిస్తున్నాను.

తొలుత భారత రాజ్యాంగం గురించి కాంగ్రెస్ ఏమి చెప్పిందో చూడండి: 'ఎప్పటికీ ముగియబోని మా ప్రస్థానంలో భారత రాజ్యాంగమే మాకు ఏకైక మార్గదర్శిగా, సహవాసిగా ఉంటుంది'. మరి బీజేపీ సైతం ఆ రాజ్యాంగానికి నిబద్ధమై ఉంటుందా లేక మౌలికంగా దాన్ని సవరించి వేస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి భారత ప్రజలు ఆతురత పడుతున్నారు. బీజేపీ నిబద్ధత విషయమై ఈ ప్రశ్న ఎందుకు తలెత్తింది? 'ఒకే జాతి, ఒకే ఎన్నిక; ఉమ్మడి పౌర స్మృతి, పౌరసత్వ సవరణ చట్టం తదితర విచ్ఛిన్నకర భావాలు దేశ ప్రజలను కలవరపరుస్తున్న సందర్భం కదా ఇది. భారత రాజ్యాంగం ఔదలదాల్చిన వెస్ట్ మినిస్టర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు తాను కట్టుబడి ఉండేది లేనిదీ దేశ ప్రజలకు బీజేపీ స్పష్టం చేయాలి.

సామాజిక–ఆర్థిక విధానాలు, కులాల వారీ జనగణన, రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ తన ఉద్దేశాలను స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సకల ప్రజల సామాజిక– ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తుంది. కులాల వారీ జనగణనకు కాంగ్రెస్ దృఢ సంకల్పంతో ఉన్నది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేసేందుకై రాజ్యాంగాన్ని సవరించేందుకు కాంగ్రెస్ సుముఖంగా ఉన్నది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో కల్పిస్తున్న 10శాతం రిజర్వేషన్లను అన్ని కులాల వారికి, సామాజిక సమూహాలకు కూడా వర్తింపచేసేందుకు కాంగ్రెస్ సంసిద్ధంగా ఉన్నది. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో సకల సామాజిక వర్గాల వారికి స్థానం కల్పించేందుకు ఒక డైవర్శిటీ కమిషన్ నేర్పాటు చేసేందుకు కాంగ్రెస్ సంకల్పించింది. ఆ రంగాలలో సామాజిక వైవిధ్యం ఏ స్థాయిలో ఉన్నదో కూడ ఎప్పటికప్పుడు అంచనా వేయడం ఆ కమిషన్ కర్తవ్యంగా ఉంటుంది. బీజేపీ తన సంది‌గ్ధతను విడనాడి, ఈ ప్రస్తావిత అంశాలపై తన ఉద్దేశాలు, లక్ష్యాలను స్పష్టం చేయాలి. సమానవకాశాల కల్పన ద్వారా సమానత్వ సాధన అనే విస్తృత అంశంపై కాంగ్రెస్, బీజేపీ వైఖరులు ఏమిటో ప్రజలకు విశదమవుతాయి.

భారతదేశంలో మతపరమైన, భాషాపరమైన మైనారిటీలు అధిక సంఖ్యలో ఉన్నారు సొంత విశ్వాసాలను ఆచరించడంతో సహా మానవ హక్కులను సమరీతిలో పొందేందుకు సమస్త భారతీయులు అర్హులే అని కాంగ్రెస్ దృఢంగా విశ్వసిస్తోంది. మెజారిటేరియనిజం లేదా నిరంకుశత్వ వాదాలకు ఎటువంటి తావు లేదు. బహుళత్వం, వైవిధ్యం భారతీయ సంస్కృతి విశిష్ట విలువలు. మైనారిటీలను కాంగ్రెస్ 'బుజ్జగిస్తుందని' బీజేపీ ఏనాటి నుంచో ఆరోపిస్తూ వస్తోంది 'బుజ్జగింపు అనేది బీజేపీ మైనారిటీ వ్యతిరేకతకు ఒక సంకేత నామం. పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలుపరచడం, ఉమ్మడి పౌర స్మృతికి పార్లమెంటు ఆమోదాన్ని పొందే విషయమై బీజేపీ తన దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటించగలదా? ఆ రెండు చట్టాలు పూర్తిగా వివక్షాపూరితమైనవని కలవరపడుతున్న మైనారిటీలు బీజేపీ మానిఫెస్టో కోసం ఉత్కంఠ, వ్యాకులతతో ఎదురు చూస్తున్నారు.



'ఎప్పటికీ ముగియబోని మా ప్రస్థానంలో భారత రాజ్యాంగమే మాకు ఏకైక మార్గదర్శిగా, సహవాసిగా ఉంటుంది' అని భారత జాతీయ కాంగ్రెస్ తన ఎన్నికల మానిఫెస్టోలో స్పష్టం చేసింది. మరి బీజేపీ సైతం ఆ రాజ్యాంగానికి నిబద్ధమై ఉంటుందా లేక దాన్ని మౌలికంగా మార్చివేస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి భారత ప్రజలు ఆత్రుత పడుతున్నారు.

భారతదేశ 'జనాభా లబ్ధి' (డెమోగ్రాఫిక్ డివిడెండ్) క్రమంగా తగ్గిపోతోంది. ఆర్థిక వ్యవస్థ సగటు వృద్ధిరేటు (5.9 శాతం) సంతృప్తికర స్థాయి కన్నా తక్కువగా ఉండడం వస్తూత్పత్తిరంగం (స్థూలదేశీయోత్పత్తిలో 14 శాతం) పురోగతి స్తంభించిపోవడం, నిరుద్యోగిత (గ్రాడ్యుయేట్స్‌లో 42 శాతం) అంతకంతకూ పెరిగిపోవడమే జనాభా లబ్ధి తగ్గిపోయేందుకు ప్రధాన కారణాలు. కేంద్ర ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, రైట్ టు అప్రెంటిస్‌షిప్ ఆక్ట్‌ను ఆమోదిస్తామని, కొత్త ఉద్యోగాలను ప్రోత్సహించే కార్పొరేట్ కంపెనీలకు ప్రోత్సాహక పథకాలు అమలు పరుస్తామని, స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు ఒక ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకాన్ని ప్రారంభిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ హామీలు యువతను అమితంగా ఆకట్టుకుంటున్నాయి యువతకు ఉద్యోగాలు సృష్టించే విషయమై బీజేపీ– ఎన్డీఏ ప్రభుత్వానికి విశ్వసనీయమైన పథకమేదీ లేదు. మరి రాజకీయ పక్షమైన బీజేపీ మరింత ఆకర్షణీయమైన పథకాన్ని ప్రతిపాదించగలదా?

ఎన్నికల ప్రక్రియలో మహోత్సాహంతో పాల్గొనే ఓటర్లలో మహిళలు ముఖ్యమైనవారు అనడంలో సందేహం లేదు. ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీ నాయకుల ప్రసంగాలను వారు శ్రద్ధగా వింటారు. ఆ ప్రసంగాల గురించి మహిళా ఓటర్లు తమలో తాము చర్చించుకోవడం కద్దు. మహిళల శ్రేయస్సుకు మహాలక్ష్మి పథకం (ప్రతి పేద కుటుంబానికి ఏటా రూ.లక్ష ఆర్థిక సహాయం, ఉపాధి హామీ లబ్ధిదారులకు రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచడం, మహిళా బ్యాంకు పునరుద్ధరణ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు మొదలైన కాంగ్రెస్ హామీలపై మహిళలు, యువతులు విశేష ఆసక్తి చూపుతున్నారు. మరి బీజేపీ మతపరమైన ఉద్వేగాలను (హిందూత్వ) రెచ్చగొట్టి ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మాత్రమే పరిమితమవుతుందా? లేక నిర్దిష్ట పథకాలు, కార్యక్రమాలతో ప్రజల ముందుకు వస్తుందా అనేది వేచి చూడాలి.

ప్రజల మాటా మంతీలో బాగా వినిపిస్తున్న అంశం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనా పద్ధతులు. సమాఖ్య పాలనా విధానాన్ని, రాష్ట్రాల కలయికే ఇండియా అన్న రాజ్యాంగ ప్రకటనను బీజేపీ ప్రభుత్వం బలహీనపరిచింది. ఆ పార్టీ ప్రవచిస్తున్న ఒక జాతి, ఒకే ఎన్నిక సిద్ధాంతం సందేహాస్పదమైనది. అది అంతిమంగా ఒకే జాతి, ఒకే ఎన్నిక, ఒకే ప్రభుత్వం, ఒకే పార్టీ, ఒకే నాయకుడుకు దారితీయడం ఖాయం. కాంగ్రెస్ మానిఫెస్టోలోని ఒక అధ్యాయంలో సమాఖ్య పాలనా విధానంపై 12 అంశాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానినైనా బీజేపీ అంగీకరిస్తుందా? ఉమ్మడి జాబితాలోని కొన్ని అంశాలను రాష్ట్రాల జాబితాలోకి మార్చే విషయమై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కాంగ్రెస్ నిబద్ధమై ఉన్నది. ఈ విషయమై అది ఇచ్చిన హామీ పర్యవసానాలు బహుముఖంగా ఉంటాయనడంలో సందేహం లేదు. సమాఖ్య పాలనా విధానం పట్ల బీజేపీ నిబద్ధతను ఈ పన్నెండు అంశాలు పరీక్షించనున్నాయి.

రాజ్యాంగానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, మానవ హక్కుల పరిరక్షణకు వ్యక్తి స్వేచ్ఛ, గోప్యత, రాజ్యాంగ నైతికతకు ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీల నిబద్ధతే ఈ సార్వత్రిక ఎన్నికలలో అతి ముఖ్యమైన అంశమని నేను భావిస్తున్నాను. రాజ్యాంగాన్ని ఔదల దాల్చి, అది గౌరవించే ప్రజాస్వామిక సూత్రాలను సమర్థించే అభ్యర్థికే నా ఓటు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ప్రజాస్వామ్యం డొల్లతనాన్ని నాడే పసిగట్టిన అంబేడ్కర్

'ప్రజాప్రభుత్వం అని చెప్పుకునే హంగులెన్ని ఉన్నా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిజానికి వంశపారంపర్య పాలక వర్గాలతోనూ, వంశపారంపర్య పాలిత వర్గాలతోనూ కూడిన ప్రభుత్వమే' – ఇవి అంబేడ్కర్ మాటలు. 1943 సెప్టెంబర్‌లో 'ఆలిండియా ట్రేడ్ యూనియన్ వర్కర్స్ స్టడీ క్యాంపు'లో ముగింపు ఉపన్యాసంలో అంబేడ్కర్ ఈ మాటలన్నారు. వంశపారంపర్య పాలననీ కుటుంబ పార్టీలనీ ఓడించటానికే ఈ ఎన్నికలు అని మోదీ రోజూ చెప్పుకు తిరుగుతున్న తరుణంలో దీని మూలకారణాలేమిటో తెలుసుకోటం అవసరం. 1943 అంటే స్వతంత్రం ఇంకారాలేదు. కానీ అప్పటికే అంబేడ్కర్ 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గూర్చి ఇండియా చర్చలు సాగిస్తున్నది' అంటూ ఇలా చెప్పారు: 'తస్మాత్ జాగ్రత్త! పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పైకి కనిపించినట్టుగా అత్యుత్తమ వ్యవస్థేమీ కాదని భారతీయులకు చాటిచెప్పగల ధైర్యవంతుడి అవసరం ఉంది.' ఈ ఉపన్యాసంలోని అనేక భావనల్ని పాలకవర్గ పండితులూ, అంబేడ్కర్ వాదులే కాదు, వామపక్షీయులు కూడా తెలిసో తెలియకో ఉటంకించరు. తెలిసినవారూ మరుగుపరుస్తుంటారు. నేటి పార్లమెంటు ఎన్నికల తరుణంలో ఈ ఉపన్యాసంలోని భావనల క్లుప్త పరిచయమే ఈ వ్యాసం.

'అన్ని రాజకీయ సమాజాలూ పాలక, పాలిత వర్గాలుగా చీలిపోయి ఉన్నాయి. ఇదొక దుర్లక్షణం. ఈ దుర్మార్గం అక్కడికి ఆగితే అంతగా పట్టించుకోనక్కర్లేదు. కానీ ఇంకా దౌర్భాగ్యం ఏమిటీ అంటే ఈ చీలిక ఒక మూస లాగా తయారై, వర్గాల దొంతరగా ఘనీభవించి పోయింది. ఎంతగా అంటే పాలకులు ఎల్లప్పుడూ పాలకవర్గాల నుంచే ఉంటారు, పాలితులు ఎప్పటికీ పాలకవర్గాలు కాజాలరు. ప్రజలు తమ్ముతాము పరిపాలించుకోరు. ప్రభుత్వం ఏర్పాటవుతుంది, దాన్ని పాలకవర్గాలకు వదిలేస్తారు. ఇది తమ ప్రభుత్వం కాదన్న విషయాన్ని ప్రజలు మర్చిపోతారు. కాబట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం 'ప్రజల యొక్క – ప్రజల చేత' ప్రభుత్వం ఏనాడూ కాదు, ఫలితంగా 'ప్రజల కొరకు' ప్రభుత్వంగా



'తస్మాత్ జాగ్రత్త! పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పైకి కనిపించినట్టుగా అత్యుత్తమ వ్యవస్థేమీ కాదని భారతీయులకు చాటి చెప్పగల ధైర్యవంతుడి అవసరం ఉంది' అని హెచ్చరించారు అంబేడ్కర్. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం 'ప్రజల యొక్క – ప్రజల చేత' ప్రభుత్వం ఏనాడూ కాదు, ఫలితంగా 'ప్రజల కొరకు' ప్రభుత్వంగా ఎన్నడూ లేదు' అని తీర్మానించారు.

ఎన్నడూ లేదు. రాజకీయ జీవనం ఇలా దుర్మార్గంగా నిర్మితమై ఉన్నందున ఈ ప్రజాస్వామ్యం ఘోర వైఫల్యంగా మిగిలిపోయింది,' అని తీర్మానించారు అంబేడ్కర్.

యూరప్‌లో నిరంకుశ ఫ్యూడల్ రాజరికాలు ప్రజాస్వామిక విప్లవాల్లో పతనమైపోయాయి. ముఖ్యంగా ఫ్రెంచి విప్లవ పర్యవసానమే 'స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' అన్న ప్రజాస్వామిక భావనలు. అయితే అవి చాలా పరిమితమైనవనీ, ఆధునిక పెట్టుబడిదారీ దోపిడీకి ఆలంబనలనీ తర్వాత (రష్యాలోనూ, చైనాలోనూ వచ్చిన శ్రామిక విప్లవాల ద్వారా) రుజువైంది. పెట్టుబడిదారీ (బూర్జువా) ప్రజాస్వామ్యం స్థానంలో ప్రజలకు చెందిన 'జనతా ప్రజాస్వామ్యం' అన్న పద్ధతికి అవి నాంది పలికాయి. దారుణ దోపిడీ పద్ధతుల్ని రద్దు చేసిన విప్లవాలుగా, మానవాళి మహాప్రస్థానంలో చారిత్రక మైలురాళ్లుగా అవి నిలిచాయి. సామ్రాజ్యవాదం ఎంత నిర్దాక్షిణ్యంగా, విధ్వంసకారిగా ఉంటుందో 1943 సెప్టెంబర్ నాటికి ప్రపంచ యుద్ధంతో తేటతెల్లమైంది. ఆధునికయుగ విహంగ వీక్షణం చేస్తూ అంబేడ్కర్ ఇలా అంటారు: 'నిరంకుశ రాజరికాలకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన, రక్తపాతంతో కూడిన పోరాటాల తర్వాత వాటి స్థానంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నెలకొన్నది. పాలనా వ్యవస్థలో 'ఇదే ఆఖరి మాట' అని తొలుత భావించారు. ప్రతి మానవుడికీ స్వేచ్ఛ, ఆస్తి, సుఖ సంతోషాలూ లభించే కొత్త సహస్రాబ్దిలోకి అడుగుపెడుతున్నాం అని నమ్మారు. అయితే ఆశ్చర్యకర పరిణామాలు సంభవించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సార్వజనీనంగా ఆమోదించి శతాబ్ది కూడా కాకుండానే ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు వచ్చింది. ఫాసిజం ఉన్నచోటే కాక, ఇతర దేశాల్లోనూ తిరుగుబాటు వచ్చింది' అని అంబేడ్కర్ ఎత్తి చూపారు. అలాంటి తరుణంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కావాలని ఇండియా బ్రిటన్‌తో చర్చలు జరుపుతున్నదంటూ, 'పైకి కనిపించినట్టుగా ఇదేమీ అత్యుత్తమ వ్యవస్థ కాదని వారికి చెప్పే ధైర్యం ఎవరైనా చేయాలి' అని అంబేడ్కర్ కోరారు. పెట్టుబడిదారీ దేశాల్లోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు వర్గస్వభావాన్ని అంబేడ్కర్ చర్చించారు కానీ, ఇండియాలో అది మరింత వికృత రూపాలు దాల్చింది. భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి దున్నేవారికే భూమిని పంచకుండా, నిజమైన ప్రజాస్వామ్యానికి పునాదైనా పడదు. అయినా అర్ధవలస, అర్ధఫ్యూడల్ పునాదుల్ని అలాగే ఉంచి ఉపరితల వ్యవస్థగా, పై మెరుగుగా మనదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇక్కడా బ్రిటిష్ పాలనా పద్ధతులే కావాలని మన దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలూ, వారి రాజకీయ ప్రతినిధులూ కోరుకున్నారు.

1942 క్విట్ ఇండియా మూలంగా ఆగ్రహించిన బ్రిటిష్ వారితో బేరసారాల ప్రక్రియ ఆగిపోయిన తరుణంలో టాటాబిర్లాలు బ్రిటిష్ పాలకులతో మంతనాలు జరిపి, వారితో రాజీకీ, 'కామన్వెల్త్'కి లోబడిన డొమినియన్‌లో బ్రిటిష్ నమూనా పాలనకూ పునాదులు వేశారు. 1935 రాజ్యాంగ నకలుగా, బ్రిటిష్ పాలకులిచ్చిన రెండు ముసాయిదాల ఆధారంగా రూపొందినదే 1950 రాజ్యాంగం. ఈ వైరుధ్యాలన్నీ అంబేడ్కర్‌కు బాగా తెలుసు. అందుకే తుదిముసాయిదా ఆమోదం సందర్భంగా 1949 నవంబర్ 25 నాటి రాజ్యాంగ సభ ఉపన్యాసంలో ఇలా హెచ్చరించారు: '1950 జనవరి 26 నాడు మనమొక వైరుధ్యాలమయమైన జీవనంలోకి అడుగుపెడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక–ఆర్థిక జీవనంలో అసమానత అలాగే ఉంటుంది. ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించి తీరాలి. లేకపోతే ఈ రాజ్యాంగ సభ ఎంతో కష్టపడి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థని అసమానతలకు బలైన వర్గాలు విధ్వంసం చేస్తారు.' వంశపారంపర్య పాలకులతో కూడిన మన దేశ కుహనా ప్రజాస్వామ్యం నెహ్రూ గాంధీ కుటుంబాల కోరిక మేరకే ఏర్పడలేదనీ, దానికి మన వ్యవస్థలో చాలా లోతైన పునాదులున్నాయనీ పై వివరణ తెలియజేస్తున్నది.

నిజానికలాంటి కుటుంబాలు కాంగ్రెసుకే పరిమితం కాలేదు. గ్వాలియర్ రాజమాత సింధియా మొదలైన ఫ్యూడల్స్ దేశవ్యాప్తంగా నాటి జనసంఘ్ పార్టీకి పునాదులు వేసి రాజపోషణ చేశారు. ఇందిరమ్మ రాజభరణాలు రద్దుచేస్తే వాజపేయీ వారిపక్షాన పార్లమెంటులో వ్యతిరేకించారు. మనది అనాదిగా ప్రజాస్వామ్యమేనని సంఘీయులు చెప్తుంటారు: భరతుడు పద్నాలుగేళ్ల పాటు చెప్పులు సింహాసనంపై పెట్టి ఏలిన రామరాజ్యమూ, వారసత్వ హక్కుకై పోరాడిన ఝాన్సీరాణీ మన ఆదర్శం. అనేకమంది మాజీ ముఖ్యమంత్రుల్నీ కాదని, కర్ణాటకలో యడ్యూరప్ప కొడుకుని రాష్ట్ర బీజేపీ నేతగా నియమించారు; అవినీతి అంటూ తామే పార్టీ నుంచి బహిష్కరించిన నేత ఆయన. అవినీతి అవసరం గుర్తించిన మోడీ-షాలు గనుల రారాజులైన గాలి జనార్దనరెడ్డి సోదరులకు బళ్ళారి రాజ్యాన్ని మళ్లీ ఈ మధ్యే అప్పగించారు. మైసూరు మహారాజా మనవడిని లోక్‌సభకు అభ్యర్థిగా నిలబెట్టారు. ఇన్ని చెప్పిన అంబేడ్కర్ తర్వాత ఆ వ్యవస్థతోనే రాజీ పడ్డారు కదా అంటే – నేనొక కిరాయి రచయితని (hack), ఇష్టంలేని పనులన్నీ చేసాను, ఈ రాజ్యాంగాన్ని తగులబెడుతాను అన్న మాటలే ఆయనిచ్చిన సమాధానం.

■ ఎమ్. జయలక్ష్మి
రిటైర్డ్ ఏజీఎం, ఆప్కాబ్

దేశ చరిత్రలో చీకటి ఘట్టం

రక్తంతో తడిసిన నేల, బాధతో నిండిన ఆకాశం, జలియన్ వాలాబాగ్ ఘటన ఒక మారణ హోమం. నిరాయుధులైన ప్రజలపై బ్రిటిష్ దురాగతం. వేల మంది ప్రాణాలు ఒక్కసారిగా గాలిలో కలిసిపోయాయి. జలియన్ వాలాబాగ్ ఘటన, ఒక చారిత్రక మలుపు, భారతీయులలో స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింత బలపరిచింది. 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్ వాలాబాగ్ ఊచకోతగా పిలువబడే ఈ సంఘటనలో, బ్రిటిష్ దళాలు నిరాయుధులైన భారతీయుల సమావేశంపై కాల్పులు జరిపి, వందలాది మందిని చంపాయి. ఈ దారుణం భారతీయుల హృదయాల్లో బ్రిటిష్ పాలన పట్ల తీవ్రమైన ద్వేషాన్ని పెంచింది. 1919లో, భారతదేశం రౌలట్ చట్టం అనే అణచివేత చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు జరుపుతోంది. ఈ చట్టం బ్రిటిష్ ప్రభుత్వానికి ఎవరినైనా విచారణ లేకుండా నిర్బంధించే అధికారాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 13న, బైసాఖీ పండుగ సందర్భంగా, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో భారీ సమావేశం జరిగింది. బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ ఎడ్వర్డ్ డయ్యర్ నేతృత్వంలోని బ్రిటిష్ దళాలు ఈ సమావేశంపై కాల్పులు జరపాలని ఆదేశించాయి. బ్రిటిష్ దళాలు సమావేశంపై పది నిమిషాల పాటు కాల్పులు జరిపాయి. ఈ దాడిలో 379 మంది మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి, అయితే మరణించినవారి సంఖ్య 1000కు పైగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనకు నిరసనగా, మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని 1920 సంవత్సరంలో ప్రారంభించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ బ్రిటిష్ బిరుదులను తిరిగి ఇచ్చారు. భగత్ సింగ్ విప్లవకారుడుగా మారటానికి ఈ సంఘటన ఒక కారణం. జలియన్ వాలాబాగ్ ఊచకోత భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను మరింత బలపరిచింది. ఊచకోతకు కారణమైన బ్రిటిష్ అధికారులను శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. 1920లో ఈ దుర్ఘటన జరిగిన స్థలంలో ఒక స్మారక స్థూపాన్ని నిర్మించడానికి నాటి భారత జాతీయ కాంగ్రెస్ తీర్మానం చేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1961లో ఏప్రిల్ 13న అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల సమక్షంలో ఈ స్థూపం ఆవిష్కరించబడింది. ఏది ఏమైనా ఈ సంఘటన భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక చీకటి రోజుగా పరిగణించబడింది. జలియన్ వాలాబాగ్‌లో మరణించిన అమరవీరులకు నివాళి అర్పిస్తూ, జైహింద్!

– పూసపాటి వేదాద్రి

ఓటుబొమ్మ కాదు, కోట్లజనం గొంతు!

రాజకీయప్రజాస్వామ్యం కంటే సామాజికప్రజాస్వామ్యాన్నే ఎక్కువగా ఆకాంక్షించిన అంబేడ్కర్ ఆలోచనలకు విరుద్ధంగా నేటి ప్రభుత్వాలు దిమ్మలు కట్టి బొమ్మలు పెట్టి మభ్యపెడుతున్నాయి. ఈ విషయాన్ని దళిత, బహుజన మేధోవర్గం గ్రహించాలి. భవిష్యత్‌తరాల్లో పెంపొందించవలసిన అంబేడ్కర్ స్ఫూర్తిని పక్కదోవ పట్టిస్తున్నారనే సంగతిని సైతం గుర్తించాలి. అప్పుడే అంబేడ్కర్ అంటే ఓటు బొమ్మకాదు, కోట్ల జనం గొంతు అనే విషయం పాలకుల తలకెక్కుతుంది. ఈ దేశంలో సామాజిక వెలివేతకు గురయిన కోట్లాదిమంది స్వరం తానొక్కడే అయి పోరాడిన ఆ యోధుడి సిద్ధాంతాలు ఆచరణలోకి వస్తాయి. ఆ సమోన్నత స్త్రీ విమోచకుడిని, రాజనీతిజ్ఞుడిని ఓటుబొమ్మను చేసి ఆడుకుంటున్నవారి ఆలోచనలకు సంకెళ్ళు పడతాయి. అదే ఆయనకు నిజమైన నివాళి అని ప్రభుత్వాలు గుర్తించాలి. అలా గుర్తించేలా సమస్త దళితజనం గుణపాఠం నేర్పాలి.



అంటరానితనాన్ని సమూలంగా అంతమొందించాలని ప్రపంచ వేదికల మీద హక్కుల స్వరాన్ని బలీయంగా వినిపించిన నిమ్నజాతుల విమోచకుడు బాబాసాహెబ్ అంబేడ్కర్. ఆ దిశగా సాగిన పోరాటం ఈనాటికీ భారత సామాజికచట్రాన్ని కుదిపేసే పరిణామమే. అందుకే 'జీవించి ఉన్న అంబేడ్కర్ కంటే మరణించిన అంబేడ్కర్ మరీ ప్రమాదకరం' అన్నాడు ధనంజయ్ కీర్. తిలక్, సావర్కర్, భగత్‌సింగ్, పూలే జీవితచరిత్రలు రాసిన కీర్, అంబేడ్కర్ జీవితచరిత్రనూ రాశారు. దక్షిణాసియా రాజనీతిజ్ఞుడు ప్రొఫెసర్ క్రిష్టఫర్ జఫర్‌లాట్ కీర్‌ను కొనియాడుతూ అంబేడ్కర్‌ని గొప్పగా ఆవిష్కరించిన పరిశోధకుడని అన్నారు. మన భారతావనిలో అంబేడ్కర్ విగ్రహం లేని దళితవాడ ఒక్కటీ లేదు. వాటిలో ప్రాణత్యాగాలతో నిర్మాణం జరిగిన విగ్రహాలూ చాలానే ఉన్నాయి. అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడమంటే దళితకులాలకు ఒక పండుగే కాదు మహోద్యమం. ఈ పరిస్థితుల్ని పసిగట్టిన రాజకీయపార్టీలు అంబేడ్కర్ విగ్రహాలతో లబ్ధి పొందడం కోసం నిత్యం ప్రయత్నిస్తున్నాయి. ఆ క్రమంలోనే గతంలో మాయావతి ఉత్తరప్రదేశ్‌లో స్మృతివనం నిర్మించారు. తెలంగాణలో కేసీఆర్ భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరో అడుగుముందుకేసి రూ. 400 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో స్మృతివనాన్ని కట్టించారు.

ఇలా దేశమంతా పుట్టుకొస్తున్న స్మృతివనాల మధ్యలో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్న భారీ అంబేడ్కర్ విగ్రహాలు ప్రభుత్వాల వైఖరిని తేటతెల్లం చేస్తున్నాయి. వాస్తవానికి ఆయన ఆశించిన అభివృద్ధి, సంక్షేమాల్ని అమలు చేయడం కోసం ఇదంతా జరగడం లేదు. కేవలం ఆయనను అభిమానించే కోట్లాదిజనం ఓట్ల కోసం మాత్రమే ఈ తతంగం సాగుతోందని సామాన్యులకు సైతం తెలిసిపోతోంది. తెలంగాణలో ప్రేమ వివాహాలు చేసుకున్న దళితులు మంథనీ మధుకర్, ప్రణయ్‌లను భయంకరంగా హత్య చేశారు అనేక రాష్ట్రాలలో ఇలాంటి ఘటనలే ఎన్నో జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని అంతమొందించలేనప్పుడు ఇక రాజ్యాంగస్ఫూర్తి అనేది ఎక్కడుంది? పోటీపడి విగ్రహాలు ఏర్పాటు చేయడం కంటే ప్రాథమికహక్కుల్ని పరిరక్షించడం ముఖ్యవిధి అని ఈ ప్రభుత్వాలు ఎప్పటికి గుర్తెరుగుతాయో అర్థం కావడం లేదు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రత్యామ్నాయ సాంస్కృతిక శిఖరమంటూ ఘనంగా చాటుకుంటోంది. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రత్యేకబస్సుల్లో దళితుల్ని తీసుకొచ్చి స్మృతివనాన్ని చూపిస్తున్నారు. దళితజాతి కోసమే జగన్మోహన్‌రెడ్డి దాన్ని నిర్మించారని, మళ్ళీ ఆయన్నే గెలిపించుకోవాలని వాళ్ళకు చెబుతున్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం అంబేడ్కర్‌ను ఇలా ఓటుబొమ్మగా మలిచేస్తున్నారు. దళితుల అభివృద్ధి నిజంగా ప్రభుత్వ ధ్యేయమే అయితే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి, వృత్తినైపుణ్యాలు పెంచి, రుణాలు మంజూరు చేసి వాళ్ల ఉన్నతికి తోడ్పడాలి. విద్యార్థులకు సకాలంలో ఉపకారవేతనాలు, విద్యారుణాలు అందించి ఆదుకోవాలి. అలా కాకుండా ప్రాథమికహక్కుల్ని కూడా పథకాలుగా మార్చేసి బటన్ నొక్కి పండుగ చేసుకోవడం శ్రేయోరాజ్యస్ఫూర్తికి పూర్తి విరుద్ధం. అంబేడ్కర్ పేరిట ఉన్న ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ పథకాన్ని జగన్‌రెడ్డి తన పేరు మీదకి మార్చుకున్నారు. అంబేడ్కర్ పట్ల ఆయనకున్న గౌరవం ఎంతో ఈ చర్యే బట్టబయలు చేస్తోంది.

రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థను శక్తివంతమైన వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రగల్భాలు పలికిన జగన్ కొత్తగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్యకళాశాలల్లో సగం సీట్లను రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించి కోట్లాదిరూపాయల ఫీజులకు అమ్ముకుంటున్నారు. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం కింద వైద్యం చేయడానికి కార్పొరేట్ ఆసుపత్రులు నిరాకరిస్తున్నాయి. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యారంగం కుంటుబడిపోయింది. తొంభైశాతం ఉన్న ఉద్యోగఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యాసంస్థలు వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నభోజన పథకం అమలు అంతంతమాత్రంగానే ఉంది. ఇక వసతిగృహాలు, గురుకుల పాఠశాలల పరిస్థితి చెప్పనక్కరలేదు. బియ్యంలోనో, అన్నంలోనో పురుగులు పడటం కాదు, ఏకంగా పథకాల్లోనే పందికొక్కులు పడ్డాయని విద్యార్థుల తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఈ లోపాలను కప్పిపుచ్చుకోవడానికే నాసిరకం బూట్లు, బట్టలు, బ్యాగులు పంపిణీ చేస్తున్నారనే విమర్శల్లో వాస్తవం ఉంది. ఇంటర్మీడియేట్ విద్య నుంచి గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ డిగ్రీల వరకు పేదలను దూరం చేసి గందరగోళం సృష్టించారనే చెప్పాలి. అంబేడ్కర్ ఇలాంటి విద్యావిధానాన్ని కోరుకోలేదు. ఆయన ఉచితవిద్య వైద్యం ప్రభుత్వాల ప్రథమకర్తవ్యం కావాలని ఆకాంక్షించారు. అణగారినవర్గాలకు, నిమ్నజాతులకు ఉన్నతవిద్య అందుబాటులో ఉండడం కోసం నిరంతరం ఉద్యమించారు.

దళితులు నా మేనమామలు అని ప్రకటించుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, దళితుడైన తన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను అతికిరాతకంగా హత్య చేసినా ఆయనకే అండగా నిలిచారు. డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలకు గురిచేసి అతడి చావుకు కారణమయింది జగన్ ప్రభుత్వమే. ఎస్సీల నుంచి అధికమొత్తంలో డి-పట్టా భూములు బలవంతంగా లాక్కోవడంతో కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ఈ సర్కారు పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఎన్నోచోట్ల అత్యాచార ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం గత మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులు వేలల్లో ఉన్నాయి. వీరిలో మరణించినవాళ్ళు గానీ, గాయపడ్డ బాధితులు గానీ సుమారు నాలుగువందల మంది ఉన్నారు. ఈ దుశ్చర్యలను ప్రశ్నించిన వ్యక్తుల మీద పలుచోట్ల దాడులు జరిగాయి. దళితులు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడంలో ఎన్నో ఆటంకాలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వాధికారులు, నాయకులు చొరవ తీసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించిన సందర్భం ఒక్కటీ కనిపించదు. అటుతిప్పి ఇటుతిప్పి రాజకీయంగా లబ్ధి పొందే దిశగానే నడిపిస్తారు. 'గరగపర్రు' అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో కచ్చితంగా ఇదే జరిగింది. తరచు రాష్ట్రంలో ఏదోమూల అంబేడ్కర్ విగ్రహాలను నేలమట్టం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ఆయన విగ్రహాలు పూజ్యనీయమైపోతున్నాయి. ఆయనను ఆరాధించేవారితో ప్రభుత్వాధినేతకు జేజేలు పలికించడం పార్టీశ్రేణులతో పాటు అధికారులకు కూడా తప్పనిసరి అవుతోంది.

అంబేడ్కర్ విగ్రహాల నిర్మాణం ప్రజల్లో సామాజికచైతన్యం నింపడం కోసం కాదని, ఇదంతా రాజకీయ లబ్ధి కోసమేననే విషయం జాతిస్పృహ కలిగిన అందరికీ తెలిసిందే. ఇలాంటి మోసపూరిత రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికే ఆ మహనీయుడు ఈ దేశంలో మహిళలు, మైనారిటీలతో సహా అణగారిన ప్రజలందరికీ రాజ్యాంగరక్షణలు కల్పించారు. వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకుండా నేటి పాలకులు ఆయన విగ్రహాల్ని ఓటుబొమ్మలుగా మార్చేయడం విచారకరం. రాజకీయప్రజాస్వామ్యం కంటే సామాజికప్రజాస్వామ్యాన్నే ఎక్కువగా ఆకాంక్షించిన అంబేడ్కర్ ఆలోచనలకు విరుద్ధంగా నేటి ప్రభుత్వాలు దిమ్మలు కట్టి బొమ్మలు పెట్టి మభ్యపెడుతున్నాయి. ఈ విషయాన్ని దళిత, బహుజన మేధోవర్గం గ్రహించాలి. భవిష్యత్‌తరాల్లో పెంపొందించవలసిన అంబేడ్కర్ స్ఫూర్తిని పక్కదోవ పట్టిస్తున్నారనే సంగతిని సైతం గుర్తించాలి. అప్పుడే అంబేడ్కర్ అంటే ఓటు బొమ్మకాదు, కోట్ల జనం గొంతు అనే విషయం పాలకుల తలకెక్కుతుంది. ఈ దేశంలో సామాజిక వెలివేతకు గురయిన కోట్లాదిమంది స్వరం తానొక్కడే అయి పోరాడిన ఆ యోధుడి సిద్ధాంతాలు ఆచరణలోకి వస్తాయి. ఆ సమోన్నత స్త్రీ విమోచకుడిని, రాజనీతిజ్ఞుడిని ఓటుబొమ్మను చేసి ఆడుకుంటున్నవారి ఆలోచనలకు సంకెళ్ళు పడతాయి. అదే ఆయనకు నిజమైన నివాళి అని ప్రభుత్వాలు గుర్తించాలి. అలా గుర్తించేలా సమస్త దళితజనం గుణపాఠం నేర్పాలి.

● డాక్టర్ జీకేడీ ప్రసాద్



ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మన రెండు జిల్లాలు సత్తా చాటాయి. కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవగా, ఇంటర్ మొదటి, రెండో సంవత్సర స్టేట్ టాపర్లు ఎన్టీఆర్ జిల్లాకు చెందినవారే కావడం విశేషం. ఇక మొత్తం ఉత్తీర్ణతలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. ఈసారీ బాలికలే ముందువరుసలో నిలిచారు.

టాప్ లేపారు

ఇంటర్ ఫలితాల్లో కృష్ణా ఫస్ట్, ఎన్టీఆర్ థర్డ్ ప్లేస్

- ఇంటర్ ఫస్ట్, సెకండ్ స్టేట్ టాపర్లు ఇద్దరూ ఎన్టీఆర్ జిల్లావారే.
- కృష్ణాజిల్లాలో 90 శాతం ఉత్తీర్ణత
- ఎన్టీఆర్ జిల్లాలో 87 శాతం ఉత్తీర్ణత
- ఈసారి కూడా బాలికలదే పైచేయి

1

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గత ఏడాది ఉమ్మడి జిల్లాలవారీగా ఫలితాలను వెల్లడించిన ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ఏడాది కొత్తగా ఏర్పడిన జిల్లాలవారీగా విడుదల చేసింది. రాష్ట్రంలోనే ప్రథమ (కృష్ణాజిల్లా), తృతీయ (ఎన్టీఆర్ జిల్లా) స్థానాలను పక్కపక్క జిల్లాలు సాధించడం విశేషం. కృష్ణాజిల్లా.. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 90 శాతం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఇక ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 87 శాతం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. రెండు జిల్లాల్లోనూ బాలుర కంటే బాలికలదే పైచేయి.

కృష్ణాజిల్లాలో ఇలా..

కృష్ణాజిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9,955 మంది బాలురు హాజరవ్వగా, 8,197 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 10,369 మంది హాజరవ్వగా, 8,873 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 20,324 మంది పరీక్షలు రాయగా 17,070 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే, రెండో సంవత్సరం పరీక్షలకు 8,508 మంది బాలురు పరీక్షలు రాయగా, 7,653 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 8,917 మంది పరీక్షలకు హాజరవ్వగా, 8,035 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 17,425 మందికి 15,688 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో మొదటి ఏడాది పరీక్షలకు 168 మంది బాలురకు 101 మంది ఉత్తీర్ణులయ్యారు. 501 మంది బాలికలకు 359 మంది పాస్ అయ్యారు. మొత్తం 669 మందికి గాను 460 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 143 మంది బాలురు హాజరవ్వగా, 81 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 414 మంది హాజరవ్వగా, 350 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 557 మందికి 431 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు 21,217 మంది బాలురు హాజరవ్వగా, 16,558 మంది ఉత్తీర్ణుల య్యారు. బాలికలు 17,090 మంది హాజరవ్వగా, 13,795 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 38,307 మందికి 30,353 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు బాలురు 18,892 మంది హాజరవ్వగా, 16,263 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 15,264 మందికి 13,444 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 34,156 మందికి 29,707 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు బాలురు 497 మంది హాజరవ్వగా, 219 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 521 మందికి 380 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,018 మందికి 599 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు బాలురు 333 మందికి 196 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 370 మందికి 297 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 703 మందికి 493 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత

- ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి కృష్ణాజిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరానికి

- మిగతా 6లో

కార్మికుల పిల్లలు. స్టేట్ టాపర్లు..



పి.మేఘన
467/470



కె.ప్రసన్న
466/470

ఒకరు.. ఇంటర్ మొదటి సంవత్సరంలో, మరొకరు.. రెండో సంవత్సరంలో స్టేట్ టాపర్లుగా నిలిచారు. ఇద్దరూ అమ్మాయిలే. మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. ఒకే జిల్లాకు చెందినవారే. పైగా ఇద్దరి తండ్రులు ఆటోనగర్‌లో ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నవారే కావడం విశేషం. పటమటకు చెందిన పెదమల్లు మేఘన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 467 మార్కులు సాధించింది. ఆమె తండ్రి ఉదయచంద్రరావు ఆటోనగర్‌లో ఎలక్ట్రీయన్. మేఘనకు చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి ఎక్కువ. ఆటోనగర్‌లో భారీ వాహనాలకు విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటుచేసే ఉదయచంద్రరావు తన కుమార్తె చదువు విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ప్రోత్సహించారు. ఇక ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో టాపర్‌గా నిలిచిన కె.ప్రసన్న 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించింది. ఈమె తండ్రి భాస్కరరావు కూడా ఆటోనగర్‌లో ఎలక్ట్రీషియనే. ఈ ఇద్దరూ బెంజిసర్కిల్‌లో నారాయణ ఐఐటీ ఈసీ ఏసీ బాలికల క్యాంపస్‌లో చదువుతున్నారు. వీరిని ఆర్జీఎం శ్రీనివాసరెడ్డి, ఏజీఎం వినయ్ అభినందించారు.



కొండపర్వలో ఎం.శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి (ఇన్‌సెట్‌లో) సిద్ధమవుతున్న సభా వేదిక

వీర సైనికులై పోరాడండి


టీడీపీ కార్యకర్తలు, యువతకు భువనేశ్వరి దిశానిర్దేశం

- ఎ.కొండూరు, విస్సన్నపేటలో 'నిజం గెలవాలి'
- నేడు తిరువూరులో ముగింపు బహిరంగ సభ

ఎ.కొండూరు/తిరువూరు, ఏప్రిల్ 12 : అవినీతి, అక్రమ, రాక్షసపాలనకు స్వస్తి చెప్పాలని, రాష్ట్ర భవిషత్తు యువత చేతుల్లోనే ఉందని, ఈ యుద్ధంలో కార్యకర్తలు, యువత వీర సైనికులై పోరాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన గుగులోతు బాబ్లా, పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన బొల్లిపోగు నాగరాజు కుటుంబ సభ్యులను 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, ముఖ్యంగా యువత భవిష్యత్తు గాఢాంధకారంలోకి వెళ్లిందన్నారు. ఉన్నతంగా చదువుకుని ఉద్యోగ, ఉపాధి మార్గాలు లేక కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.కొండూరు మండలంలో ఫ్లోరైడ్ వల్ల కిడ్నీ వ్యాధులు సోకి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాజధాని లేని రాష్ట్రం చేశారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టులో ఉన్నాయన్నారు. త్వరలో హైకోర్టు కూడా తాకట్టు పెడతారని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, మహిళా సాధికారత కోసం ఈ ఎన్నికల్లో ప్రజలు కలిసికట్టుగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. కాగా, భువనేశ్వరి కుమ్మరికుంట్ల గ్రామానికి రాగానే, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డి, మాధవి దంపతుల ఆధ్వర్యంలో గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు అభ్యర్థి కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, నాయకులు కృష్ణారెడ్డి, రమేశ్‌రెడ్డి, అబ్బు, మున్నియ్య, రాజేశ్వరరావు, పుల్లయ్య చౌదరి, వీరారెడ్డి, నాగపద్మ, జనసేన నేత ఎం.శ్రీనివాసరావు, పుల్లారావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు ఏర్పాట్లు

తిరువూరులో శనివారం జరిగే 'నిజం గెలవాలి' ముగింపు సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరువూరు మండలంలోని కాకర్ల, పట్టణంలోని 13వ వార్డులో శనివారం భువనేశ్వరి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం పట్టణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. దారా పూర్ణయ్య టౌన్‌షిప్ ప్రాంతంలో వేదికను సిద్ధం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు.



బందరు రోడ్డును ఆనుకొని ఉన్న వాటర్ ట్యాంకు రోడ్డులో మోడులైన చెట్లు

చెట్లను చంపేశారు..!

నేడు నగరంలో సీఎం జగన్ పర్యటన

- అడ్డుగా ఉన్నాయని నీడనిచ్చే వృక్షాల నరికివేత
- లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు
- ఇదేం పైశాచికమంటున్న స్థానికులు

లబ్బీపేట/అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : పచ్చగా కళకళలాడే ప్రాంతమది. భారీ చెట్లు.. కావాల్సినంత నీడ.. మండుటెండల్లో చిరువ్యాపారులతో పాటు వాహనచోదకులను సేదతీర్చే వృక్షరాజాలను కేవలం సీఎం జగన్ గంట పర్యటన కోసం ఇలా చంపేశారు. బస్సు యాత్రలో భాగంగా సీఎం జగన్ శనివారం నగరానికి రానున్నారు. వారధి నుంచి పశువుల ఆసుపత్రి మీదుగా స్టేడియం పక్కన వాటర్ ట్యాంక్ రోడ్డు నుంచి సెంట్రల్ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఇందుకోసం శుక్రవారం స్థానిక వాటర్ ట్యాంక్ రోడ్డులో చెట్లను నరికేశారు. ఈ రోడ్డు చెట్ల నీడకు ఎంతో ప్రసిద్ధి. ఎంతోమంది చిరువ్యాపారులు వీటి కిందే జీవనోపాధి పొందుతున్నారు. అసలే వేసవి కావడం, ఎండలు మండుతుండటంతో చెట్ల నీడలో ఉపశమనం పొందుతున్నారు. అటువంటి చెట్లను అడ్డగోలుగా నరికేయడంతో స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అడ్డుగా వస్తే రోడ్డుపై వాలిన కొమ్మలను తొలగిస్తే సరిపోయేదని, ఏళ్లుగా నీడనిస్తున్న చెట్లను నరికేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ చెట్లను నరికేస్తున్న సమయంలో స్థానికులు కొందరు ప్రశ్నించగా, వారికి సరైన సమాధానం కూడా చెప్పలేదు. ముఖ్యమంత్రి బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో పర్యటిస్తున్నందున చెట్లను నరికేయాల్సిన అవసరం ఏముందని, ఒక చెట్టు పెరగాలంటే ఏళ్లు పడుతుందని, అటువంటి చెట్లను కేవలం గంట పర్యటన కోసం నరికేయడం దుర్మార్గమని, ఇటువంటి ప్రజావ్యతిరేక కార్యక్రమాలు మానుకుని చల్లటి నీడతో పాటు ఆక్సిజన్‌ను అందించే చెట్లను పెంచితే మంచిదని స్థానికులు హితవు పలుకుతున్నారు.





కుక్లు.. కుక్కల కీపర్లు

aptdc

పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో పని పెత్తనం సాగుతోంది. ఏపీటీడీసీకి చెందిన కార్మికులను ఐఏఎస్ అధికారుల ఇళ్లలో పనులు చేయటానికి ఉన్నతాధికారులే పురమాయిస్తున్నారు. దాదాపు రెండున్నరేళ్లుగా 40 మంది కార్మికులతో ఐఏఎస్ అధికారుల ఇళ్లలో గొడ్డు చాకిరీ చేయిస్తున్నారు.

ఏపీటీడీసీ కార్మికులకు ఐఏఎస్ అధికారుల ఇంటి పనులు

- రెండున్నరేళ్లుగా మగ్గిపోతున్న 40 మంది కార్మికులు
- స్వీపర్లుగా, డాగ్ కీపర్లుగా, బట్టలు ఉతికేవారుగా..
- జీతాలు మాత్రం ఏపీటీడీసీ నుంచే..
- బానిసత్వం నుంచి విముక్తి కావాలంటున్న కార్మికులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఏపీటీడీసీలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ పద్ధతిలో కార్మికులు పనిచేస్తుంటారు. వీరంతా పర్యాటక యూనిట్లలో వివిధ రకాల డ్యూటీలు నిర్వహిస్తుంటారు. వీరిలో దాదాపు 40 మంది ఉద్యోగులను ఏపీటీడీసీ ఉన్నతాధికారులు తమ మెహర్బానీ కోసం ఐఏఎస్ అధికారుల ఇళ్లలో పనులు చేయించేందుకు డ్యూటీలు వేస్తున్నారు. ఐఏఎస్ అధికారులతో సత్సంబంధాలు, వ్యక్తిగత పనులు చేయించుకునేందుకు ఇలా ఇష్టానురీతిన ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఏపీటీడీసీకి చెందిన 40 మంది కార్మికులు పలువురు ఐఏఎస్ ఇళ్లలో పనివారుగా, వంట మనుషులుగా, గార్డెనర్లుగా, స్వీపర్లుగా పనిచేస్తున్నారు. ఐఏఎస్ అధికారుల కుక్కలను పర్యవేక్షించేందుకు కూడా కొంతమంది కార్మికులను నియమించినట్టుగా తెలుస్తోంది. తమకు ఐఏఎస్ అధికారుల ఇళ్ల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదు. యూనియన్లను ఆశ్రయించినా ఫలితం ఉండట్లేదు. సంఘాల్లో ఐకమత్యం లేకపోవటం వల్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ధైర్యంగా పరిష్కరించుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రెండున్నరేళ్లుగా ఐఏఎస్ అధికారుల ఇళ్లలోనే పనిచేయాల్సి వస్తోంది. సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీల ఇళ్లలో ఇప్పటివరకు 40 మంది కార్మికులు మగ్గిపోతున్నారు. కార్మికులందరికీ ఏపీటీడీసీ నుంచే జీతాలు చెల్లిస్తుండటం విశేషం. ఇప్పటి వరకు లక్షలాది రూపాయలు జీతాల రూపంలో చెల్లించారు. ఐఏఎస్ అధికారులు పనులు చేయించుకోవాలనుకుంటే ప్రైవేట్ వ్యక్తులను నియమించుకోవాలి కానీ, ఇలా ఏపీటీడీసీ కార్మికులను తమ ఇంట్లో పెట్టుకుని పనులు చేయించుకోవటం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పర్యాటక యూనిట్లలో అపరిశుభ్రత

పనివారంతా ఐఏఎస్ అధికారుల ఇళ్లకు వెళ్తుండటంతో పర్యాటక యూనిట్లలో పని పడకేసింది. అపరిశుభ్రత తాండవిస్తోంది. సరైన మెయింటినెన్స్ లేక వెలవెలబోతోంది. పర్యాటకుల ఆదరణ కూడా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పర్యాటకాన్ని పెంచడానికి కార్మికులను ఆయా యూనిట్లలో ఉపయోగించుకుంటే సత్ఫలితాలు కలుగుతాయి.

నీదే కులం.. నీ కులపోళ్లు టీడీపీలో ఉండొచ్చా..?

మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్ ప్రశ్నలు

- పోరంకి ప్రచారంలో కులం పేరిట చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం

పెనమలూరు, ఏప్రిల్ 12 : 'నీది ఏ కులం.. నీ కులపోళ్లు టీడీపీలో ఉండొచ్చా..?' మంత్రి, వైసీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేశ్ తనయుడు రాజీవ్ గురువారం రాత్రి ఇంటింటి ప్రచారంలో అడిగిన ప్రశ్నలివి. పోరంకి బొంగరాల వారి వీధిలో గురువారం పొద్దుపోయాక రాజీవ్ ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ఆ వీధిలో నివాసముంటున్న బొంగరాల అబ్రహం అనే టీడీపీ కార్యకర్త ఇంటికి వెళ్లారు. నమస్కరించి వైసీపీకి ఓటు వేయాలని కోరారు. దీంతో అబ్రహం తాను పక్కా టీడీపీ కార్యకర్తనని, తాను టీడీపీకే ఓటు వేస్తానన్నారు. అవాక్కైన రాజీవ్.. 'నీది ఏ కులం..' అంటూ ప్రశ్నించారు. తనది ఎస్సీ మాదిగ సామాజికవర్గం అని అబ్రహం తెలిపారు. స్పందించిన రాజీవ్.. 'అసలు నీ కులపోళ్లు టీడీపీలో ఉండొచ్చా..' అంటూ ఎదురు ప్రశ్నించారు. కోపోద్రిక్తుడైన అబ్రహం కులం పేరుతో ఓట్లడగడం మంచి పద్ధతి కాదని రాజీవ్‌ను హెచ్చరించారు. ఇరుగు పొరుగు వారు కూడా వ్యతిరేకించడంతో రాజీవ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఈవీఎంలు వచ్చేశాయ్..

- కలెక్టర్, రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్
- బాక్సులన్నీ ఆర్టీసీ డీజీటీలలో స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలింపు

- 6లో..



బాలశౌరి, బుద్ధప్రసాద్‌లను సత్కరిస్తున్న తెలుగు మహిళలు

వచ్చే ఎన్నికల్లో వార్ వన్‌సైడే

- కూటమి అభ్యర్థులు బాలశౌరి, బుద్ధప్రసాద్ ధీమా

మోపిదేవి/అవనిగడ్డ/కోడూరు, ఏప్రిల్ 12 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వార్ వన్‌సైడ్‌గానే ఉంటుందని మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌లు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం కూటమి ఆధ్వర్యంలో జనసంకల్ప ప్రచార యాత్రను మోపిదేవిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రావివారిపాలెంలో మోపిదేవి జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు ఇంటివద్ద టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ కలయిక సమావేశంలో బాలశౌరి, బుద్ధప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించటం ఖాయమన్నారు. బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌లను జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో తెలుగు మహిళలు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మోపిదేవి, చల్లపల్లి ఎంపీపీలు రావి దుర్గావాణి, కోట విజయరాధిక, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, నడకుదుటి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం కోడూరు మండలం రామకృష్ణాపురం గ్రామ పరిధిలోని ఇరాలి, రామకృష్ణాపురం, ఊటగుండం, బసవవానిపాలెం గ్రామాల్లో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలసి తమ ప్రచారాన్ని ప్రారంభించారు. తీర గ్రామాల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వారికి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు.

జనసేనలో భారీగా చేరికలు

విద్యావంతులైన యువత భవిష్యత్తుపై కోటి ఆశలతో జనసేన వైపు చూస్తున్నారని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభర్థులు బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌ల సమక్షంలో వైసీపీ నుంచి భారీగా యువతీ, యువకులు జనసేనలో చేరారు. నాగాయలంక మండలం సంగమేశ్వరం గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ వర్గాల నుంచి కొక్కిలిగడ్డ నాగేంద్ర వర్మ ఆధ్వర్యంలో అనంత ప్రసాద్ ఆధ్వర్యంలో యువత జనసేనలో చేరారు. 100 కుటుంబాలు వైసీపీని వీడి జనసేనలోకి చేరారు.

వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి భారీగా వైసీపీ శ్రేణులు చేరారు. మాచ వరం గ్రామంలో వైసీపీ నాయకులు నరహరిశెట్టి మాణిక్యాలరావు, నరహరి నాగేశ్వరరావు, ముళ్లపూడి నాంచారయ్య, తదితరులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించి తీరుతాం

- వల్లభనేని బాలశౌరి



బాలశౌరికి కరపత్రాలు ఇస్తున్న భోగరాజు పట్టాభి భవన నిర్మాణ కమిటీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 : వైసీపీ నేతలు ఎన్ని అవరోధాలు కల్పించినా ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మించి తీరుతామని ఎంపీ, మచిలీపట్నం ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి స్పష్టం చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో బాలశౌరిని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి, కృష్ణాజిల్లా కన్వీనర్ వీవీ ఫణికుమార్, ఆర్‌బీఎస్ నాయకులు వివిఎస్ఎస్ఆర్‌శర్మ, నిమ్మగడ్డ శ్రీధర్, గణేశ్‌లు శుక్రవారం ఎంపీని కలిసి పేద బ్రాహ్మణుల సమస్యలను వివరించారు. చంద్రబాబు హయాంలో కళ్యాణమస్తు పథకం కింద రూ.75 వేలు సాయం చేసేవారన్నారు. నిరుద్యోగులకు కార్లను అందించారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని బాలశౌరి వాగ్దానం చేశారు.

వైసీపీ నుంచి ఏపీని రక్షించడానికే మహా కూటమి ఏర్పాటు

- వసంత కృష్ణప్రసాద్



రెడ్డిగూడెం, ఏప్రిల్ 12 : అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్న వైసీపీ నుంచి ఏపీని రక్షించడానికే బీజేపీ, జనసేన, తెలుగుదేశం కలిసి కూటమిగా ఏర్పడి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని అన్నేరావుపేట, మద్దులపర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వసంతకు గ్రామాల ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. కూనపరాజుపర్వ గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా.. వారికి కృష్ణప్రసాద్ టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, వైసీపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసి, మద్యం, ఇసుక దందాతో అమరావతిని నాశనం చేశారన్నారు. యువత భవిష్యత్తు నిర్వీర్యమైందన్నారు. మహాకూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఐదేళ్ల నరక పాలన, సంక్షోభానికి చెక్‌పెట్టే సమయం వచ్చిందన్నారు. మూడు జెండాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మైలవరం నియోజకవర్గంలో మహాకూటమి ఘనవిజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు విజయబాబు, కోటగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శేరికల్వపూడిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన యువత

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

గుడ్లవల్లేరు : శేరికల్వపూడి గ్రామానికి చెందిన వార్డు వలంటీర్ మద్దాల రాజారావు, వైసీపీ యువతతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని గుడివాడ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షులు కొనరాజు బాపయ్య చౌదరి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కొడాలి రామరాజు, చలసాని శ్రీధర్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. కొనరాజు వెంకట రామకృష్ణారైస్ మిల్ ఆవరణలో కూటమి ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం వెనిగండ్ల రాము ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరిగి 'బాబుష్యూరిటీ, భవిషత్ గ్యారెంటీ' కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.

ఈవీఎంలు వచ్చేశాయ్..

- కలెక్టర్, రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్
- బాక్సులన్నీ ఆర్టీసీ డీజీటీలలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు
- పక్కాగా నిర్వహించాం

- దిల్లీరావు, జిల్లా ఎన్నికల అధికారి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



ర్యాండమైజేషన్‌కు ఈవీఎం బాక్సులను తీసుకువస్తున్న సిబ్బంది

ఎన్నికల సమరానికి ఈవీఎంలు సిద్ధమయ్యాయి. కట్టుదిట్టమైన భద్రత నడుమ జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు శుక్రవారం రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించారు. గొల్లపూడిలోని గోడౌన్ నుంచి ర్యాండమైజేషన్ ప్రకారం ఈవీఎంలను రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో బయటకుతీసి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు చేర్చారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగింది. విజయవాడ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 5607 బ్యాలెట్ యూనిట్లు, 4660 కంట్రోల్ యూనిట్లను తరలించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో వీటిని భద్రపరిచారు. ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ తరపు ఏదుపాటి రామయ్య, వైసీపీ తరపున ఎల్.శివరామ ప్రసాద్, అబ్దుల్ సత్తార్, బీజేపీ తరపున పీవీ శ్రీహరి, సీపీఎం తరపున డీవీ కృష్ణలతో పాటు ఆమ్‌ఆద్మీపార్టీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల తరలింపు కార్యక్రమం పూర్తయ్యే వరకు కలెక్టర్ దిల్లీరావు, విజయవాడ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి సంపత్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు స్వప్నిల్ దినకర్, భవానీ శంకర్, కిరణ్మయి, కె.మాధవి. ఎ.రవీంద్రరావు, జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్‌లు పర్యవేక్షించారు.



ఈవీఎంల కోడ్ స్కానింగ్ పరిశీలిస్తున్న దిల్లీరావు

ఈవీఎంల తరలింపు ఇలా

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి 2787బ్యాలెట్ యూనిట్లు, 2222 కంట్రోల్ యూనిట్లను తరలించారు. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 281 బ్యాలెట్ యూనిట్లు (బీయూ), కంట్రోల్ యూనిట్లను తరలించారు. విజయవాడ వెస్ట్‌కు 304 బీయూ, సీయూలు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి 320, విజయవాడ తూర్పు నియోజకవర్గానికి 358, మైలవరం నియోజకవర్గానికి 355, నందిగామ నియోజకవర్గానికి 266, జగ్గయ్యపేట నియోజకవర్గానికి 266 బీయూ, సీయూలను పంపించారు. రిజర్వులో మరికొన్నింటిని పంపించారు.

పకడ్బందీగా ర్యాండమైజేషన్ : కలెక్టర్

ఎన్నికలలో కీలకమైన ఈవీఎం ర్యాండమైజేషన్ తొలిదశ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాం. పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎన్నికలు నిర్వహించేందుకు ర్యాండమైజేషన్‌ను పక్కాగా నిర్వహించాం. ఎన్టీఆర్‌జిల్లా వ్యాప్తంగా మొత్తం 1792 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగామొత్తంగా 5607 బ్యాలెట్ యూనిట్లు, 4660 కంట్రోల్ యూనిట్లు, 5363 వీవీప్యాట్లను అవసరానికి మించి పంపించాం.

విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలి

- జిల్లా అధికారులతో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సమీక్ష

మచిలీపట్నం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో శుక్రవారం ఎస్ఈబీ, జిల్లా ఎన్నికల వ్యయపర్యవేక్షణ కమిటీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు, అభ్యర్థుల ఎన్నికలవ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన విజిలెన్స్ బృందాలు నిత్యం నిఘా ఉంచాలన్నారు. మద్యం దుకాణాలను రోజువారీ తనిఖీచేసి వివరాలను సేకరించాలన్నారు. ఎన్నికలకు 48గంటలముందే మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు. జిల్లా ఎన్నికల వ్యయ నియంత్రణాధికారులు రోజువారీ నివేదికలను సమర్పించాలన్నారు. నగదు సీజ్ చేస్తే అందుకు సంబంధించిన కేసులను త్వరితగతిన నమోదుచేసి తగు సాక్ష్యాలు చూపితే నగదును ఇచ్చేయాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ ఆవులయ్య, ఎస్ఈబీ అధికారులు, జెడ్పీ సీఈవో ఆనందకుమార్, ట్రెజరీ డీడీ ఎస్.రవికుమార్, ఎన్నికల వ్యయవిభాగం నోడల్ అధికారి కె.భాస్కరరావు పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

కృష్ణాయూనివర్సిటీలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపుకేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలను కలెక్టరేట్‌లోని ఈవీఎం గూడౌన్‌లో భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఇప్పటినుంచే ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల వ్యయపర్యవేక్షణ కమిటీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గానికి తొలివిడత ఈవీఎం కేటాయింపు ప్రక్రియ కలెక్టర్ పర్యవేక్షణలో శుక్రవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గూడౌన్‌వద్ద పూర్తిచేశారు. రాజకీయపార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాస్త్రీయపద్ధతిలో, ఆన్‌లైన్‌ద్వారా తొలివిడతగా ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు కేటాయించినట్టు తెలిపారు. నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలను వాటి నెంబర్లను బట్టి భద్రపరిచి నియోజకవర్గాలకు తీసుకువెళతామన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలను నియోజకవర్గాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తామని, అక్కడ వాటికి మరింత భద్రత కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు.

అధైర్యం వద్దు.. వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే

- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి

విస్సన్నపేట, ఏప్రిల్ 12 : వైసీపీ రౌడీ మూకలకు ఎవ్వరూ భయపడవద్దని.. రానున్నది ఎన్డీఏ ప్రభుత్వమేనని చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలకు ధైర్యం చెప్పారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన మూటం శ్రీనివాసరావు, బాణావతు ధనమ్మలు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై మనస్తాపంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా అధికారం కూటమిదేనన్నారు. కష్టకాలంలో చంద్రబాబుకు అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్నివర్గాలకు మేలు చేస్తాయన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అనురాధ, మట్టా వేణుగోపాల్, ఎన్నారై వల్లభనేని గిరి, దాబా శ్రీనివాసరావు, కవులూరి రాజ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కొండపర్వలో బాణావతు ధనమ్మ కుటుంబసభ్యులకు భరోసా పత్రం అందజేస్తున్న నారా భువనేశ్వరి

ఇంటర్‌లో గోసలైట్స్ అత్యుత్తమ ఫలితాలు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : ఇంటర్ ఫలితాల్లో నగరానికి చెందిన గోసలైట్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ నరేంద్రబాబు తెలిపారు. సీనియర్ బైపీసీ విద్యార్థిని ఆలూరు కిర్మయి 990/1000 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు, జూనియర్ ఇంటర్‌లో ఇంజమూరి హరిచందన 435/440 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకు, జిల్లా రెండో ర్యాంకు సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను చైర్మన్ ప్రశంసించారు. బ్రాంచ్ స్థాపించిన మూడేళ్లలో తమ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకుంటామని ఆశభావం వ్యక్తం చేశారు.



హరిచందన



కిరణ్మయి

సరైన పత్రాలు చూపని రూ.8.98 లక్షలు స్వాధీనం

కంకిపాడు, ఏప్రిల్ 12 : సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 8.98లక్షల నగదు స్వాధీన పరుచుకున్నట్టు ఎస్సై డి.సందీప్ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన లుక్కా రాజేష్ సరైన పత్రాలు లేకుండా రూ.8.98 లక్షలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారికి అందజేసినట్టు తెలియజేశారు.

మచిలీపట్నంలో రైల్వే అధికారుల తనిఖీలు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 12 : మచిలీపట్నం స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఆపరేషన్స్ చీఫ్ ప్రిన్సిపల్ మేనేజర్ బి.నాగయ్య, విజయవాడ సీనియర్ డీఓఎండి నరేంద్ర వర్మ, ఏడీఎంఈ జి.ఉదయభాస్కర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఆపరేటింగ్ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. బందరు పోర్టు అభివృద్ధి అధికారి వై.విద్యాశంకర్‌తో కలిసి పోర్టు నిర్మాణ ప్రగతిపై చర్చించారు. ప్రపంచస్థాయి టెర్మినల్‌గా తీర్చిదిద్దేందుకు రైల్వేశాఖ తనవంతు సహకారాన్ని అందిస్తుందని నాగయ్య తెలిపారు. వివిధ అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మచిలీపట్నం స్టేషన్‌లో అమృత్‌పథకం కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. రన్నింగ్ రూమ్, కోచింగ్ డిపోలను తనిఖీ చేశారు.



స్టేషన్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న రైల్వే అధికారులు

టాప్‌లేపారు..

(5వ పేజీ తరువాయి)

సంబంధించి 197 బాలురు హాజరవ్వగా, 81 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 337 మంది హాజరవ్వగా, 192 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 534 మందికి 273 మంది పాస్ అయ్యారు. రెండో సంవత్సరానికి సంబంధించి 159 మంది బాలురు హాజరవ్వగా, 117 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 331 మందికి 240 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 490 మందికి 357 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు 61 మంది హాజరవ్వగా, 44 మంది ఉత్తీర్ణులయ్యారు. 185 మంది బాలికలకు 148 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 246 మందికి 192 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం పరీక్షలకు 61 మంది బాలురు హాజరవ్వగా, 47 మంది ఉత్తీర్ణులయ్యారు. 172 మంది బాలికలకు 155 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 233 మందికి 202 మంది ఉత్తీర్ణత సాధించారు. జూ ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు 389 మంది బాలురు హాజరవ్వగా, 125 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 393 మంది పరీక్షలు రాయగా, 177 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 782 మందికి 302 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం పరీక్షలకు 213 మంది బాలురు హాజరు కాగా, 111 మంది ఉత్తీర్ణతను సాధించారు. 373 మంది బాలికలు హాజరవ్వగా, 240 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 586 మందికి 351 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరంలో 124 మంది బాలురు హాజరవ్వగా, 66 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 104 మందికి 90 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 228 మందికి గాను 156 మంది పాస్ అయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు బాలురు 92 మంది హాజరవ్వగా, 61 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 82 మంది హాజరవ్వగా, 76 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 174 మందికి 137 మంది పాస్ అయ్యారు.



రెండు రోజుల క్రితం డంపింగ్ సేకరణ పాయింట్ (ఫైల్)



గురువారంనాడు గోడ కట్టిన తర్వాత..

గోడ కట్టిందెవరు!

- తాము కట్టలేదంటున్న మున్సిపల్ అధికారులు
- పట్టపగలు కట్టినా పట్టని అధికారులు
- నాని అనుచరగణం నిర్వాకమంటూ ప్రచారం
- అన్నీ తెలిసే నటిస్తున్నారని విపక్షాల ఆరోపణ

గుడివాడ, ఏప్రిల్ 12 : రెండురోజుల క్రితం వరకు చెత్త సేకరణ పాయింట్ తెరిచే ఉంది.. ఒక్కరోజులో పట్టపగలు గోడకట్టేశారు! కట్టించిందెవరో తమకు తెలియదని మున్సిపల్ అధికారులు బుకాయిస్తున్నారు. ఇంతకి గోడ కట్టిందెవరు! మున్సిపల్ అధికారులా.. అధికార పార్టీ నేతలా..? అనే సందేహం పట్టణ ప్రజల్లో నెలకొంది. ఆర్యవైశ్య సామాజికవర్గంపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా.. ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశాలతో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపానికి ఆనుకుని మున్సిపల్ పార్కులో చెత్తసేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. రెండు రోజులు క్రితం వరకు ఇక్కడ కార్యకలాపాలు జరిగాయి. ఏం జరిగిందో ఏమో.. గురువారం పట్టపగలు సదరు పాయింట్‌ను మూసివేస్తూ గోడను కట్టారు. పట్టపగలు గోడ కడుతున్నా మున్సిపల్ అధికారులకు సమాచారం లేదని చెప్పడం గమనార్హం.

గోడను కట్టింది అధికార పార్టీనే

- స్థానికుల ఆరోపణ

35వ వార్డులో ప్రచారంలో భాగంగా ఆర్యవైశ్య నాయకులు నిలదీయడంతో స్థానిక ఎమ్మెల్యే నాని చెత్త సేకరణ పాయింట్‌ను గోడ కట్టి మూయించారని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులకు ఈ విషయం తెలుసని కార్యాలయ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. శెలవురోజున చేపడితే తమకేమి ఇబ్బంది ఉండదని ఒక అధికారి యిచ్చిన సలహా మేరకే నిర్మాణం చేపట్టారని సమాచారం.

మాకేం తెలియదు

- అసిస్టెంట్ సిటీ ప్లానర్

చెత్త సేకరణ పాయింట్‌ను మూసివేస్తూ అక్రమంగా గోడను నిర్మించిన విషయం వార్డు ప్లానింగ్ కార్యదర్శి సురేష్ తమ దృష్టికి తీసుకువచ్చారు. గోడను ఎవరు కట్టారో విచారణ చేస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.రాంబాబు తెలిపారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరగలేదు

- డీఈ కరుణాకర్‌బాబు

24వ వార్డులోని శ్రీతుమ్మల రాంబ్రహ్మం పార్కులో చెత్త సేకరణ పాయింట్‌ను మున్సిపాలిటీ ఏర్పాటు చేసింది. కానీ సదరు పాయింట్‌ను మూసివేస్తూ గోడను కట్టిన విషయం శుక్రవారం మా దృష్టికి వచ్చింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎటువంటి గోడను నిర్మించలేదు.. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపడతాం.

పాస్టర్లకు వైసీపీ తాయిలాలు!

మచిలీపట్నం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నియోజకవర్గంలోని పాస్టర్లతో వైసీపీ అభ్యర్థి పేర్నికిట్టు శుక్రవారం రాజకీయ ఆత్మీయసమావేశం నిర్వహించారు. వందలపాలెంలోని జి-కన్వెన్షన్‌హాలులో ఏర్పాటుచేసిన సమావేశంలో పాస్టర్లంతా రానున్న ఎన్నికల్లో తమ అభ్యర్థికి ఓట్లు వేయించాలని వైసీపీ నాయకులు కోరారు. సమావేశానికి వచ్చిన పాస్టర్లకు ఖరీదైన వస్త్రాలు, నగదును ఇవ్వడం గమనార్హం. ఎంపిక చేసిన పాస్టర్లకు ముందుగానే కూపన్లు అందజేసి వారిని సమావేశానికి ఆహ్వానించారు. ఈ అంశంపై అధికారులకు టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేసినా అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



వాట్సాప్ గ్రూపుల్లో ఎంఎల్‌వో అభ్యంతరకర పోస్టులు

పెనమలూరు, ఏప్రిల్ 12 : మండలస్థాయి ఔట్‌సోర్సింగ్ అధికారి వాట్సాప్ గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టడంపై గ్రామస్థులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వపథకాలు అందరికీ సక్రమంగా అందుతున్నాయా.. లేదా చూడవలసిన ఎంఎల్‌వో 'మన పెదపులిపాక సచివాలయం' పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటుచేసి వలంటీర్లను సభ్యులుగా చేర్చి అభ్యంతరకర పోస్టులను పెట్టడం వివాదాస్పదమైంది. ఎంఎల్‌వో ఆశిష్. చంద్రబాబు లక్ష్యంగా వలంటీర్ల మీదకు చంద్రబాబు రాళ్లు విసురుతున్నట్టు ఉన్న పోస్టును గ్రూపులో పెట్టాడు. దీనిపై గ్రామస్థులు సీ-విజిల్ యాప్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.



మా వాదనలు విన్న తర్వాత నిర్ణయం తీసుకోండి

- ప్రత్తిపాటి శరత్ కేసులో మరో పిటిషన్
- కేసు బదిలీకి బ్రేక్

విజయవాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ పన్ను ఎగవేత, నకిలీ బిల్లులతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పొందారని అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కేసు బదిలీకి తాత్కాలిక బ్రేక్ పడింది. మొదటి ఏసీఎంఎం కోర్టులో ఉన్న ఈ కేసును సీఐడీ కోర్టుకు బదిలీ చేస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొద్దిరోజుల క్రితం ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శరత్ తరఫున న్యాయవాది కిలారు బెనర్జీ మరో పిటిషన్‌ను సీఎంఎం కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితుల తరఫున వాదనలు వినాలి, అప్పటి వరకు కేసు బదిలీని నిలుపుదల చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనితో కేసు బదిలీకి బ్రేక్ పడింది. తదుపరి విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.96

పరస్పర దాడులు: ఐదుగురిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : రామకృష్ణాపురం ప్రాంతంలో రెండు షాపుల నిర్వాహకులు శుక్రవారం పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం శీలం నాగరాజు రామకృష్ణాపురంలో టాటూలు వేసే షాపు నడుపుతున్నాడు. ఆ పక్కనే నాగేంద్ర వస్త్ర దుకాణాన్ని నడుపుతున్నాడు. గత కొంత కాలంగా ఇరువురికి స్వల్ప విషయమై తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి ఇద్దరికి గొడవ జరిగింది. దీంతో నాగరాజు, అతని భార్య గౌసియాబీ, పక్క షాపు నిర్వాహకుడు నాగేంద్రతో పాటు తమ్ముడు శివకృష్ణ, బావమరిది జగన్ పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ విషయమై ఇరువర్గాలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాలకు టీడీపీ అండ

58వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : టీడీపీ జెండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండ అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో టీడీపీ నేతలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ. సీఎం జగన్ సిద్ధం అని తిరుగుతున్నారని, కానీ ప్రజలు మాత్రం వైసీపీని ఓడించడానికి ఓటు అనే ఆయుధంతో సంసిద్ధమయ్యారని పేర్కొన్నారు. బొండా సుజాత, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, దాసరి కనకారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



58వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం : 33వ డివిజన్ సత్యనారాయణపురంలో శుక్రవారం కేశినేని జానకీ లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ ప్రజాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి కాంక్షించే టీడీపీకి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. బొండా సుజాత, గార్లపాటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కూటమికి అండగా నిలవండి : గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 12 : శాంతికాముకుడు, అభివృద్ధి కారకుడైన గద్దె రామ్మోహన్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. 14వ డివిజన్ పటమట దర్శిపేట ఏరియాలో శుక్రవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ కూటమికి అండగా నిలబడి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ప్రజలకు అండగా ఉండే గద్దె రామ్మోహన్‌ను ఎమ్మెల్యేగా, కేశినేని శివనాథ్‌ను ఎంపీగా అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలన్నారు. నర్రా కిషోర్, పోతంశెట్టి నాగేశ్వరరావు, యడ్లపల్లి నాగరాజు, చెరుకూరి సాంబయ్య, వీరంకి డాంగేకుమారి, కర్రా కోటేశ్వర రావు, రాధారపు యల్లబాబులు పాల్గొన్నారు.



14వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

మొగల్రాజపురం: టీడీపీది అభివృద్ధి బాట అని వైసీపీది బూతుల బాట అని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ చెప్పారు. 8వ డివిజన్ గాయత్రీనగర్, పిన్నమనేని క్లినిక్ రోడ్డు, త్రిబుల్ ఎస్ రోడ్డు ఏరియాల్లో పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సోదరి కేశినేని శ్రీదేవితో కలిసి జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ జనసేన, బీజేపీ బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. పోతం శెట్టి నాగేశ్వరరావు, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మీపతి, మల్లేల రామకృష్ణ, మెరకనపల్లి నాగేశ్వరరావు, తంగిరాల పౌలు, దేవపొంగు కృపారావు, నారు రామారావు, కర్రా సురేష్, రమణి, జంతిక నాగేంద్ర, జ్యోతి పాల్గొన్నారు.

గద్దె క్రాంతి ప్రచారం

కృష్ణలంక: తూర్పు పరిధి 22వ డివిజన్ గంగానమ్మ గుడి ప్రాంతంలో శుక్రవారం గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా క్రాంతి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పాలనా అనుభవం వున్న చంద్రబాబు నాయుడికే తమ ఓటు అని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పి.అన్నారావు, తోట శ్రీనివాసరావు, తగరంపూడి మల్లి, అడపాక నర్సింహారావు, కృష్ణ, పాల్గొన్నారు.

మొగల్రాజపురం: 7వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ గద్దె క్రాంతి శుక్రవారం బోయపాటి మాధవరావు వీధి, సీపీఎం ఆఫీసు వీధి ప్రాంతాల్లో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, దోమకొండ అశోక్, నందిగం కిషోర్, పెనుగోండ శ్రీను, పెరవళి శివకుమార్, రత్నాకర్ జ్యోతి పాల్గొన్నారు.



పేదలకు భోజనం వడ్డిస్తున్న బుద్దా వెంకన్న

పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో శుక్రవారం కళ్లే లలిత జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న హాజరై పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఆయన కళ్లే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కళ్లే నాగేశ్వరరావు, డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మీ, కళ్లే జయదుర్గ, మేఘవాణి, చందన సురేష్, ముప్పూరి హరీష్, ఎం. జశ్విన్, జి. ధ్రువన్, స్థానికులు ఆమెకు నివాళులు అర్పించారు.

ఇంటర్ ఫలితాల్లో మోడరన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 : ఇంటర్ ఫలితాల్లో మోడరన్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సునీల్ చాంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో సీహెచ్ సంజన 977, జీవీఏ శ్రీవాత్సవ్ 971, ఏ మిశ్రీత 967 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 89.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో 92.8 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. శ్రీ సుకంర పాపారావు ఆధ్వర్యంలో కామర్స్ విద్యారంగంలో మోడరన్ అకాడమీ విద్యార్థులు 38 సంవత్సరాలుగా విజయ పరంపరం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.



సీహెచ్. సంజన
977



జీవీఏ. శ్రీవాత్సవ్
971



ఈద్ మిలాబ్‌లో పాల్గొన్న హిందూ ముస్లిం నాయకులు

హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలి

● ఈద్ మిలాబ్‌లో ఐలా ఛైర్మన్ సుంకర

ఆటోనగర్, ఏప్రిల్ 12: ఆటోనగర్‌లోని హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగాలని ఐలా ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆటోనగర్‌లో జరిగిన ఈద్ మిలాబ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పవిత్ర రంజాన్ పండుగ అనంతరం హిందూ ముస్లిం సోదరులు ఈద్ మిలాబ్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు బాజీ షరీఫ్, ఎండీ ఆరిఫ్, రహమతుల్లాలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు విజయవంతంగా పూర్తి చేసి అల్లా కృపను పొందిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ మిలాబ్ కార్యక్రమంల సందర్భంగా హిందూ ముస్లిం సోదరులు ఒకరినొకరు కౌగిలించుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకొన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, డిస్పోజల్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, కొండ, బాబా పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలోనూ ఆపని పన్నుల భారాలు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు

పాయకాపురం, ఏప్రిల్ 12 : ఎన్నికల సమయంలోను ప్రజలపై పన్నుల భారాలను మోపడం ఆపలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఆ పార్టీ నేతలు 62వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆస్తి పన్ను పెంపు నోటీసులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిచిన ఆయన ఆస్తి పన్ను పెంపు జీవో కాపీలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కె. దుర్గారావు, రమణారావు, సాంబిరెడ్డి పాల్గొన్నారు.



జీవో కాపీలను దహనం చేస్తున్న బాబూరావు

యువతకు ఉపాధి చంద్రబాబుతోనే సాధ్యం

● 23వ డివిజన్‌లో టీడీపీ ప్రజా చైతన్య యాత్ర



పాత బస్టాండ్ సెంటర్ నుంచి సాగిన టీడీపీ ప్రజా చైతన్య యాత్ర

గవర్నర్‌పేట, ఏప్రిల్ 12: యువతకు ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీకే దక్కిందని సెంట్రల్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం 23వ డివిజన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్ర ఏలూరు రోడ్డు, మసీదు రోడ్డు, శివాలయం వీధి, అట్లా రత్తయ్య వీధి, మెర్రి స్ట్రీట్, లెనిన్ సెంటర్, బీసెంట్ రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వస్తేనే విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలు బాగుపడతాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బొండా ఉమామహేశ్వరరావు తనయులు బొండా సిద్ధార్థ, బొండా రవితేజ, డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి జనసేన పార్టీ సెంట్రల్ సమన్వయకర్త బొలిశెట్టి వంశీకృష్ణ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వర్గాలు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో మహిళల మంగళసూత్రాలు తెంచుతున్న జగన్

పాయకాపురం: తాము అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గద్దెనెక్కిన తరువాత కల్తీ మద్యంతో లక్షలాది మంది మహిళల మంగళసూత్రాలను తెంచుతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేసిన తరువాతే మళ్లీ ఎన్నికల్లో ఓటు అడుగుతానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, ఏప్రిల్ 12: వైసీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన దుర్గగుడి మాజీ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పైలా సోమినాయుడు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను మల్లికార్జునపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న పైలా సోమినాయుడుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు పనిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చందన సురేష్, పల్లంటి గంగాధర్, పైలా సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, ఏప్రిల్ 12: వన్‌టౌన్‌లోని 11 కేవీ ట్యాంక్ బండ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి వీధి, బీఆర్‌పీ రోడ్డు, కృష్ణవేణి కాంప్లెక్స్ ఏరియా, మస్తాన్ వీధి రాయల్ హోటల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. **లబ్బీపేట:** న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, చంద్రమౌళిపురం, టిక్కిల్‌రోడ్డు, శ్రీరామ్ నగర్, మొహద్దీన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీసు రోడ్డు, పటమట లంక, కన్నా నగర్, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్, ఈనాడు, రాఘవ నగర్, నేతాజీ రోడ్, సీతారామ నగర్, ఆశ్రమం రోడ్, మసీద్ స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీసీలకు అండ టీడీపీ

● రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పీతా గోవింద్

పటమట, ఏప్రిల్ 12 : టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందించి టీడీపీ బీసీలకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పీతా గోవింద్ అన్నారు. అశోక్‌నగర్‌లో తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఉదయం 12, 13 డివిజన్లలో బీసీ కులాలకు చెందిన వారితో సమావేశం నిర్వహించారు. బీసీ విభాగం అధ్యక్షుడు పేరేపీ ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీతా గోవింద్ మాట్లాడుతూ బీసీల రక్షణ కోసం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక రక్షణ చట్టం తెస్తారని చంద్రబాబు నాయుడు చెప్పారని అన్నారు. బీసీలంతా వచ్చే ఎన్నికల్లో కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్.ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, గద్దె ప్రసాద్, శాంతి సాయిలక్ష్మి, అబ్దుల్ ఖాలిక్‌లు పాల్గొన్నారు.

కండ్రిక కాలనీలో ఎన్నికల ప్రచారం

పాయకాపురం, ఏప్రిల్ 12 : 64వ డివిజన్ కండ్రిక కాలనీలో డివిజన్ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నేతలు సూరవరపు నాగరాజు, ఇప్పిలి నాగమణి, పలగాని శివ, బాబు, ఇందుర్తి లక్ష్మీనారాయణ, పుణ్యవతి, కెనడి, రాజారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

గుణదల, ఏప్రిల్ 12: ఐఎస్‌టీఎస్‌వో నిర్వహించిన పోటీ పరీక్షల్లో కరెన్సీనగర్‌కు చెందిన శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన పలువురు బాలబాలికలు పాల్గొని ప్రతిభ కనబర్చారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు పొందిన వారికి శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాల జీఎం మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్లూరి సునీత తెలిపారు. ఆర్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు అవసరమైన చర్యలు

వన్‌టౌన్, ఏప్రిల్ 12: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని జిల్లా గ్రామీణ, నీటి సరఫరా సంఘం పర్యవేక్షక ఇంజనీర్ బి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటిపై కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో తాగునీటి సమస్యలపై ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. నేరుగా టెలిఫోన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. తాగునీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ 9100121300, సిబ్బంది జి.పద్మజ 9100121306, ఎల్‌పీఎస్‌ఆర్ కృష్ణ 6304990363, ఎం.బాలచంద్ర 9989206318 నెంబర్లలో ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమలో మౌలిక వసతులు కల్పిస్తా

● సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కోటేశ్వరరావు



ఎన్నికల ప్రచారంలో జి.కోటేశ్వరరావు

భవానీపురం, ఏప్రిల్ 12 : పశ్చిమలో తనను గెలిపిస్తే కొండ శివారు ప్రాంతాల ఇళ్లకు తాగునీరు అందించేందుకు కృషి చేయడంతో పాటు మౌలిక వసతులను మెరుగు పరుస్తానని సీపీఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి జి. కోటేశ్వరరావు అన్నారు. ఇండియా కూటమి బలపర్చిన కోటేశ్వరరావు శుక్రవారం 45వ డివిజన్ కబేళా, రోటరీనగర్, బ్రహ్మయ్యనగర్, ఊర్మిళానగర్, భగత్‌సింగ్ సెంటర్ల మీదుగా చర్చి వరకు ప్రచారం నిర్వహించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీ.భాస్కరరావు, తాడి పైడయ్య, కొట్టు రమణరావు, పంచదార్ల దుర్గాంబ పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న డ్రెయినేజీ మురుగునీటిపై సమాధానం చెప్పాలి

రాణిగారితోట, ఏప్రిల్ 12: కోట్ల రూపాయలతో డివిజన్‌ను అభివృద్ధి చేశానని చెపుతున్న కార్పొరేటర్ పొంగి పొర్లుతున్న డ్రెయినేజీ మురుగునీరుపై సమాధానం చెప్పాలని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. డివిజన్‌లోని సంగుల పేరయ్య వీధిలో పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ మురుగునీటిని స్థానిక టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ నగరంలోనే ఈ డివిజన్‌లో అత్యధికంగా రూ.12కోట్లు పెట్టి మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేశానని చెబుతున్న కార్పొరేటర్ కమిషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేశాడనడానికి నిదర్శనం డివిజన్‌లో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థేనని అన్నారు. ఎన్నికల ప్రచారం కోసం వస్తున్న ఆయనను ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. నాయకులు పీరుబాబు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, విజయ్, శాంతిబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 13 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం

- యశ్



ఇప్పటివరకూ పలు భారతీయ భాషల్లో రామాయణంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిల్లో ఎన్నో అభూత కల్పనలు, వక్రీకరణలు, మార్పులు చోటు చేసుకున్నాయి. క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో రచయితలు, దర్శకులు చేసిన ప్రయోగాల వల్ల కొన్ని సినిమాలు అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. వాటన్నింటికీ భిన్నంగా నిజమైన రామాయణాన్ని వెండితెరపైకి తెచ్చేందుకు తాము సిద్ధమవుతున్నామని హీరో యశ్ చెప్పారు. ఆయన సొంత నిర్మాణ సంస్థ మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా రామాయణాన్ని నిర్మించబోతున్నారు. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పటివరకూ చాలా రామాయణాలు వెండితెరపైన వచ్చినా అందులో పూర్తిగా రామాయణం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఏది అనేది తెలియదు. కానీ మేం ఇప్పుడు అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం' అని యశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రామాయణం చేస్తే బాగుంటుందని నమిత్, నేను చాలా సార్లు అనుకున్నాం. కానీ అంత పెద్ద సబ్జెక్ట్‌ను తీయాలంటే బడ్జెట్ సరిపోదు. అందుకు నేను కూడా సహ నిర్మాతగా చేరాను. రామాయణానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. దానికోసం ఎంతైనా కష్టపడతాను. అందులో ఉన్న భావోద్వేగాలు, విలువలు గురించి ప్రపంచం అంతా చాటాలి. డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా ఇప్పటివరకూ చూడని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని చెప్పారు. రామాయణం లాంటి గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రపంచస్థాయి వేదికలపైకి తీసుకెళ్లాలంటే యశ్ లాంటి వారికే సాధ్యం అని నమిత్ మల్హోత్రా చెప్పారు. అయితే ఈ సినిమాలో యశ్ నటుడిగా ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని బయటపెట్టలేదు. గతంలో ఆయన రావణుడి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా కనిపించనున్నారని టాక్. 'కేజీయఫ్' సిరీస్‌తో హీరోగా స్టార్‌డమ్ దక్కించుకున్నారు యశ్. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' అనే చిత్రం చేస్తున్నారు.

సెప్టెంబర్ 5న 'గోట్'



తమిళ నటుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్). తారస్థాయిలో అంచనాలు ఉన్న ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్టైనర్‌కు వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు వెంకట్‌ప్రభు గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించారు. ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రభుదేవా, ప్రశాంత్, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు.



సల్మాన్ 'సికందర్'

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, డైరెక్టర్ ఏ ఆర్ మురుగుదాస్ ఓ చిత్రం కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. రంజాన్ సందర్భంగా ఈ మూవీ టైటిల్‌ను ఖరారు చేశారు. 'సికందర్'గా ఈ చిత్రానికి టైటిల్ పెట్టినట్లు సల్మాన్ ఖాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. సాజిద్ నదియడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈద్ కానుకగా 2025లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన సాంకేతిక బృందాన్ని, నటీనటులు వివరాల్ని ప్రకటించాల్సి ఉంది.

కార్తికేయ... వాయు వేగం

కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా ప్రశాంత్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. 'భజే వాయువేగం' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. శుక్రవారం మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్‌తో కార్తికేయ పరుగు తీస్తుండగా, నేపథ్యంలో కరెన్సీ ఎగురుతూ కనిపించింది. టైటిల్, పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి, సినిమా ఘన విజయం అందుకోవాలి అని మహేశ్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాణసంస్థ యూవీ కాన్సెప్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఐశ్వర్యమీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి రాజశేఖర్



చాలా రోజుల తర్వాత డాన్స్ చేశా

- వరలక్ష్మీ శరత్‌కుమార్

వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో మే 3న విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు ట్రైలర్‌ను హీరో వరుణ్‌సందేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'తెలుగులో తొలిసారి కథానాయిక ప్రాధాన్య చిత్రం చేశాను. మా నిర్మాత కథను నమ్మి రాజీపడకుండా సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో డాన్స్ చేశా' అన్నారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'వరలక్ష్మీ గారు నిర్మాత గురించి ఆలోచించే ఆర్టిస్ట్. నిర్మాతగా నా తొలి చిత్రం 'శబరి'. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. ట్రైలర్ బీభత్సంగా ఉంది, సినిమా భారీ విజయం అందుకోవాలి అని నటుడు ప్రభు ఆకాంక్షించారు.

యూనిక్ కాన్సెప్ట్‌తో



వైశాలి' చిత్రాన్ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'శబ్దం'. ఈ సినిమా టీజర్‌ను విక్టరీ వెంకటేశ్ శుక్రవారం విడుదల చేశారు. హీరో ఆది ఒక హాంటెడ్ హౌస్ దగ్గర కొన్ని వింత సంఘటనలు జరిగినప్పుడు విచిత్రమైన శబ్దాలను రికార్డ్ చేయడం కనిపిస్తుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ టీజర్‌ను టెరిఫిక్‌గా ప్రజెంట్ చేశారు. 'వైశాలి'లో రెయిన్ బేస్డ్ సీన్లు చాలా ఉండగా, 'శబ్దం'లోని అధిక శాతం సీన్లను ముంబై, మున్నార్, చెన్నై వంటి పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించారు. అలాగే ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్ వేయడం విశేషం.

సిమ్రన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ తదితరులు నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సెవన్ జీ శివ చెప్పారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కల్లు కాంపౌండ్ చెప్పిన కథ


ఓ యదార్థ సంఘటన ఆధారంగా సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రం 'కల్లు కాంపౌండ్ 1995'. గణేశ్, ఆయుషి పటేల్ జంటగా నటిస్తున్నారు. ప్రవీణ్ జెట్టి దర్శకత్వంలో బుర్రా మల్లేశ్‌గౌడ్, హారిక జెట్టి, విజయలక్ష్మి పిట్ల నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "కల్లు కాంపౌండ్ 1995' స్టోరీ డిఫరెంట్‌గా ఉంటుంది. కొత్త తరహా చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. మంచి కథతో పాటు సందేశం ఉంది' అన్నారు. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రం అని నిర్మాతలు తెలిపారు. ఎలాంటి ఆడిషన్ లేకుండానే దర్శక నిర్మాతలు ఈ సినిమాలో అవకాశం ఇచ్చారని గణేశ్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆరె సందీప్.

అటు కృష్ణమ్మ... ఇటు దుర్గమ్మ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం ప్రతిభతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్న సత్యదేవ్ తాజా చిత్రం 'కృష్ణమ్మ' రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ మూవీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు.



ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సాకేత్ కొమండూరి పాడారు. కాలాభైరవ స్వరాలు సమకూర్చారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడి పాడే పాట ఇది. అతీరా రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘు కుంచె, నందగోపాల్ ఇతర ముఖ్యతారాగణం.



రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరోహీరోయిన్లుగా నటించే కొత్త చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేశ్ కడుముల ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మురళీధర్ రెడ్డి, కెటిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో దర్శకుడు మారుతి తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు నక్కిన త్రినాథరావు గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామి రారా', 'అంధధూన్' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు.

నిర్మాతల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 'కథ అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'నా ఫేవరెట్ జానర్ క్రైమ్ కామెడీ. చాలా మంచి కథ. మీ అందరి ఆశీస్సులు కావాలి' అన్నారు రాజ్ తరుణ్.

ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, డీవోపీ: ఆదిత్య జవ్వాడి, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.



న్యూ ఏజ్ సినిమా

:దిల్‌రాజు

ఆశిష్, వైష్ణవిచైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్ ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీశ్, దిల్‌రాజు సమర్పణలో హర్షిత్‌రెడ్డి, నాగమల్లిడి, హన్షిత నిర్మించారు. 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవల ఈ మూవీ ఆడియో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. డైరెక్టర్ అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ వైబ్స్ చూసి సంతోషంగా ఉంది" అని అన్నారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని లవ్, హారర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ అందరికీ మంచి థ్రిల్ ఇస్తాయి" అని అన్నారు. నటి వైష్ణవిచైతన్య మాట్లాడుతూ "డిఫరెంట్ లవ్ స్టోరీ ఇది" అని చెప్పారు. చిత్ర నిర్మాత హన్షిత మాట్లాడుతూ "ఎప్పుడైనా, ఎవరైనా గోస్ట్‌ని లవ్ చేశారా? లవ్ చేయండి. మీకు తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.



మూడు పాత్రల కిడ్నాప్ డ్రామా

చైతన్యారావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన 'పారిజాత పర్వం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ను యాంకర్ సుమ లాంచ్ చేశారు. కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట. మళ్లీ లైట్స్ వేసే లోపు కేక్‌తో పాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని కిడ్నాప్ ప్లాన్‌ను సునీల్ తన గ్యాంగ్‌కు వివరిస్తుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

'కిడ్నాప్ ఈజ్ యాన్ ఆర్ట్ అనే ట్యాగ్ లైన్‌ను జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఈ మూడు పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ డ్రామా ఇది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్న ఈ ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది.

సీతా కల్యాణం అప్పుడే

సుమన్‌తేజ్, గరీమా చౌహాన్ జంటగా నటించిన 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అందమైన ప్రేమ కథతో, యాక్షన్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సతీశ్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. టైటిల్‌లో ఎంత ఫీల్ గుడ్ ఎమోషన్ దాగి ఉందో ఈ లుక్ పోస్టర్ చూస్తుంటే అంత వయలెన్స్ కూడా ఉందనిపిస్తోంది. గగన్ విహారి విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగినీడు, శివాజీరాజా, ప్రభావతి, వెంకీ మంకీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.



తెలంగాణలో తొలి మూకీ చిత్రం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్మించిన తొలి మూకీ చిత్రం 'కావ్య రాజ్'. కవితా రాజ్‌పుత్, జమున, అంజలి, మధు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని మధు లింగాల దర్శకత్వంలో గజగౌని దయానంద్ గౌడ్ నిర్మించారు. తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ' కరీంనగర్ నివాసి, తెలంగాణ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి దాదాపు 300కి పైగా చిత్రాల్లో నటించిన పైడి జయరాజ్‌గారికి ఈ సినిమా అంకితం ఇస్తున్నాం' అని ప్రకటించారు.

'వాట్సప్‌లో గౌడ గ్రూప్‌లో ఉన్న వారిని ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఈ చిత్రం నిర్మించడం సంతోషదాయకం. చాలా కాలం తర్వాత మళ్లీ ఓ మూకీ చిత్రం వస్తోంది. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు ప్రసన్నకుమార్.

ఈ కథ విన్నప్పుడు షాక్ అయ్యా

:సుకుమార్

కృష్ణంరాజు ఫ్యామిలీ నుంచి మరో నటుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ప్రభాస్ కజిన్ విరాట్‌రాజ్ డెబ్యూ ఫిల్మ్‌కు కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ ఆర్ కల్యాణ మండపం రాజు, కల్వకోట వెంకటరమణ, కాటారి సాయికృష్ణ కార్తిక్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు సుకుమార్ ఈ మూవీ టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి టైటిల్ 'గౌడ్‌సాబ్'. రాహుల్ సిప్లిగంజ్ క్లాప్ కొట్టగా, జానీ మాస్టర్, భాను మాస్టర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. గణేశ్ మాస్టర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యా. కథ చాలా బాగుంది. టైటిల్‌లోనే ట్విస్ట్ ఉంది" అని చెప్పారు. మూవీ డైరెక్టర్ గణేశ్ మాస్టర్ మాట్లాడుతూ "డ్యాన్స్ మాస్టర్‌గా నన్నెలా ఆదరించారో డైరెక్టర్‌గానూ అంతే ఆదరించండి" అని కోరారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమా ఒక ట్రూ లవ్ స్టోరీ" అని చెప్పారు. హీరో విరాట్‌రాజ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు కథ, కథనం అద్భుతంగా కుదిరాయి" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, డిఓపీ: ఆర్ ఎమ్ స్వామి, సంగీతం: వెంగి.



ఆస్పత్రిలో చేరిన సాయాజీ షిండే



పలు చిత్రాల్లో విలన్‌గా నటించిన సాయాజీ షిండేకు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిగా మహారాష్ట్రలోని సతారా ఆస్పతిలో చేర్పించారు. పలు వైద్య పరీక్షల అనంతరం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు బ్లాక్ అయ్యాయని వైద్యులు గ్రహించారు. వెంటనే ఆయనకు యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే డిస్చార్జి చేస్తామన్నారు.

మహారాష్ట్రకు చెందిన సాయాజీ నటుడిగా తెలుగు వారికి సుపరిచితుడే. వచ్చీ రాని తెలుగులో ఆయన డైలాగులు పలికే విధానం ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించిన సాయాజీ దక్షిణాదిన కూడా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు.

వంటిల్లు

ఎండాకాలంలో చల్ల చల్లగా!

వేసవిలో డీహైడ్రేషన్ సమస్య ఎక్కువగా వస్తుంది. తరచూ మంచి నీళ్లు, కొబ్బరి నీళ్లు తాగాలి. వీటితో పాటు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఇంట్లోనే సులువుగా కొన్ని రకాల జ్యూస్‌లను తయారు చేసుకోవచ్చు. అవే ఇవి..

కీరా జ్యూస్

కావాల్సిన పదార్థాలు

కీర దోసకాయ- 1, అల్లం- ముక్కలు పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, వాము- పావు టీస్పూన్, పుదీనా ఆకులు- 10, ఉప్పు- 1 టీస్పూన్, పటిక బెల్లం- 4 టీస్పూన్లు, నీళ్లు- 800 మి.లీ., నిమ్మకాయ- ఒకటి

తయారీ విధానం

కీర దోసకాయను తొక్క తీయకుండా చిన్న ముక్కలుగా చేసుకోవాలి. జ్యూస్ జార్‌లో కీర దోస ముక్కలు, అల్లం, జీలకర్ర, వాము, పటికబెల్లం, పుదీనా ఆకులు, ఉప్పుతో పాటు నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని పలుచటి గుడ్డతో వడగట్టాలి. ఆ తర్వాత నిమ్మరసం కలిపి సర్వ్ చేయాలి. ఈ కీర జ్యూస్ తాగితే ఎండాకాలంలో ఫ్రెష్‌గా, కూల్‌గా ఉంటుంది. ఈ పానీయం తరచుగా తాగటం వల్ల వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.



పుదీనా జ్యూస్

కావాల్సిన పదార్థాలు

పుదీనా- ఒక కట్ట, బ్లాక్ సాల్ట్- అర టీస్పూన్, అల్లం- చిన్న ముక్క, జీలకర్ర- అర టీస్పూన్, వాము- అర టీస్పూన్, తులసి ఆకులు- 4, తేనె- 4 టీస్పూన్లు, పటిక బెల్లం- 4 టీస్పూన్లు, నీళ్లు- లీటర్, సబ్జా గింజలు - టీస్పూన్

తయారీ విధానం

ముందుగా చిన్న జార్‌లో పుదీనా ఆకులు, తులసి ఆకులు, అల్లం, జీలకర్ర, బ్లాక్ సాల్ట్, వామును గ్రైండ్ చేసి పక్కన ఉంచుకోవాలి. ఈ మిశ్రమాన్ని జ్యూస్ జార్‌లో వేసి సరిపడ నీళ్లు వేశాక.. పటిక బెల్లం వేసి ఒకసారి మిక్సీ పట్టాలి. దీన్ని వడపోసి తేనె కలపాలి. ఈ మిశ్రమానికి సబ్జా గింజలు కలిపితే పుదీనా జ్యూస్ రెడీ.







స్పెషల్ మజ్జిగ

కావాల్సిన పదార్థాలు

మజ్జిగ- 4 గ్లాసులు, నాలుగు గ్లాసుల నీళ్లు, పెరుగు- 3 టేబుల్ స్పూన్లు, అల్లం ముక్క- చిన్నది, పచ్చిమిర్చి- 1 (చిన్నది), ఉల్లిపాయ- చిన్నది, జీలకర్ర- పావు టీస్పూన్, వాము- పావు టీస్పూన్, కొత్తిమీర- కొద్దిగా, పుదీనా ఆకులు- 4, ఉప్పు- 1 టీ స్పూన్ .

తయారీ విధానం

జ్యూస్ జార్‌లో అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, జీలకర్ర, వాము, కొత్తిమీర, పుదీనా ఆకులు, పెరుగు వేసి మిక్సీ పట్టాలి. ఇందులో నాలుగు గ్లాసుల మజ్జిగ, నాలుగు గ్లాసుల నీళ్లు పోయాలి. చివరగా ఉప్పు వేసి మరోసారి మిక్సీ పట్టి సర్వ్ చేయాలి. ఈ స్పెషల్ మజ్జిగ ఎంతో రుచికరంగా ఉంటుంది.



బెల్లం జ్యూస్

కావాల్సిన పదార్థాలు

బెల్లం పొడి- 4 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి- అర టీస్పూన్, శొంఠి పొడి- అర టీస్పూన్, యాలకుల పొడి- పావు టీస్పూన్, ఉప్పు రుచికి తగినంత, పటిక బెల్లం- 1 టేబుల్ స్పూన్, సబ్జా గింజలు- 2 టీస్పూన్లు, నిమ్మకాయ- ఒకటి, నీళ్లు- లీటర్

తయారీ విధానం

ముందుగా సబ్జా గింజలు నానబెట్టుకోవాలి. ఆ తర్వాత నీళ్లలోకి బెల్లం పొడి వేసి కరిగించాలి. ఆ తర్వాత వెంట వెంటనే మిరియాల పొడి, శొంఠి పొడి, యాలకుల పొడి, ఉప్పు వేసి బాగా మిక్స్ చేయాలి. ఆ తర్వాత కొద్దిగా పటికబెల్లం వేయాలి. దీని వల్ల రుచి పెరుగుతుంది. ఈ మిశ్రమంలో నానబెట్టిన సబ్జా గింజలు వేసి బాగా కలపాలి. చివరలో నిమ్మరసం వేసి తాగితే టేస్టీగా ఉంటుంది.



శైలజ
సైలాస్ కిచెన్, యూట్యూబ్ ఛానల్, asksailaw@gmail.com

వేసవికి విరుగుడు నారికేళ క్షీరపాకం!

కొబ్బరి వల్ల ప్రయోజనాలు అనేకం. ఈ విషయాన్ని మన పూర్వీకులు ఎప్పుడో గుర్తించారు. అందుకే దక్షిణ భారత దేశంలో దీనిని విరివిగా సాగు చేసేవారు. ఈ విషయాన్ని క్షేమకుతూహలం గ్రంథంలో క్షేమశర్మ కూడా ప్రముఖంగా ప్రస్తావించాడు.

తెన్ అంటే దక్షిణ దిక్కు. దక్షిణ భారతంలో ఎక్కువగా లభ్యమవుతుంది కాబట్టి దీనికి టెంకాయ అని కూడా అనవచ్చు. కొందరు తేనె+కాయ అని కూడా వ్యుత్పత్తి చెబుతారు. కొబ్బరిని దక్షిణాది వారు మాత్రమే కాదు. ఉత్తరాది వారు కూడా ఎక్కువగానే వాడతారు. 1860లలో కొబ్బరి గురించి పాశ్చాత్యులకు తెలిసింది. 19వ శతాబ్దం నుంచి దీనిని అమెరికన్లు కూడా విరివిగా వాడటం మొదలుపెట్టారు.

క్షేమ కుతూహలం

కలిపి మెత్తగా దంచి కుంకుడు గింజంత మాత్ర చేసి రోజూ ఒకటి తినిపిస్తే పిల్లలు పక్కతడపటం ఆగుతుంది. కొబ్బరి చెట్టు చుట్టూ దుప్పట్లు పరిచి ఉంచితే కొబ్బరి చెట్టు పూలు రాలి పడతాయి. వీటితో టీ కాచుకుని తాగుతుంటే అరికాళ్ళ మంటలు, షుగరు వ్యాధి వలన వచ్చే ఉపద్రవాలు తగ్గుతాయి. క్షేమసాగరంలో కొబ్బరితో పాయసం ఎలా చేయాలో కూడా వివరించారు.

తయారీ విధానం

కొబ్బరి ముక్కల్ని పాలలో వేసి పాలన్నీ ఇగిరేంతదాకా బాగా ఉడికించి, అన్నం మెతుకంత సన్నని ముక్కలుగా తరగండి. విడిగా తగినన్ని పాలు తీసుకుని పంచదార కలిపి రెండుమూడు పొంగులు వచ్చేదాకా కాచి.. సన్నగా తరిగిన ఈ కొబ్బరిని అందులో కలపండి. ఏలకులు వగైరా సుగంధ ద్రవ్యాలు చేర్చండి. చల్లారాక చిటికెడంత పచ్చకర్పూరం వెయ్యండి. కొబ్బరి తురుముని కూడా పాలలో వేసి పంచదార కలిపి పాయసం కాయొచ్చుగదా అని అడగవచ్చు. కానీ కొబ్బరిని పాలలో ఉడికించటం ఒక శుద్ధి ప్రక్రియ. రెండవ అంశం కొబ్బరిని ముద్దలా మిక్సీ పట్టి పాలలో వేసిన దానికన్నా ఇలా సన్నగా తరిగి పాలలో కలిపితే పంటికిందకు మెత్తని ముక్కలొచ్చి అదనపు రుచినిస్తాయి. మరీ పలుచగానూ, మరీ చిక్కగానూ కాకుండా గరిట జారుగా కాచిన ఈ కొబ్బరి పాయసం రుచికరంగా ఉంటుంది. ఇలా తయారు చేసిన కొబ్బరి పాయసం మృదువుగా తియ్యగా ఉంటుంది. నూనె స్వభావం కలిగింది. చలవ చేస్తుంది. వాతాన్ని వేడినీ తగ్గిస్తుంది మూత్రాశయ వ్యవస్థను శుద్ధి చేస్తుంది. బలకరం, పోషణనిస్తుంది ఆలశ్యంగా అరుగుతుంది. సంతృప్తి నిస్తుంది. పుష్టినిస్తుంది. ఆకలి తీరుస్తుంది.

అల్సర్లకు మందు..

కొబ్బరి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది అల్సర్లను తగ్గించటం. కొబ్బరి కేవలం కడుపులో మంటను మాత్రమే కాకుండా.. మూత్రంలోను, గుండెలోని మంటలను కూడా తగ్గిస్తుంది. విరోచనాలను ఆపుతుంది. గర్భాశయాన్ని బలోపేతం చేస్తుంది. మూత్రవ్యాధులు ఉన్నవారికి ఇదొక మంచి ఔషధంగా గుర్తించారు. కొబ్బరి బోండాంలో ఉన్న నీటిని ఎళనీరు అనీ.. ఎండిన కొబ్బరి బోండాంని తెలుగులో బొరియ లేదా బొర్రె అనీ.. కొబ్బరి కాయలో నీరంతా ఇంకిపోయిన కొబ్బరిని కురిడీ అనీ.. తురుముని కోప్రా అనీ అంటారు. లేతగా ఉన్న కొబ్బరి ఆహార యోగ్యం. మరీ ముదిరినది నూనె తీయటానికి.. మధ్యస్థంగా ఉండేది ఔషధాల తయారీకి పనికొస్తుంది. కొబ్బరి నీళ్ళు క్షారగుణం కలిగి ఉంటాయి, ఈ నీళ్లలో లవణాలు, ఖనిజాలు శోషని ఆపుతాయి. వడదెబ్బకు విరుగుడుగా పనిచేస్తాయి. లేత కొబ్బరిని, కొబ్బరినీళ్లను కలిపి మిక్సీపట్టి తాగితే ఎక్కిళ్ళు వెంటనే ఆగుతాయి. కొబ్బరిని, సమానంగా సైంధవలవణాన్ని కలిపి మెత్తగా నూరి పుటం పెట్టి చేసిన భస్మాన్ని నారికేళ లవణం అంటారు. ఆయుర్వేద మందులషాపుల్లో దొరుకుతుంది కూడా! ఎలాంటి కామెర్లనైనా తగ్గించే శక్తి దీనికుంది. పేగుల్లో వచ్చే అల్సర్లు, గుండెలో మంట, నోటిపూత తగ్గుతాయి. కొబ్బరినీళ్లలో గానీ మజ్జిగలో గానీ అరచెంచా మోతాదులో కలిపి దీనిని తీసుకోవచ్చు. రాలిపడ్డ లేత కొబ్బరి పిందెలు సేకరించుకుని పైన ఉండే పెచ్చు తీసేసి.. లోపలి భాగాన్ని, నువ్వులు, బెల్లంతో

• గంగరాజు అరుణాదేవి



ప్రతి ఒక్కరిదీ ఉరుకుల పరుగుల జీవితమే! కుదురుగా కూర్చుని తినే తీరిక ఎవరికీ ఉండడం లేదు. ఇలా 40% దేశ జనాభా, ఉదయం అల్పాహారాన్ని స్కిప్ చేస్తున్నట్టు గ్రహించిన **సుహాసిని సంపత్**, ఓ తెలివైన చిట్కా కనిపెట్టింది. రుచికీ, పోషకాలకూ ఏ మాత్రం తీసిపోని ప్రొటీన్ బార్స్‌ను రూపొందించి, అరుదైన బ్రాండ్‌ను సృష్టించింది.

బ్రేక్‌ఫాస్ట్ బదులు ప్రొటీన్ బార్

వినూత్నం

దేశ జనాభాలో 40% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేస్తున్నట్టు గణాంకాల ద్వారా తెలుసుకున్న సుహాసిని ఆ విషయాన్ని తన చెల్లెలు అనందిత సంపత్‌తో పంచుకుంది. ఇది 2012 నాటి సంగతి. అప్పట్లో వాళ్లిద్దరూ న్యూయార్క్‌లో ఉండేవారు. ఇద్దరూ కలిసి యోగా తరగతులకు హాజరవుతూ, అందుబాటులో ఉన్న ప్రొటీన్ బార్లను తరచూ తింటూ ఉండేవారు. ఒక రోజు అనందిత ఒక ప్రొటీన్ బార్ కొని, దీన్ని మించిన ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం ఉంటే ఎలా ఉంటుంది? అని అక్క సుహాసినిని అడిగింది. అలాగే ఒకవేళ తానే అలాంటి బార్స్‌ను తయారుచేయగలిగితే, వాటికి యోగా బార్స్ అనే పేరు పెడతానని కూడా చెప్పింది. చెల్లి మాటలతో స్ఫూర్తి పొందిన సుహాసిని అదే ఏడాది ఆ పేరును ట్రేడ్‌మార్క్‌గా చేసుకుంది. అయితే ఆరోగ్యకరమైన ప్రొటీన్ బార్ల తయారీ గురించి అవగాహన పెంచుకోడానికి వాళ్లకు మూడేళ్ల సమయం పట్టింది. "మేం 100% సురక్షితమైన దినుసులనే వాడాలనుకున్నాం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలనుకునే భారతీయుల కోసం భారతదేశంలో దొరికే పదార్థాలనే ఎంచుకున్నాం" అని మీడియాకు వివరించిన సుహాసిని తన యోగా బార్ ద్వారా, రోజుకు 20 గ్రాముల ప్రొటీన్‌ను భారతీయుల చేత తినిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



ఇంతింతై వటుడింతై...

ఈ అక్కాచెల్లెళ్లు తమ ప్రొటీన్ బార్లలో ఎలాంటి కృత్రిమ పదార్థాలు ఉండకూడదని నిర్ణయించుకున్నారు. అలాగే వాటిని వీలైనంత సహజసిద్ధ పదార్థాలతో తయారు చేయాలనే ఉద్దేశంతో, ఖర్జూరాలు, ఓట్స్, బాదం, తేనెలను ఉపయోగించుకున్నారు. ఉదయం అల్పాహారంగా తినే ఆహారం తినడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు రుచి, పోషకాల పరంగా దీటుగా ఉండాలన్నది వాళ్ల సంకల్పం. అలా అంతిమంగా 2015లో యోగా బార్స్‌ను వాళ్ల మార్కెట్లో ప్రవేశపెట్టారు. ఈ వ్యాపారంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల పెట్టుబడులు కూడా ఉన్నాయి. యోగా బార్స్ తయారీ కోసం అనుభవమున్న బేకర్స్‌ను కలిసింది సుహాసిని. ప్రారంభంలో వాళ్ల యోగా బార్స్‌ను బెంగుళూరులోని యోగా స్టూడియోల్లో అమ్మకాలకే పరిమితం చేశారు. కానీ తక్కువ సమయంలోనే వాళ్ల యోగా బార్స్ 5 వేల స్టోర్స్‌కు విస్తరించాయి. ఉరుకుల పరుగుల జీవితం గడిపేవాళ్లు, యోగాను ఇష్టపడేవారు ఆ యోగా బార్స్‌ను మళ్లీ మళ్లీ ఆర్డర్ చేయడం మొదలుపెట్టారు. అలా యోగా బార్ కంపెనీ 70 కోట్లకు పైగా వ్యాపారాన్ని విస్తరించుకోగలిగింది.

ప్రొటీన్ బార్ల తయారీ గురించి అవగాహన పెంచుకోడానికి మూడేళ్ల సమయం పట్టింది. మేం సురక్షితమైన దినుసులనే వాడాలనుకున్నాం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలనుకునే భారతీయుల కోసం భారతదేశంలో దొరికే పదార్థాలనే ఎంచుకున్నాం

ఆరోగ్యం అమ్ముడుపోదు అన్నారు

యోగా బార్ పట్ల వెల్లువెత్తిన విమర్శల గురించి ప్రస్తావిస్తూ "సంగీతాన్ని వినలేని వాళ్లకు డాన్సులు చేసే వాళ్లు పిచ్చివాళ్లలా కనిపిస్తారు. దీన్ని ఆధునిక ఆలోచనాపరుల్లో, అత్యంత ప్రతిభావంతుడైన ఫ్రెడెరిక్ నీషేకు కూడా ఆపాదించుకోవచ్చు. నేనీ కొటేషన్‌ను ఎంచుకోడానికి ఒక కారణం ఉంది. ప్రజలెప్పుడూ మన ఆశయాలను తక్కువ అంచనా వేస్తూ ఉంటారు. వాళ్లకు సాధారణంగా కనిపించని వాటితో సరిపోలని దేన్నైనా వాళ్లు వ్యతిరేకిస్తారు. అయినప్పటికీ గొప్ప కలలను కనడం మానుకోకూడదు. భారతదేశానికి ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తిని తీసుకొచ్చిన మొదట్లో అందరూ 'భారతదేశంలో ఆరోగ్యం అమ్ముడుపోదు' అని విమర్శించారు. కానీ వాళ్ల అభిప్రాయం తప్పు అని మేం నిరూపించగలిగాం" అంటూ తన ప్రయాణం గురించి వివరించింది సుహాసిని.

ప్రముఖ కంపెనీల వాటాలు

సుహాసిని, అనందిత... యోగా బార్లతో పాటు మూస్లీ, ఓట్స్, సిరీల్స్‌ను కూడా అమ్మడం మొదలుపెట్టారు. ఆ తర్వాత యోగా బార్ 100 కోట్ల ఆర్థిక లాభాన్ని ఆర్జించే స్థితికి చేరుకుంది. 39% వాటా కోసం ఐటిసి (ఇంపీరియల్ టొబాగో ఆఫ్ ఇండియా) యోగా బార్‌లో 175 కోట్లను పెట్టుబడిగా పెట్టింది. ప్రస్తుతం ఐటిసితో పాటు నెస్లె, డాబర్ లాంటి ప్రముఖ కంపెనీలన్నీ యోగా బార్‌లో వాటాలను కలిగి ఉన్నాయి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లోఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/oNUXbpW లో చదవండి.

మేకప్

కళకళలాడే క్లౌడ్ స్కిన్

మెరుపులీనే మ్యాటీ లుక్‌ను తెచ్చిపెట్టే మేకప్ క్లౌడ్ స్కిన్ మేకప్. తాజా ట్రెండ్‌గా మారిన ఈ మేకప్ మెలకువలను తెలుసుకుందాం!



ప్లంప్ అండ్ ప్రైమ్

క్లౌడ్ స్కిన్ మేకప్ కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ముఖాన్ని మాయిశ్చరైజ్ చేసి, మృదువుగా, తేమగా కనిపించేలా చేయడం కోసం ప్రైమర్ అప్లై చేయాలి.

బేస్ ఇలా

ఇన్‌స్టంట్ ఏజ్ రివైండ్ లేదా ఇన్‌స్టంట్ పర్‌ఫెక్టర్‌ను చర్మం మీద అప్లై చేసుకోవాలి. పొడి చర్మానికి సైతం నప్పే ఈ బేస్, చర్మం మీద చక్కగా పరుచుకుని, మెరుపులీనేలా చేస్తుంది.

లైటెనింగ్

ఫౌండేషన్ షేడ్ కంటే కాస్త లైట్‌గా ఉండే లిక్విడ్ కన్‌సీలర్‌ను ముఖం మీద మచ్చల మీద, కళ్ల దిగువన అప్లై చేసుకోవాలి. దీంతో మచ్చలు, కళ్ల కింద నలుపు మటుమాయమవుతాయి.

పౌడర్

తడి స్పాంజీతో సూపర్ స్టే పౌడర్ అప్లై చేసుకోవాలి. మెడ దిగువన, దవడల దగ్గర నుదుటి మీద, కళ్ల దిగువన ఇలా పౌడర్ అద్దవలసిన అవసరం ఉన్న ప్రదేశాల్లో స్పాంజీ అద్దుకుని బ్రష్‌తో అదనపు పౌడర్‌ను దులిపేయాలి.

బ్లష్

బ్లష్ చెక్కిళ్లకే పరిమితం అనుకుంటే పొరపాటు. నిజానికి పర్‌ఫెక్ట్ మేకప్ సొంతం కావాలంటే, చెక్కిళ్లు, చుబుకం, కళ్ల దిగువన, నుదుటి పైన... ఈ ప్రదేశాలన్నిటి దగ్గర బ్లష్‌ను వాడుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే

మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో సెట్టింగ్ స్ప్రే స్ప్రే చేసుకోవాలి.

నిమ్మతో హెయిర్ మాస్క్

- బౌల్‌లో టేబుల్ స్పూన్ హెన్నా పౌడర్ తీసుకుని అందులో జుట్టుకు వేసుకునేట్టు పేస్ట్‌లా కలపాలి. ఇందులోకి ఒక కోడిగుడ్డు సొన వేయాలి. సగం నిమ్మకాయను కోసి ఆ రసాన్ని పిండాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు మాస్క్‌లా వేసి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే జుట్టు నల్లగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ నిమ్మరసం, నాలుగు టేబుల్ స్పూన్ల పెరుగును బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే తలమీద చల్లగా ఉంటుంది.
- రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నీళ్లు కలపాలి. బాగా కలిపిన తర్వాత ఈ నీళ్లను జుట్టు మాడుకు తగిలేట్టు పట్టించి ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. దీనివల్ల జుట్టు మృదువుగా ఉంటుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. దీన్ని జుట్టుకు పట్టేట్టు పట్టించి ఆరిన తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రపరచుకోవాలి. దీనివల్ల జుట్టు పెరుగుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్ లోకి.. టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత క్లీన్ చేసుకోవాలి. దీనివల్ల జుట్టు లోని ఇన్ఫెక్షన్లు తొలగిపోతాయి.
- జుట్టులో చుండ్రు పోవాలంటే కేవలం నిమ్మరసం పట్టించుకున్నా చాలు. దీంతో పాటు సిట్రస్ వల్ల జుట్టులో మంట వచ్చినట్టు కొందరికి ఉంటుంది. దీనివల్ల ఇన్ఫెక్షన్లు పోతాయి.




టీసీఎస్ అదుర్స్

లాభం రూ.12,434 కోట్లు

మార్కెట్ అంచనాలను మించిన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు

- రూ.61,237 కోట్లకు పెరిగిన ఆదాయం
- 1,320 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లు
- 12.5%కి తగ్గిన ఉద్యోగుల వలసల రేటు
- ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్

ముంబై: మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి (క్యూ4) టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించి నమోదయ్యాయి. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9 శాతం వృద్ధితో రూ.12,434 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి లాభాల మార్జిన్లు పుంజుకోవడంతో పాటు భారత మార్కెట్లో కంపెనీ బలమైన పనితీరు కనబర్చడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ నికర లాభం రూ.11,392 కోట్లుగా ఉంది. కాగా, ఈ క్యూ4లో టీసీఎస్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5 శాతం పెరిగి రూ.61,237 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికానికి గడించిన ఆదాయం రూ.60,583 కోట్లుగా ఉంది. మరిన్ని ముఖ్యాంశాలు..



- గడిచిన మూడు నెలల్లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ 1.50 శాతం పెరుగుదలతో 26 శాతానికి చేరుకుంది.
- ఈ కాలానికి కొత్తగా 1,320 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకున్నట్లు టీసీఎస్ వెల్లడించింది. కంపెనీ త్రైమాసిక ఆర్డర్లలో ఇప్పటి వరకిదే అత్యధిక విలువ. గత ఆర్థిక సంవత్సరానికి మొత్తానికి లభించిన ఆర్డర్ల విలువ 4,270 కోట్ల డాలర్లుగా నమోదైంది.
- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంస్థ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9 శాతం పెరిగి రూ.45,908 కోట్లకు ఎగబాకింది. ఆదాయం 6.8 శాతం వృద్ధితో రూ.2,40,893 కోట్లకు పెరిగింది.
- బీఎస్ఎన్ఎల్‌తో రూ.15,000 కోట్లకు పైగా డీల్ కుదిరిన నేపథ్యంలో భారత మార్కెట్ వ్యాపార ఆదాయం 38 శాతం పెరిగింది. దాంతో కంపెనీ మొత్తం ఆదాయంలో భారత మార్కెట్ వాటా 6.7 శాతానికి పెరిగింది. 2022-23 క్యూ4లో ఈ వాటా 5 శాతంగా నమోదైంది.
- కంపెనీకి అతిపెద్ద మార్కెట్ అయిన ఉత్తర అమెరికా ఆదాయం మాత్రం ఈ క్యూ4లో 2.3 శాతం తగ్గింది. దాంతో మొత్తం ఆదాయంలో ఈ మార్కెట్ వాటా 52.4 శాతం నుంచి 50 శాతానికి తగ్గింది.
- క్యూ4లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు మరింత తగ్గి 12.5 శాతానికి పరిమితమైనట్లు కంపెనీ తెలిపింది. క్యూ3లో ఇది 13.3 శాతంగా నమోదైంది.
- బీఎస్ఈలో టీసీఎస్ షేరు ధర శుక్రవారం 0.45 శాతం పెరిగి రూ.4,000.30 వద్ద ముగిసింది.

గడిచిన త్రైమాసికానికి నమోదైన లాభాల మార్జిన్, కొత్త ఆర్డర్లు కంపెనీ వ్యాపార విధాన పటిష్ఠత, కార్యకలాపాల నిర్వహణ శ్రేష్ఠతను ధ్రువీకరిస్తుంది. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో కంపెనీ సేవల పోర్టుఫోలియో, ఆవిష్కరణల సామర్థ్యం, ఆలోచనతో కూడిన నాయకత్వం ద్వారా మేం మా కస్టమర్లతో మరింత సన్నిహితంగా పనిచేయడంతో పాటు వారి కీలక ప్రాధాన్యాలను అమలు చేయడంలో తోడ్పడుతున్నాం.

\- కే కృతివాసన్, టీసీఎస్ ఎండీ,సీఈఓ

వాటాదారులకు రూ.46,223 కోట్ల బొనాంజా

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు టీసీఎస్ ప్రకటించింది. త్వరలో నిర్వహించనున్న 29వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల ఆమోదం పొందిన తర్వాత డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ ఇప్పటికే రూ.45 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. తాజాగా ప్రకటించిన దానితో కలిపి మొత్తం డివిడెండ్ రూ.73కు చేరుకోనుంది. అంతేకాదు, 2023-24లో కంపెనీ రూ.17,000 కోట్ల విలువైన సొంత షేర్లను బహిరంగ మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసింది. అంటే, ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ తన వాటాదారులకు డివిడెండ్లు, బైబ్యాక్‌ల రూపంలో రూ.46,223 కోట్లు పంచింది.

19 ఏళ్లలో తొలిసారిగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య

గడిచిన మూడు నెలల్లో టీసీఎస్‌లో నికరంగా 1,759 మంది ఉద్యోగులు తగ్గారు. దాంతో మార్చి 31 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,01,546 మందికి పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీలో ఉద్యోగులు 2022-23తో పోలిస్తే 13,249 మంది తగ్గారు. గడిచిన 19 ఏళ్లలో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య తగ్గడం ఇదే తొలిసారి. 2022-23లో కంపెనీ ఉద్యోగుల నికర పెరుగుదల 22,600గా నమోదైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలోనైతే కంపెనీ ఉద్యోగులు రికార్డు స్థాయిలో 1.03 లక్షల మంది పెరిగారు.

వేతన పెంపు 4.5-7 శాతం

ఈ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చేలా ఉద్యోగుల వేతనాలను వారి పనితీరు ఆధారంగా 4.5 శాతం నుంచి 7 శాతం వరకు పెంచినట్లు టీసీఎస్ తెలిపింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జీతాన్ని రెండంకెల స్థాయిలో పెంచడం జరిగిందని కంపెనీ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు.

40,000 మంది ఫ్రెషర్ల నియామకం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఐటీ సేవల డిమాండ్ మళ్లీ పుంజుకోవచ్చని భావిస్తోన్న టీసీఎస్.. తొలి దశలో ఇప్పటికే 10,000 మందికి పైగా ఫ్రెషర్లను నియమించుకున్నట్లు తెలుస్తోంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 40,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. నేషనల్ క్వాలిఫైయర్ టెస్ట్ (ఎన్‌క్యూటీ) ద్వారా ఫ్రెషర్ల నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు గత నెలలో టీసీఎస్ ప్రకటించింది. ఈ పరీక్ష రాసేందుకు దరఖాస్తు గడువు ఈ నెల 10తో ముగిసింది. 26న పరీక్ష నిర్వహించనున్నారు. టీసీఎస్ ఈ పరీక్ష ద్వారా మూడు విభాగాల (నింజా, డిజిటల్, ప్రైమ్) కోసం ఫ్రెషర్ల నియామకాలు చేపడుతోంది.

యాపిల్ కంపెనీపై రిటైలర్ల గుస్సా

క్యాష్ బ్యాక్‌ల్లో వ్యత్యాసం అన్యాయం : ఓఆర్ఏ

హైదరాబాద్: యాపిల్ కంపెనీ కొత్త ఐఫోన్లు 15 ప్రో, 15 ప్రో మ్యాక్స్‌లపై కొన్ని రిటైల్ సంస్థలు రూ.10,000, మరికొన్ని రూ.3,000 క్యాష్ బ్యాక్ ప్రకటించడంపై సౌత్ ఇండియన్ ఆర్గనైజ్డ్ రిటైలర్స్ అసోసియేషన్ (ఓఆర్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ రెండు ఐఫోన్ మోడళ్లపై ఓఆర్ఏ సభ్యులైన లార్జ్ ఫార్మాట్ రిటైల్ (ఎల్ఎఫ్ఆర్) స్టోర్లు రూ.10,000 చొప్పున, వైర్‌లెస్ చెయిన్స్ (డబ్ల్యూసీ), మల్టీ బ్రాండ్ ఔట్‌లెట్స్ (ఎంబీఓ) రూ.3,000 చొప్పున క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ ఆఫర్లు ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. ఈ వ్యత్యాసంతో సంఘటిత రంగంలోని వివిధ రిటైల్ సంస్థలు భారీగా నష్టపోతాయని ఓఆర్ఏ పేర్కొంది. తమ ఖాతాదారులను లార్జ్ ఫార్మాట్ రిటైల్ సంస్థల వైపు మళ్లించేందుకు యాపిల్ కంపెనీ ఈ ఎత్తుగడ వేసినట్టు కనిపిస్తోందని తెలిపింది. వెంటనే ఈ వ్యత్యాసాన్ని సరిచేసి రిటైల్ సంస్థలు అన్నిటికి సమాన అవకాశాలు కల్పించాలని కోరింది. ఈ క్యాష్ బ్యాక్ ఆఫర్ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సరిదిద్దేందుకు యాపిల్ ఇండియా కంపెనీతో చర్చించేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

ద్రవ్యోల్బణం 5 నెలల కనిష్ఠం

మార్చిలో 4.85 శాతం

న్యూఢిల్లీ: ఆహార వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో 5 నెలల కనిష్ఠ స్థాయి 4.85 శాతానికి దిగివచ్చింది. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి రేఖ నాలుగు శాతం దిశగా పయనించవచ్చునే ఆశలు రేపింది. ఫిబ్రవరి నెలలో ఇది 5.09 శాతం ఉండగా గత ఏడాది మార్చిలో 5.66 శాతం ఉంది. గత ఏడాది అక్టోబరులో నమోదైన 4.87 శాతం తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	396
చిత్తూరు	468	విశాఖపట్నం	411
గోదావరి	396	వరంగల్	387
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	136	గోదావరి	137
వరంగల్	136	విజయవాడ	137
కరీంనగర్	136	గుంటూరు	137
మహబూబ్‌నగర్	136	ఒంగోలు	137
కర్నూలు	136	చిత్తూరు	151
విశాఖపట్నం	124		

రూ.50,000 కోట్లు దాటిన మలబార్ గోల్డ్ టర్నోవర్

MALABAR GOLD & DIAMONDS CELEBRATE THE BEAUTY OF LIFE

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.51,218 కోట్ల టర్నోవర్‌ను సాధించి రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా నమ్మకమైన జువెలరీ బ్రాండ్‌గా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గడిచిన మూడు దశాబ్దాల్లో సాధించిన విజయానికి ఇది నిదర్శనమని పేర్కొంది. కాగా కేరళ ప్రధాన కేంద్రంగా ఉన్న మలబార్ గోల్డ్.. భారత్ సహా విదేశాల్లో కార్యకలాపాలను విస్తరించటం ద్వారా గ్లోబల్ లీడర్‌గా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం 13కు పైగా దేశాల్లో 345 షోరూమ్స్‌ను నిర్వహిస్తున్న మలబార్ గోల్డ్.. త్వరలో న్యూజిలాండ్, ఈజిప్ట్, బంగ్లాదేశ్ సహా యూరప్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో కొత్త షోరూమ్స్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. మరోవైపు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లో వచ్చే ఏడాది కాలంలో 100 కొత్త స్టోర్స్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా కొత్తగా 7,000 మంది ఉద్యోగులను చేర్చుకోవటం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్యను 28,000కు చేర్చాలని భావిస్తోంది. అలాగే భారత్‌లోని జార్ఖండ్, గోవా, అస్సోమ్, త్రిపుర, జమ్ము కశ్మీర్‌లకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం మలబార్ గోల్డ్.. 8 దేశాల్లో 14 సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ యూనిట్స్‌తో పాటు ఐదు దేశాల్లో 15 జువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్‌ను నిర్వహిస్తోంది. కాగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద మలబార్ గ్రూప్ ఇప్పటి వరకు రూ.234 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది.

లాభాల స్వీకరణతో పతన బాటలోకి..

సెన్సెక్స్ 793 పాయింట్లు డౌన్

ముంబై: కొద్ది రోజులుగా ఏర్పడిన ర్యాలీని సొమ్ము చేసుకునే లక్ష్యంతో ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకారానికి దిగడంతో శుక్రవారం ఈక్విటీ మార్కెట్ ఒక శాతం మేరకు నష్టపోయింది. తాజా గణాంకాల ప్రకారం అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగిపోవటంతో జూన్ నాటికైనా వడ్డీ రేట్లు తగ్గుతాయన్న ఆశలు సన్నగిల్లటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఫలితంగా కొద్ది రోజుల ర్యాలీకి స్వస్తి చెప్పిన సెన్సెక్స్ 793.25 పాయింట్లు నష్టపోయి 74,244.90 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 234.40 పాయింట్ల నష్టంతో 22,519.40 వద్ద క్లోజైంది. సెన్సెక్స్ షేర్లలో 27, నిఫ్టీ షేర్లలో 45 షేర్లు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.2,52,301.16 కోట్లు క్షీణించి రూ.3,99,67,051.91 కోట్ల వద్ద స్థిరపడింది.

భారతి హెక్సాకామ్ లాభాల పంట: శుక్రవారం భారతి హెక్సాకామ్ షేరు ఇష్యూ ధర రూ.570తో పోల్చితే 32.49 శాతం ప్రీమియంతో రూ.755.20 వద్ద బీఎస్ఈలో లిస్టయింది. తదుపరి క్రమంలో 54.36 శాతం లాభంతో రూ.879.90 స్థాయిని తాకిన ఈ షేరు చివరికి 42.80 శాతం లాభంతో రూ.813.75 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 32.45 శాతం లాభంతో రూ.755 వద్ద లిస్టయి చివరికి 42.80 శాతం లాభంతో రూ.814 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,687.50 కోట్లుగా నమోదైంది.

ఫారెక్స్ నిల్వల్లోనూ కొత్త రికార్డు: దేశంలో విదేశీ మారక నిల్వలు ఏప్రిల్ 5వ తేదీతో ముగిసిన వారంలో 298 కోట్ల డాలర్లు పెరిగి 64,856.2 కోట్ల డాలర్లకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో ఇది కొత్త రికార్డు. రూపాయిని ఆదుకునేందుకు ఆర్‌బీఐ డాలర్లను విక్రయిస్తూ ఉండడంతో గత కొన్ని నెలలుగా క్షీణిస్తూ వచ్చిన ఫారెక్స్ నిల్వలు ఇటీవల వారాల్లో తిరిగి రికార్డు స్థాయిలను నమోదు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇదే వారంలో బంగారం నిల్వలు 239.8 కోట్ల డాలర్లు పెరిగి 5,455.8 కోట్ల డాలర్లకు చేరాయి.

రూ.73,000 దాటిన బంగారం

ఢిల్లీ మార్కెట్లో బంగారం, వెండి ధరలు వరుసగా నాలుగో రోజు కూడా ర్యాలీని కొనసాగించి కొత్త రికార్డులకు దూసుకుపోయాయి. శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,050 మేరకు పుంజుకుని రూ.73,350 వద్ద స్థిరపడింది. వెండి కిలో ధర రూ.1,400 పెరిగి రూ.86,300 వద్ద ముగిసింది. బంగారం, వెండి ధరలు రెండూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే. అంతర్జాతీయ విపణిలో కూడా ఔన్సు బంగారం స్పాట్ మార్కెట్లో 48 డాలర్లు పెరిగి 2,388 డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సు 28.95 డాలర్లు పలికింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,310 ▲	67,200 ▲	90,000 ▲
ముంబై	73,174 ▲	67,027 ▲	83,819 ▲

ఢిల్లీ.. భళా

ఆకట్టుకున్న ఫ్రేసర్

లఖ్‌నవూ పరాజయం ● దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్ ● బదోని పోరాటం వృథా



కుల్దీప్ (3/20)

లఖ్‌నవూ: పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకుంది. బౌలింగ్‌లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/20) కీలక వికెట్లతో లఖ్‌నవూ వెన్ను విరవగా, బ్యాటింగ్‌లో 21 ఏళ్ల ఫ్రేసర్ మెక్‌గర్క్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 55) ఐపీఎల్ తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటుకున్నాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే నాలుగు పాయింట్లతో ఓ స్థానం ఎగబాకగా.. ఆర్‌సీబీ కిందికి దిగజారింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఆయుష్ బదోని (35 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 55 నాటౌట్), రాహుల్ (39) రాణించారు. ఖలీల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 170 పరుగులు చేసి గెలిచింది. పంత్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), పృథ్వీ షా (22 బంతుల్లో 6 ఫోర్లతో 32) రాణించారు. బిష్ణోయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ నిలిచాడు.

ఫ్రేసర్ దూకుడు: వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలి, ఎన్‌గిడి గాయంతో ఢిల్లీ జట్టులో చేరిన యువ బ్యాటర్ ఫ్రేసర్ మెక్‌గర్క్ అదరగొట్టాడు. ఎలాంటి బెదురు లేకుండా ఎడాపెడా షాట్లతో చకచకా స్కోరుబోర్డును కదిలించాడు. ఓపెనర్ వార్నర్ (8) నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ పృథ్వీ షాతో కలిసి మెక్‌గర్క్ లఖ్‌నవూపై ఎదురుదాడికి దిగాడు. సిక్సర్‌తో తన పరుగుల ఖాతా తెరిచిన తను ఐదో ఓవర్‌లో మరో 6,4 బాదాడు. అటు షా కూడా వరుస ఫోర్లు కొట్టగా పవర్‌ప్లేలో జట్టు 62/1తో నిలిచింది. ఆ తర్వాత నాలుగు ఓవర్లలో ఢిల్లీ కేవలం 13 పరుగులే చేసి షా వికెట్ కోల్పోయింది. ఈ దశలో పంత్, ఫ్రేసర్ గేరు మార్చడంతో ధారాళంగా పరుగులు వచ్చాయి. పంత్ 11వ ఓవర్‌లో 6,4.. 12వ ఓవర్‌లో 4,4 బాదడంతో 25 పరుగులు వచ్చాయి. ఇక ఫ్రేసర్ మరింతగా చెలరేగి 13వ ఓవర్‌లో బాదిన హ్యాట్రిక్ సిక్సర్లతో ఏకంగా 21 రన్స్ సమకూరాయి. ఈ క్రమంలో అతడు 31 బంతుల్లోనే తన కెరీర్‌లో తొలి ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు వరుస ఓవర్లలో ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరినా అప్పటికే లక్ష్యం వేగంగా తగ్గిపోయింది. చివర్లో స్టబ్స్ (15 నాటౌట్), హోప్ (11 నాటౌట్) మరో 11 బంతులుండగానే లాంఛనాన్ని ముగించారు.

ఆదుకున్న బదోని: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ బ్యాటర్ల తీరు చూశాక, పూర్తి ఓవర్లు ఆడుతుందని ఎవరూ భావించలేదు. కానీ ఆఖర్లో ఆయుష్ బదోని ఎదురుదాడికి అర్షద్ ఖాన్ (20 నాటౌట్) సహకారం తోడు కావడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరును అందుకోగలిగింది. వాస్తవానికి పవర్‌ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయినా 57 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాతే వరుస విరామాల్లో వికెట్లు చేజార్చుకొని ఇబ్బందుల్లో పడింది. పేసర్లు ఖలీల్, ఇషాంత్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మ్యాజిక్ బంతులకు ఎల్ఎస్‌జీ మిడిలార్డర్ వణికిపోయింది. ఊపు మీదున్న ఓపెనర్ డికాక్ (19), దేవ్‌దత్ (3)లను పేసర్ ఖలీల్ తన వరుస ఓవర్లలో వెనక్కి పంపాడు. అయితే ఆరో ఓవర్‌లో రాహుల్ రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఇక కుల్దీప్ బంతి చేత పట్టాక సీన్ మారిపోయింది. ఎనిమిదో ఓవర్‌లో అతను హిట్టర్లు స్టొయినిస్ (8), పూరన్ (0)లను వరుస బంతుల్లో వెనక్కి పంపడంతో ఎల్ఎస్‌జీ షాక్‌కు గురైంది. ఆ వెంటనే చక్కగా కుదురుకున్న రాహుల్‌ను తన తర్వాతి ఓవర్‌లోనే అవుట్ చేశాడు. ఢిల్లీ రివ్యూకు వెళ్లి ఈ వికెట్ సాధించింది. ఇక పేసర్లు ఇషాంత్, ముకేశ్ విజృంభణకు దీపక్ హుడా (10), క్రునాల్ పాండ్యా (3) సైతం పెవిలియన్ చేరడంతో జట్టు 94/7 స్కోరుతో కష్టాల్లో పడింది. అప్పటి మరో ఏడు ఓవర్లు మిగిలి ఉండడంతో జట్టు అంతలోపే ఆలౌట్ ఖాయమనిపించింది. ఈ దశలో బదోని-అర్షద్ ఖాన్ అద్భుత ఆటతీరుతో ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 73 పరుగులు జోడించడం విశేషం. 15వ ఓవర్‌లో బదోని రెండు ఫోర్లతో 14 రన్స్ రాబట్టి స్కోరులో కదలిక తెచ్చాడు. 18వ ఓవర్‌లో అతడి సిక్సర్, అర్షద్ ఖాన్ ఫోర్‌తో మరో 15 రన్స్ వచ్చాయి. ఇక బదోని మరో రెండు ఫోర్లతో 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆఖరి ఓవర్‌లో లఖ్‌నవూ 11 రన్స్ సాధించడంతో 160 దాటింది.



ఫ్రేసర్ మెక్‌గర్క్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 55)

నేటి మ్యాచ్	వేదిక:
పంజాబ్ X రాజస్థాన్	ముల్లాపూర్ రా.7.30 గం.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
319 పరుగులు	10 వికెట్లు

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (ఎల్బీ) ఖలీల్ 19, రాహుల్ (సి) పంత్ (బి) కుల్దీప్ 39, పడిక్కళ్ (ఎల్బీ) ఖలీల్ 3, స్టొయినిస్ (సి) ఇషాంత్ (బి) కుల్దీప్ 8, పూరన్ (బి) కుల్దీప్ 0, దీపక్ హుడా (సి) వార్నర్ (బి) ఇషాంత్ 10, బదోని (నాటౌట్) 55, క్రునాల్ (సి) పంత్ (బి) ముకేశ్ 3, అర్షద్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 167/7; వికెట్ల పతనం:** 1-28, 2-41, 3-66, 4-66, 5-77, 6-89, 7-94; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-41-2, ఇషాంత్ 4-0-36-1, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 4-0-26-0, కుల్దీప్ యాదవ్ 4-0-20-3.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 32, వార్నర్ (బి) యశ్ 8, జేక్ ఫ్రేసర్ (సి) అర్షద్ (బి) నవీనుల్ 55, పంత్ (స్టంప్) రాహుల్ (బి) బిష్ణోయ్ 41, స్టబ్స్ (నాటౌట్) 15, హోప్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 18.1 ఓవర్లలో 170/4; వికెట్ల పతనం:** 1-24, 2-63, 3-140, 4-146; **బౌలింగ్:** అర్షద్ ఖాన్ 3.1-0-34-0, నవీనుల్ హక్ 3-0-24-1, యశ్ ఠాకూర్ 4-0-31-1, క్రునాల్ 3-0-45-0, రవి బిష్ణోయ్ 4-0-25-2, స్టొయినిస్ 1-0-10-0.

1

ఐపీఎల్‌లో వంద పరుగుల్లోపే ఏడు వికెట్లు కోల్పోయినా, ఓ జట్టు అత్యధిక స్కోరు (167/7) సాధించడం ఇదే తొలిసారి. గతంలో సన్‌రైజర్స్ (154/9) పేరిట ఈ రికార్డు ఉండేది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
చెన్నై	5	3	2	0	6	0.666
లఖ్‌నవూ	5	3	2	0	6	0.436
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	5	2	3	0	4	-0.196
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

స్పోర్ట్స్



ఇప్పట్లో రిటైర్ కాను: రోహిత్

న్యూఢిల్లీ: మరో రెండు, మూడేళ్లు కచ్చితంగా క్రికెట్ ఆడతానని భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. 2025 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌తో పాటు, 2027 వన్డే వరల్డ్‌కప్‌లోనూ ఆడాలనుందని తెలిపాడు. 'ప్రస్తుతం నా ఆటతీరు మెరుగ్గానే ఉంది. అందుకే మరికొన్నాళ్లు కొనసాగాలనుకుంటున్నా. నా దృష్టిలో వన్డే వరల్డ్‌కప్ అసలైన టోర్నీ. మేమంతా 50 ఓవర్ల ఫార్మాట్‌ను చూసే పెరిగాం. అందుకే గతేడాది ఆ మెగా టోర్నీని గెలవాలని భావించాం. ఫైనల్ వరకు అంతా సవ్యంగా సాగినా తుది మెట్టుపై బోల్తా పడ్డాం. ఎందుకిలా జరిగిందని ఆలోచించాం. అయితే ఫైనల్లో మా ఆటతీరు బాలేదని చెప్పలేం. ఆసీస్ మాకన్నా కాస్త మెరుగ్గా ఆడిందంతే' అని రోహిత్ ఓ చాట్‌షోలో చెప్పాడు.

ఒలింపిక్స్‌లో ఆడకుండా అడ్డుకుంటున్నాడు..

రెజ్లింగ్ సమాఖ్య చీఫ్‌పై వినేశ్ ఆరోపణ



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు తన ఒలింపిక్ కలను భగ్నం చేసేందుకు యత్నిస్తున్నాడని స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఆరోపించింది. ఈక్రమంలో ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనకుండా తనను అడ్డుకోవాలని చూస్తున్నాడని తెలిపింది. 50 కిలోల విభాగంలో ఒలింపిక్ బెర్త్ కోసం ఫొగట్ ప్రయత్నిస్తోంది. ఇందు కోసం ఈనెల 18 నుంచి కిర్గిస్థాన్‌లో జరిగే ఆసియా క్వాలిఫయింగ్ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధమైంది. కానీ ఆ టోర్నీకి తన కోచ్, ఫిజియోకు అక్రిడిటేషన్ రాకుండా డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ అడ్డుకున్నాడని వినేశ్ ఆరోపించింది. అంతేకాదు..తనను డోపింగ్‌లో ఇరికించే ప్రమాదమూ లేకపోలేదని ఫొగట్ చెప్పింది.



రన్నరప్ విష్ణు

నగాల్‌కు చాముండి రూ.10 లక్షల సాయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎఫ్ఎన్‌సీసీ ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఆటగాడు విష్ణువర్దన్ రన్నరప్‌గా నిలిచాడు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో విష్ణు 4-6, 4-6తో జావియ దేవ్ (గుజరాత్) చేతిలో ఓడాడు. ముగింపు వేడుకలకు టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, ఏసీబీ డీజీ సీవీ ఆనంద్, ఐపీఎల్ పాలకమండలి సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత నెంబర్ వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్‌కు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఈ కార్యక్రమంలో చాముండి ప్రకటించారు.



చెఫ్ డి మిషన్‌గా వైదొలగిన మేరీ

న్యూఢిల్లీ: దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్ భారత జట్టు చెఫ్ డి మిషన్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని వెల్లడించింది. ఈమేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు మేరీ కోమ్ లేఖ రాసింది. మేరీ కోమ్ స్థానంలో మరొకరిని త్వరలో నియమిస్తామని ఉష తెలిపింది. మేరీని చెఫ్ డి మిషన్‌గా గత నెల 21న ఐఓఏ నియమించిన సంగతి తెలిసిందే.

టెన్నిస్ అమ్మాయిల మూడో గెలుపు

బిల్లీ జీన్ కింగ్ కప్

న్యూఢిల్లీ: బిల్లీ జీన్ కింగ్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత అమ్మాయిలు అదరగొడుతున్నారు. ఆసియా ఓసియానియా గ్రూప్-1 పోరులో భాగంగా భారత జట్టు మూడో విజయాన్ని నమోదు చేసింది. చైనాలోని చాంగ్‌షాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో దక్షిణ కొరియాను ఓడించింది. గ్రూప్-ఎలో ఓవరాల్‌గా మూడు విజయాలు, ఓ ఓటమి అందుకున్న భారత్.. పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. శనివారం జరిగే తమ గ్రూప్ ఆఖరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

గుకేష్ ఓటమి

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ ఏడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ పరాజయం చవిచూశాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఫిరౌజా అలీరెజాతో నల్ల పావులతో తలపడిన గుకేష్ 40 ఎత్తుల్లో ఓటమిని అంగీకరించాడు. దరిమిలా గుకేష్ (4 పాయింట్లు) టాప్ నుంచి రెండో స్థానానికి పడిపోయాడు. కరువాన-ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్-అబసోవ్, నకాముర-నెపోమ్నియాచి గేమ్‌లు డ్రాగా ముగిశాయి. నెపోమ్నియాచి (4.5) టాప్‌లో నిలిచాడు. మహిళల ఏడో రౌండ్‌లో..ముజిచుక్‌తో హంపి పాయింటును పంచుకోగా, లీ టింగ్జీ చేతిలో వైశాలీ ఓడిపోయింది. హంపి, వైశాలీ చెరో రెండున్నర పాయింట్లతో ఆఖరి స్థానంలో ఉన్నారు.

హాకీలో నాలుగో 'సారీ'

పెర్త్: ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల హాకీ టెస్టు సిరీస్‌లో భారత పురుషుల జట్టు వైఫల్యం కొనసాగుతోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ పరాజయమే ఎదురైంది. శుక్రవారం జరిగిన పోరులో భారత్ 1-3 గోల్స్ తేడాతో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. భారత జట్టులో ఏకైక గోల్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 12వ నిమిషంలో చేశాడు. ఆసీస్ తరఫున జెరెమి (18వ, 47వ) రెండు గోల్స్ సాధించగా, జాక్ వెల్చ్ (54వ) ఓ గోల్ కొట్టాడు. ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

చంద్రబాబుతోనే యువత భవిత

» వినుకొండ, విస్సన్నపేట పర్యటనలో భువనేశ్వరి

» నేడు తిరువూరులో 'నిజం గెలవాలి' ముగింపు సభ



వినుకొండ నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

ఎ.కొండూరు/విస్సన్నపేట, బొల్లాపల్లి, ఏప్రిల్ 12 : యువతే ఈ రాష్ట్ర భవిష్యత్ అని, వారి భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామంలో బాణావతు ధనమ్మ, మూటం శ్రీనివాసరావు, ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో గుగులోతు బాబ్జా, పోలిశెట్టిపాడులో బల్లిపోగు నాగరాజు కుటుంబాలను ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై ఆ నలుగురు చనిపోయిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షపూరిత రాజకీయాల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి విముక్తి కలగాలన్నా, యువత భవిష్యత్ బాగుపడాలన్నా కూటమి అభ్యర్థులందరినీ గెలిపించేందుకు యువతతోపాటు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి పల్నాడు ప్రాంతం ప్రజలకు సాగు, తాగునీరు అందించేది చంద్రబాబేనని భువనేశ్వరి అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా లోకేశ్ ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఇచ్చిన హామీని వచ్చే ఎన్నికల్లో గెలిచిన అనంతరం నెరవేరుస్తారని తెలిపారు. బొల్లాపల్లి మండలం రేమడిచర్లలో ఆమె పర్యటించారు. అక్రమ కేసులో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన పార్టీ కార్యకర్త షేక్ హుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించారు. నిజం గెలవాలి ముగింపు సభ శనివారం తిరువూరులో జరగనుంది.

మద్యం అమ్మకాల్లో జే గ్యాంగ్ లక్ష కోట్ల అవినీతి

» తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిపోతున్న డబ్బులు: భానుప్రకాశ్‌రెడ్డి



గుంటూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12: గడచిన ఐదేళ్ల కాలంలో మద్యం అమ్మకాల్లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం గుంటూరులో జరిగిన మీడియా సమావేశంలో జగన్ ప్రభుత్వం మద్యం విధానంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. 'మద్యం అక్రమ అమ్మకాల ద్వారా జే గ్యాంగ్ సంపాదించిన డబ్బును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిస్తున్నారు. జే బ్రాండ్ల ద్వారా దోచుకున్న రూ.లక్షల కోట్ల డబ్బును కంటైనర్ల ద్వారా ఎన్నికల కోసం వైసీపీ నాయకులకు తరలించారు. బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే మద్యం మాఫియా అరాచకాలు నడుస్తున్నాయి. జగన్‌రెడ్డికి ఇదే ఆఖరి బస్సు యాత్ర' అని భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు.

'టీడీపీ ఫర్ ఆంధ్ర' వెబ్‌సైట్‌కు భారీ ఆదరణ

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఫర్ ఆంధ్ర' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పార్టీకి విరాళాలు అందించాలంటూ చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. మూడు రోజుల కిందట ఆయన వెబ్‌సైట్‌ను ప్రారంభించగా, ఇప్పటి వరకు 5 వేల మందికి పైగా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు విరాళాలు అందజేశారు.

సీపీఎంకు అరకు లోక్‌సభ, 8 అసెంబ్లీ స్థానాలు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పొత్తులో భాగంగా సీపీఎంకు అరకు లోక్‌సభతో పాటు 8 అసెంబ్లీ స్థానాలను కేటాయించినట్లుగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా జాబితాను విడుదల చేశారు. రంపచోడవరం, గన్నవరం(కృష్ణ జిల్లా), మంగళగిరి, కురుపాం, నెల్లూరు సిటీ, విజయవాడ సెంట్రల్, గాజువాక, పాణ్యం నియోజకవర్గాలను సీపీఎంకు కేటాయించినట్లుగా తెలిపారు.

25న జగన్ నామినేషన్..!

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 25న పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారు. 24న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో మేమంతా సిద్ధం బస్సు యాత్రను ముగించుకుని పులివెందులకు వెళతారు. 25న నామినేషన్ సమర్పించాక బహిరంగ సభ నిర్వహిస్తారు. కాగా 22న కుటుంబ సభ్యులు జగన్ తరఫున ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు.

వైసీపీ అనుకూల ఆర్వోలపై చర్యలు తీసుకోండి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న రాజ్యలక్ష్మి వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఈసీకి ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో సీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

సిద్ధం సభలో డ్రోన్ ఎగరేశారని..!

ఇద్దరు కానిస్టేబుళ్లపై వైసీపీ నేతల దాడి

» ఎమ్మెల్సీ లేళ్ల ఆదేశాలతో రెచ్చిపోయిన వైనం

గుంటూరు, ఏప్రిల్ 12 : సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలో వైసీపీ విద్యార్థి నేత, ఆయన అనుచరులు రెచ్చిపోయారు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లపై దాడి చేసి కొట్టారు. తాము పోలీస్ కానిస్టేబుళ్లమంటూ ఐడీ కార్డులు చూపినా వినిపించుకోకుండా దాడికి పాల్పడ్డారు. 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర శుక్రవారం గుంటూరు చేరుకుంది. నగరానికి సమీపంలోని జాతీయ రహదారిపై బుడంపాడు-ఏటుకూరు గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన సభకు భారీగా పోలీసు బలగాలను మోహరించారు. భద్రత చర్యల్లో భాగంగా జిల్లా పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ సాంకేతిక విభాగానికి చెందిన ఐటీ కోర్ కానిస్టేబుళ్లు రమేష్, సుబ్బారెడ్డి డ్రోన్ ఎగురవేసి భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితేఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆ డ్రోన్ సంగతి ఏంటో చూడండంటూ తన ప్రధాన అనుచరుడైన వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యను ఆదేశించారు. దీంతో చైతన్య, ఆయన అనుచరులు హుటాహుటిన వెళ్లి డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న కానిస్టేబుల్ రమేష్‌పై దాడి చేశారు. మరో కానిస్టేబుల్ సుబ్బారెడ్డి వారిని వారించే ప్రయత్నం చేయగా ఆయనను నెట్టి వేశారు. వారిరువురూ తమ ఐడీ కార్డులను చూపుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా దాడి చేసి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇది గమనించిన పోలీసు అధికారులు అక్కడికి వచ్చారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకుంటారా అంటూ ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షెల్కే వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేయాల్సిందిగా నల్లపాడు పోలీసులను ఆదేశించారు. గతంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన ఘటనలో కూడా చైతన్య కీలకపాత్ర పోషించారు.

డ్రోన్‌లతో గుట్టు రట్టవుతుందనే వైసీపీ భయం

గడచిన కొద్ది నెలలుగా సీఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సభలకు జనం లేక వెలవెల పోవడం, ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడం, ఒకవేళ బలవంతంగా తరలించినా వారు గేట్లు, గోడలు దూకి పారిపోవడం వంటి దృశ్యాలు పత్రికలు టీవీల్లోనూ, సోషల్ మీడియాలోనూ తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటువంటి దృశ్యాలు బయటకు రాకుండా ఉండేందుకు వైసీపీ నాయకులు మీడియాపై కన్నేశారు. కెమెరామన్, వీడియో గ్రాఫర్లు కనిపిస్తే అనుమానంగా చూడడమే గాక ఫొటోలు, వీడియోలు తీస్తుంటే వారిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలోనే ఇటీవల అనంతపురం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ కార్యకర్తలు విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం విదితమే. అంతకు ముందు ప్రకాశం జిల్లాలో జరిగిన సభలో వైసీపీ వర్గీయులు డ్రోన్ ఎగురవేస్తుండగా దానిని టీడీపీ ఎగురవేస్తున్నట్టుగా భావించి మాజీ మంత్రి అనిల్ కుమార్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై వేదికపై నుంచే తీవ్రస్థాయిలో హెచ్చరికలు, దూషణలకు దిగిన విషయం విదితమే. తాజాగా గుంటూరులో డ్రోన్ ఎగురవేశారని పోలీసు కానిస్టేబుళ్లపైనే దాడిచేయడం గమనార్హం.



వేమూరులోని కల్లూరులో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనం

- ఐదేళ్లలో ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. ఇక రాక్షస ప్రభుత్వాన్ని దించేయాలని నిశ్చయానికి వచ్చారు. ఎప్పుడు మే 13 (పోలింగ్ రోజు) వస్తుందా.. నెత్తిన పెట్టుకున్న కుంపటిని ఎప్పుడు వదిలించుకుందామా అని ఎదురుచూస్తున్నారు.
- పంటల బీమాను రద్దు చేసిన దుర్మార్గుడు జగన్. ధాన్యం కొనకుండా, కనీసం సంచులు కూడా ఇవ్వకుండా రైతులను గాలికొదిలేశాడు. పంట నష్టపోతే కనీసం పరామర్శకైనా వచ్చాడా?
- ఈ జగన్‌కు ఓటెందుకు వేయాలి? బాబాయిని చంపినందుకా? గొడ్డలి వేటేసినందుకా? అందుకే వైనాట్ పులివెందుల.. వైనాట్ కడప అన్నట్లుగా ప్రజలు ముందుకు రావాలి. - చంద్రబాబు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా దంపతులు

దళిత ద్రోహి జగన్

(మొదటి పేజీ తరువాయి)

వేమూరు నియోజకవర్గం కొల్లూరు, రేపల్లె నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. నా ఎస్సీలంటూ వారి నెత్తిన జగన్ భస్మాసుర హస్తం పెట్టాడని, ఆయన ప్రభుత్వంలో ఎక్కువ బలైపోయింది ఎస్సీలేనని చెప్పారు. 'నా ఎస్సీలు అని రూ.25 వేల కోట్ల సబ్ ప్లాన్ లేకుండా చేశాడు. నిధులు దారిమళ్లించాడు. చీరాలలో కిరణ్‌ను కొట్టి చంపారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిని చేసి, కొట్టి చంపారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన పెట్టుకు తిరుగుతున్నాడు. దళితులకు 27 సంక్షేమ పథకాలు ఇస్తే వాటిని రద్దు చేశాడు. ఇన్నోవా కార్లు ఇస్తే రద్దు చేశాడు. అంబేడ్కర్ పేరుతో విదేశీ విద్య కోసం మేం ఒక్కో విద్యార్థికి 15 లక్షలు ఇస్తే, దాని పేరు మార్చి అంబేడ్కర్‌ను అవమానించాడు' అని విమర్శించారు. అమరావతిని నాడు జగన్ మొదట ఆమోదించి, అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట ఆడాడని.. ఇప్పుడు రాజధాని లేకుండా చేసిన దుర్మార్గుడని విరుచుకుపడ్డారు. ఇలాంటి ముఖ్యమంత్రికి ఎలాంటి శిక్ష వేస్తారో ప్రజలే తేల్చుకోవాలి' అని అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నీది పాయిజన్.. నాది విజన్

జగన్మోహన్‌రెడ్డీ.. నువ్వు రాష్ట్రాన్ని నాశనం చేయడానికి వచ్చావ్.. నేను అభివృద్ధి చేయడానికి వచ్చా. నీది పాయిజన్.. నాది విజన్. రాష్ట్రానికి ఆదర్శ డ్రైవర్‌గా ఉంటా! అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తా! పిల్లలే మన ఆస్తి.. వారి చదువుకు ఎంతైనా ఇస్తా. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తా. ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తా! మీ పిల్లలకు విద్య కావాలా.. గంజాయి, డ్రగ్స్ కావాలా? మీరే తేల్చుకోండి! పింఛనుదారులకు ఏప్రిల్ నుంచి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు చొప్పున పింఛను పెంచి ఇస్తా.

ఇప్పుడు జరుగుతోంది క్లాస్ వార్ కాదు.. క్యాష్ వార్. పేదల హక్కుల కోసం జరుగుతున్న యుద్ధమిది. ఈ ప్రభుత్వంలో పేదలు నిరుపేదలయ్యారు. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క పేదకూ న్యాయం జరగలేదు. బాగుపడిందల్లా ఐదుగురు వ్యక్తులే. సీఎం జగన్మోహనరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి మాత్రమే బాగుపడ్డారు. రాష్ట్రంలో సంపదంతా వీరి దగ్గరే ఉంది. ప్రజా వేదికను కూల్చడంతో జగన్ విధ్వంసం మొదలుపెట్టాడు. పట్టిసీమను కూడా వాడుకోకుండా చేశాడు. 72 శాతం పూర్తయిన పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడు.

భూమాఫియా కావాలా?

మీ ఆస్తులకు రక్షణ కావాలా.. వైసీపీ భూమాఫియా కావాలా? నడుములు విరిగే దారుణమైన రోడ్లు కావాలా.. రహదారి భద్రత కావాలా? గుంతల్లో మట్టి వేయలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతాడంట. నమ్ముతారా? ల్యాండ్ టైట్లింగ్ యాక్టు తెచ్చి ఆస్తులన్నీ తన పేరుతో పెట్టుకుంటాడట! 10ఏ, అడంగల్ ఏవీ ఉండవట! ఆస్తి పేరు మారితే 90 రోజుల్లో అభ్యంతరం తెలుపకపోతే ఆస్తి వారిదికాకుండా పోతుందట! ఇలా ప్రజలందరి ఆస్తి జగన్ భూమాఫియా కాజేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తా, ప్రజల ఆస్తికి రక్షణ కల్పిస్తా. పోలీసుల సంక్షేమ బాధ్యత నేనే తీసుకుంటా.

పిల్లలకు బంగారు భవిష్యత్..

వీర వనితలు, జనసైనికుల ఉత్సాహం చూస్తుంటే విజయం లాంఛనమే. మెజారిటీ లెక్కలే తేలాల్సి ఉంది. నా వయసు 73 ఏళ్లయినా ఆలోచనలన్నీ నవ యువకులవే. రాబోయే 25 ఏళ్లలో ప్రపంచంలో పెను మార్పులు జరగనున్నాయి. అందుకు అనుగుణంగా విజన్ రూపొందించే బాధ్యత తీసుకుని పిల్లలకు బంగారు భవిష్యత్ అందేలా చూస్తా. మూడు పార్టీలు కలిసింది రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే. రాష్ట్రంలో 160 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాలు ఎన్డీయేకే రావాలి. అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు అమర్నాథ్ గౌడ్ అనే బాలుడిని దారుణంగా హత్య చేస్తే నేరుగా వారింటికి వెళ్లి పరామర్శించని సిగ్గులేని వ్యక్తి ఈ సీఎం.

సామాజిక న్యాయమెక్కడ..?

చెప్పిన అబద్ధాలు చెప్పకుండా చెప్పడంలో, నాలుక మడతేయడంలో జగన్ దిట్ట. సామాజిక న్యాయానికి పాతరేసి నిస్సిగ్గుగా అసత్యాలు చెబుతున్నాడు. బీసీలకు 30 పథకాలు రద్దు చేశాడు. కాపులకు పది వేల కోట్లు అని చెప్పి రూపాయి కూడా ఇవ్వలేదు. ముస్లింలకు రంజాన్ తోఫా, దుల్హన్ మౌజంలకు గౌరవ వేతనం ఇలా అన్నిటినీ పడకేయించాడు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక బీసీల కోసం ఏటా రూ.30,000 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.1,50,000 కోట్లు ఖర్చు చేస్తాం. ఆదరణ పథకానికి రూ.5,000 కోట్లు కేటాయిస్తాం. టీడీపీ బీసీల పార్టీ. వారే వెన్నెముక.



వలంటీర్ల భవిష్యత్‌తో చెలగాటం...

వలంటీర్లంతా రాజీనామాలు చేసి వైసీపీకి పనిచేస్తే మళ్లీ వచ్చాక నియమిస్తానంటూ వారి భవిష్యత్‌తో జగన్ చెలగాటమాడుతున్నాడు. వారెవరూ రాజీనామాలు చేయాల్సిన అవసరం లేదు. జీతం పెంచే బాధ్యత తీసుకోవడంతో పాటు స్కిల్‌లో శిక్షణ ఇచ్చి ఆదాయం పెంచుతాను. వైసీపీ ఉచ్చులో పడొద్దు. రోడ్డుమీద గ్రావెల్ కూడా దొంగిలించే వారిపై బాపట్ల ఎంపీ అభ్యర్థిగా పోలీసాఫీసర్ టి.కృష్ణప్రసాద్‌ను పోటీకి దించా. నేను సంస్కారం, చదువు ఉన్న వాళ్లను ప్రోత్సహిస్తే.. జేబులు కొట్టేవాళ్లను, భూకబ్జాలు చేసే వాళ్లను ప్రోత్సహించడం జగన్ నైజం.

బ్రహ్మారెడ్డిని ఊర్లోకి తెచ్చేంత మగాడివారా?!

» టీడీపీ ముస్లిం మైనార్టీ నేతపై వలంటీర్లు, వైసీపీ నేతల దాడి

» రెంటచింతలలో బరితెగించిన వైసీపీ కోటరీ

రెంటచింతల, ఏప్రిల్ 12: 'బ్రహ్మారెడ్డిని ఊర్లోకి తెచ్చేంత మగాడివారా? వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేసి బతికి బట్టకట్టాలని ఉందా? కొడకా!.. టీడీపీకి ప్రచారం చేస్తే అదే నీకు చివరిరోజు అవుతుంది' అని దుర్భాషలాడుతూ టీడీపీ ముస్లిం మైనార్టీ నేతపై వలంటీర్లు, వైసీపీ రౌడీ మూకలు కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం తుమ్మకోటలో శుక్రవారం రాత్రి జరిగింది. తుమ్మకోటకు చెందిన టీడీపీ నేత పఠాన్ జలీల్ ఖాన్‌పై వైసీపీకి చెందిన పలువురు నేతలు అకారణంగా దాడి చేసి గాయపరిచారు. కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి ఈనెల 10న తుమ్మకోటలో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. గ్రామంలో ముస్లిం మైనార్టీ నేతలను కూడగట్టడంలో జలీల్‌ఖాన్ కీలకపాత్ర పోషించారు. మహిళల హారతులు, బాణ సంచా నడుమ బ్రహ్మారెడ్డిని ఊరేగిస్తూ ఘన స్వాగతం పలికారు. దీంతో జలీల్‌ఖాన్‌పై కక్ష పెంచుకున్న వైసీపీ వర్గీయులు మూడు రోజులుగా కాపు కాస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మసీదు సెంటర్లో ఒంటరిగా కనిపించిన జలీల్‌ఖాన్‌పై వైసీపీకి చెందిన షేక్ రషీద్, షేక్ గోరెపూడి కుతుబుద్దీన్‌తో పాటు.. వలంటీర్లు షేక్ గోరెపూడి హుస్సేన్‌బాషా, షేక్ గోరెపూడి మెహబూబ్ సుభానీ రాడ్లతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. అచేతన స్థితిలో ఉన్న జలీల్‌ఖాన్ రెండు చేతులెత్తి దండం పెట్టి బతిమలాడినా వినలేదు. ఈ దాడిలో జలీల్‌ఖాన్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. జలీల్‌ఖాన్‌ను హస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు యత్నించిన ఎస్కే చాంద్‌వలీ అనే వ్యక్తిపై కూడా రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం స్థానికులంతా కలిసి క్షతగాత్రులిదరినీ ప్రత్యేక వాహనంలో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈసీ స్పందించాలి

కాగా, రెంటచింతలలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణమైపోయాయి. మంచికల్లులో ఈ నెల 10వ తేదీన ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన ప్రచార వాహనాన్ని ధ్వంసం చేయడం, ప్రచారరథం రెంటచింతలలో తిరగడానికి వీల్లేదని హుకుం జారీ చేయడం తెలిసిందే! మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజల్లో ఆందోళన నెలకొంది. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ప్రశాంత ఎన్నికలకు నియోజకవర్గ ఓటర్లు దూరమవుతారని, దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరుతున్నారు.

రెండ్రోజుల్లో సరిచేద్దాం!

» సీట్ల మార్పుపై ఎన్డీయే పక్షాల నిర్ణయం

» చంద్రబాబు నివాసంలో భేటీ



శుక్రవారం తన నివాసానికి వచ్చిన బీజేపీ, జనసేన నేతలతో చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పరస్పర మార్పును రెండ్రోజుల్లో కొలిక్కి తేవాలని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు నిర్ణయించాయి. ఎన్నికల ప్రచార శైలి, భవిష్యత్ కార్యాచరణ, అధికార పక్షం కుట్రలు ఎదుర్కోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానించాయి. 25 లోక్‌సభ, 160 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యం కావాలని పేర్కొన్నాయి. శుక్రవారమిక్కడ ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అరుణ్ సింగ్, సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ రెండు గంటల పాటు చర్చించారు. పలు చోట్ల సీట్లు మార్చాలని బీజేపీ నేతలు ప్రస్తావించగా.. అలా మారుస్తూ పోతే గందరగోళానికి దారి తీస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే అనపర్తి స్థానాన్ని తాము తీసుకుని బీజేపీకి తంబళ్లపల్లె ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఉంగుటూరు ఇవ్వాలని ఆ పార్టీ కోరగా.. ఆ సీటు జనసేనకు కేటాయించామని.. అభ్యర్థి ఇప్పటికే ప్రచారంలో ఉన్నారని బాబు బదులిచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరికి ఎక్కడో చోట అవకాశం కల్పించాలని పురందేశ్వరి కోరగా.. అందుకు పవన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పటికే పవన్ ఒక ఎంపీ, మూడు అసెంబ్లీ స్థానాలు త్యాగం చేశారని.. ఇక జనసేన సీట్ల విషయంలో మార్పులు వద్దని చంద్రబాబు అన్నారు. ఉండి సీటు మార్చేందుకు టీడీపీ సిద్ధమైనందున ఆ సీటు తమకివ్వాలని బీజేపీ నేతలు అడిగారు. అక్కడి టీడీపీ సిటింగ్ ఎమ్మెల్యే రామరాజును మార్చే ఉద్దేశం తనకు లేనప్పటికీ.. నరసాపురం లోక్‌సభ స్థానాన్ని రఘురామకృష్ణంరాజుకు మీరు ఇవ్వనందున అలా సర్దుబాటు చేయాలన్న ఆలోచన వచ్చిందని చంద్రబాబు వివరించారు. నరసాపురం పార్లమెంటు సీటు రఘురామరాజుకు కేటాయిస్తే.. ఇప్పటికే మీరక్కడ ప్రకటించిన అభ్యర్థి శ్రీనివాస వర్మ కోసం ఉండి స్థానం కేటాయించడం సమ్మతమే నన్నారు. లోక్‌సభకు ప్రకటించిన అభ్యర్థిని మార్చాలంటే పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నేతలు బదులిచ్చారు. అనపర్తి వెనక్కి తీసుకుని ఉండి స్థానం ఇచ్చేందుకు సిద్ధమని చంద్రబాబు స్పష్టం చేశారు. అలా కాకపోతే ఉండిలో రఘురామరాజును నిలిపి అనపర్తి స్థానానికి ప్రత్యామ్నాయంగా బీజేపీకి తంబళ్లపల్లె కేటాయిస్తామని చెప్పారు. ఢిల్లీ పెద్దలతో మాట్లాడి రెండ్రోజుల్లో సీట్ల సర్దుబాటు అంశాన్ని కొలిక్కి తెచ్చేద్దామని బీజేపీ నేతలు తెలిపారు. అసంతృప్తులు ఉన్నచోట తొందరగా సర్దుబాటు చేయాలని కూటమి నేతలు నిర్ణయానికి వచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల్లో చంద్రబాబు, పవన్ ఉమ్మడి సభలకు ప్రజా స్పందన బాగుందని ఇలాగే వీలైనన్ని సభలు కొనసాగించాలని, బీజేపీ నేతలు వీలైనంత ఎక్కువ మంది పాల్గొంటే మంచిదని బాబు సూచించారు. పురందేశ్వరి స్పందిస్తూ.. 'కూటమి తరఫున ఢిల్లీ పెద్దలతో మాట్లాడితే ప్రధాని మోదీతో పాటు ఇతర ముఖ్య నేతలైన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా తదితరులు పాల్గొంటారు' అని తెలిపారు. ఈ నెల 16న విజయనగరం సభకు బీజేపీ అగ్రనేతల్లో ఒకరిని రప్పించాలని నిర్ణయించారు. అధికార వైసీపీకి వత్తాసు పలుకుతూ, అక్రమాలకు సహకరించిన కలెక్టర్లు, ఎస్పీలపై ఎన్నికల కమిషన్ చర్య తీసుకోవడం కూటమి కేడర్లో మనోధైర్యాన్ని పెంచిందనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఇంత జరిగినా ఇంకా కొందరు అధికారులు ఏకపక్ష వైఖరి అవలంబిస్తున్నారని నేతలు పేర్కొన్నారు.

16, 17 తేదీల్లో విజయనగరం, కృష్ణా జిల్లాల్లో

చంద్రబాబు, పవన్ ఉమ్మడి సభలు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి సభలు మళ్లీ రెండు రోజులు జరగనున్నాయి. 16న విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో, 17న పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో ఇవి జరుగుతాయని టీడీపీ వర్గాలు వివరించాయి. దీని కొనసాగింపుగా మరి కొన్నిచోట్ల కూడా ఇవి జరిగే అవకాశం ఉందని చెప్పాయి. ప్రజా గళం పేరుతో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలు శుక్రవారం నాటికి 31 పూర్తయ్యాయి. 13వ తేదీ శనివారం ఆయన గుంటూరు జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల సభల్లో పాల్గొననున్నారు. 14వ తేదీ, ఆదివారం అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, చోడవరం, గాజువాక నియోజకవర్గాల్లో, 15వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, పలాస, టెక్కలిలో ఆయన పర్యటిస్తారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

» ఈ విషయంలో ఎవ్వరికీ మినహాయింపు లేదు: ఎంకే మీనా



శ్రీవారి ఆలయం వెలుపల మీనా దంపతులు

తిరుపతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హింసకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. శుక్రవారం ఉదయం తిరుపతిలోని శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎంతటి ప్రధాన పార్టీ అయినా కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమకందిన ఫిర్యాదుల మేరకు ముఖ్యమంత్రికి, మాజీ ముఖ్యమంత్రికి సైతం నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి 120మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, 51మందిని సస్పెండ్ చేశామని వివరించారు. ఇదే ఆరోపణలతో 900మంది వలంటీర్లను తొలగించామని చెప్పారు. ఏడాది నుంచీ దొంగ ఓట్లు నమోదు కాకుండా నిరంతరం దృష్టి పెట్టామని మీనా తెలిపారు. పోలింగ్ రోజున ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓట్లు వేయడానికి వచ్చేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనవరిలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించే నాటికి 18-19 ఏళ్ల వయసున్న కొత్త ఓటర్ల నమోదు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 2.5 లక్షలు మాత్రమే ఉందని సీఈవో చెప్పారు. అయితే ఈసీ చొరవ తీసుకుని కలెక్టర్లు, అధికారుల ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో కొత్త ఓటర్ల సంఖ్య ఇప్పుడు ఏకంగా పది లక్షలకు చేరుకుందని వివరించారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంలో 35వేల ఎపిక్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో విచారణ కొనసాగుతోందని మీనా వెల్లడించారు. ఈ కేసులో ఉపేక్షించే సమస్య లేదని చెప్పారు. బాధ్యులైన వారిపై శాఖాపరమైన విచారణతో పాటు పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసినందున ఆ దిశగా కూడా దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఈసీ విచారణను నేరుగా పర్యవేక్షిస్తోందని మీనా పేర్కొన్నారు.



కోయంబత్తూరులోని తెలుగు పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్

ఆంధ్రకు వచ్చేయండి.. రెండు నెలల్లో మేం సిద్ధం!

» ఎలాన్ మస్క్‌కు లోకేశ్ ఆహ్వానం.. ఇక్కడి యువతలో నైపుణ్యం..

» 2 నెలల్లో టెస్లాకు స్వాగతం: యువనేత

» కోయంబత్తూరులో తెలుగు పారిశ్రామికవేత్తలతో భేటీ

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'రెండు నెలల్లో మేం సిద్ధంగా ఉంటాం. ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చేయండి' అని అమెరికాకు చెందిన ప్రఖ్యాత టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌కు టీడీపీ యువ నేత లోకేశ్ ఆహ్వానం పలికారు. మస్క్ భారత పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఒక ట్వీట్ చేశారు. 'మీరు భారత పర్యటనకు రాబోతుండడం ఆనందంగా ఉంది. 2017లో నా తండ్రి, నాటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మీతో సమావేశమై చర్చించారు. మీరు ఆ సమయంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి చాలా ఆసక్తి చూపించారు. ఏపీ మీకు సరైన గమ్యస్థానం. ఇక్కడ నైపుణ్యమున్న యువత, అపరిమిత సహజవనరులు ఉన్నాయి. మీ విద్యుత్ ఆకాంక్షలు నెరవేరడానికి మా రాష్ట్రం సహాయపడుతుంది. టెస్లాకు స్వాగతం పలకడానికి 2నెలల్లో మేం తయారుగా ఉంటాం' అని పేర్కొన్నారు.

తెలుగు పారిశ్రామికవేత్తలతో లోకేశ్ సమావేశం

కోయంబత్తూరులో పెద్ద సంఖ్యలో ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలతో లోకేశ్ శుక్రవారం ఉదయం అక్కడ సమావేశమయ్యారు. అక్కడ బీజేపీ అభ్యర్థిగా ఉన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు మద్దతుగా సింగనల్లూరు ఇందిరా గార్డెన్స్‌లో జరిగిన భేటీలో ఆయన పాల్గొన్నారు. అన్నామలైను లోకేశ్ మంగళగిరి శాలువాతో సత్కరించగా.. ఆయన లోకేశ్‌ను కోయంబత్తూరు శాలువాతో సన్మానించారు. మంచి నాయకత్వం ఉంటే చెన్నై నగరం హైదరాబాద్‌ను మించిపోయేదని, కానీ అటువంటి నాయకత్వం కొరవడటం వల్ల అంత దూసుకెళ్లలేకపోయిందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. 'అన్నామలై ఐపీఎస్ వదులుకుని వచ్చారు. అభివృద్ధిని సాధించగల పట్టుదల ఉంది. ఆయనకు అవకాశం ఇస్తే కోయంబత్తూరులో మౌలిక వసతులు అభివృద్ధి చేసి మరో ముందడుగు వేయిస్తారు. ఆయనకు ఆ అవకాశం ఇవ్వండి' అని విజ్ఞప్తి చేశారు. లోకేశ్ తన పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో సమస్యలను బాగా అధ్యయనం చేశారని, ఆయన యాత్ర తనకు స్ఫూర్తి అని అన్నామలై చెప్పారు. కాగా.. బీజేపీ ఎంపీ, బెంగుళూరు దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి తేజస్వి సూర్య శుక్రవారం ఉదయం కోయంబత్తూరులో లోకేశ్‌ను కలిశారు. తన తరఫున ప్రచారానికి బెంగుళూరు రావాలని ఆహ్వానించారు. 'బెంగుళూరులో తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు. ఐటీ ఉద్యోగులు, తెలుగు యువతరంలో మీకు చాలా పేరు ఉంది. తెలుగువారితో సమావేశం అయినప్పుడు వారి వద్ద మీ పేరు చాలాసార్లు విన్నాను. మీరు నా తరఫున ప్రచారానికి రావాలని నా కోరిక. ఏదో ఒక సమయంలో వీలు చేసుకోండి' అని కోరారు. అందుకు లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. అయితే ఆంధ్రలో లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. 'మాకీ ఎన్నికలు చాలా కీలకం. ఏమీ అనుకోవద్దు. అంత సమయం ఇవ్వగలిగే పరిస్థితిలో లేను' అని చెప్పారు.

ప్రజాప్రభుత్వంలో పోలీసులను ఆదుకుంటాం: లోకేశ్

అమరావతి, బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీస్ సోదరులను ఆదుకుంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాట ఇచ్చారు. విశాఖపట్నంలో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ శంకరరావు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ శంకరరావు స్మృతికి నివాళులర్పిస్తూ, అతని కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎండనక, వాననక.. రేయింబవళ్లు శ్రమిస్తూ, పోలీస్ సోదరులు శాంతిభద్రతలు కాపాడుతున్నారు. వారికి రావాల్సిన టీఏ, డీఏ తదితరాలు సంవత్సరాల తరబడి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సరెండర్ లీవ్, అడిషనల్ సరెండర్ లీవ్ బకాయిలు కూడా నెలల తరబడి ఇవ్వకుండా వేధించడం విచారకరం' అని లోకేశ్ అన్నారు.

డీజీపీ ఏం చేస్తున్నారు?

(మొదటి పేజీ తరువాయి)


ఇంతకాలం ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. కేసుల వివరాలు అందజేసేందుకు ఎంత సమయం కావాలని నిలదీసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం కేసుల వివరాలు అందజేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని గుర్తు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించి ఉంటే ఇప్పటికే కేసులు సమాచారం తెప్పించి ఉండేవారని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. నామినేషన్ల సమయంలో పిటిషనర్లు తమపై నమోదైన కేసులు వివరాలను ప్రస్తావించకుంటే వారిపై అనర్హతవేటు పడొచ్చని పేర్కొంది. సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించింది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే రెండు, మూడు గంటల్లోనే సమాచారాన్ని అందజేయవచ్చని పేర్కొంది. నేటి నుంచి మొదలుపెట్టి ఈ నెల 16లోగా పిటిషనర్లకు వారిపై నమోదైన కేసుల వివరాలు అందజేయాలని డీజీపీ, పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాలు అందజేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీమంత్రులు అయ్యన్నపాత్రుడు, నారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బీ రామచంద్ర యాదవ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్, వీవీ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు వీవీ సతీష్, పీవీజీ ఉమేశ్‌చంద్ర, తదితరులు వాదనలు వినిపించారు.పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్లపై నమోదైన కేసుల వివరాలను జిల్లా ఎస్పీలు నుంచి తెప్పించాల్సి ఉంది. ఎస్పీలను సంప్రదించకుండా నేరుగా డీజీపీకి వినతిపత్రం ఇస్తున్నారు. దీంతో సమాచారం తెప్పించడం ఇబ్బందికరంగా మారింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తాం' అని అన్నారు.

సుమోటో కుల ధ్రువీకరణపై వెనకడుగు

▸ ఎన్నికల తర్వాతే అమలు: కలెక్టర్లు, జేసీలకు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కుల డ్రామా నడిపి లబ్ధి పొందాలనుకున్న జగన్ సర్కారు వెనక్కి తగ్గింది. సుమోటో కుల ధ్రువీకరణ కింద రెవెన్యూ సిబ్బందిని ఇంటింటికి పంపిస్తే తీవ్ర సమస్యలు వస్తాయని, కోడ్ ఉల్లంఘనగా భావించి ఈసీ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికార వర్గాలు సూచించడంతో సర్కారు వెనక్కి తగ్గినట్లు తెలిసింది. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల తర్వాతే అమలు చేద్దామని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. "ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కాబట్టి సుమోటో కుల ధ్రువీకరణ చేపట్టడం లేదు. ఎన్నికల ప్రక్రియ ముగిశాక తిరిగి ఆ కార్యక్రమాన్ని అమలు చేద్దాం" అని కలెక్టర్, జేసీ, రెవెన్యూ అధికారుల వాట్సాప్ గ్రూపుల్లో మేసేజ్‌లు పంపింది. సర్కారు చర్యతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కోడ్ అమల్లో ఉండగా, మరి కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సమయంలో సుమోటో కుల ధ్రువీకరణ చేపడితే ఈసీ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని జేసీలు ఆందోళన వ్యక్తం చేశారు.

సీఎస్.. ఇదేం పని?



(మొదటి పేజీ తరువాయి)

ఇంటి పట్టాలు ఇచ్చేస్తే ఆ తర్వాత మరచిపోతారనుకున్నారో ఏమో వాటిని పక్కన పెట్టేశారు. సరిగ్గా ఇప్పుడు... ఎన్నికల సమయంలో 'పథకాన్ని' బయటికి తీశారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, పురపాలక శాఖ... ఇలా కీలక విభాగాల అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేసి, వారిని లబ్ధిదారుల వద్దకు పంపించి 'జగనన్న పట్టా'ల పేరుతో హడావుడి చేయాలని వంకర వ్యూహం రచించారు.

ఎన్నికల స్టంట్...

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పట్టాల పంపిణీ చేపట్టడం కుదరదు. కానీ... ఇది కొత్త పథకం కాదని, పాత దానికే కొనసాగింపు అని వాదిస్తూ ఈసీ అనుమతితో పట్టాలు ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిసింది. కానీ, ఈ వాదన ఎంతమాత్రం చెల్లదు. ఇది ప్రతి నెలా పెన్షన్ ఇవ్వడం లాంటిది కాదు. దీనిపై ఎలాంటి అభ్యంతరం ఉండదు. కానీ... పట్టాల పంపిణీ అలా కాదు. భూసేకరణ, లబ్ధిదారుల జాబితా ఎప్పుడో పూర్తయినా... పట్టాలను మాత్రం ఆపేసి, వాటిని ఎన్నికల ముందు ఇస్తామనడమే అసలు సమస్య. ఇది ఓటర్లను ప్రభావితం చేయడమే. ఈ విషయం అధికారులందరికీ తెలుసు. ఇందుకు ఈసీ అంగీకరించదనీ తెలుసు. అందుకే... 'స్క్రీనింగ్ కమిటీ'ని తెరపైకి తెచ్చారు. సీఎస్ నేతృత్వంలో ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు, సంయుక్త కార్యదర్శి సభ్యుడిగా ఈ కమిటీ ఏర్పడింది. 'ఇది పాత పథకమే. ఇప్పుడు పట్టాలు ఇవ్వొచ్చు' అని స్క్రీనింగ్ కమిటీతో ఆమోదం పొంది, తర్వాత ఈసీ క్లియరెన్స్ పొందాలన్నది వీరి వ్యూహం.

రంగంలోకి సీఎంవో

పట్టాల పంపిణీ కోసం నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగినట్లు తెలిసింది. రెవెన్యూశాఖ నుంచి ఇంటి పట్టాల పంపిణీ ఫైలు తెప్పించుకోవాలని సీఎస్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ ఫైలును స్క్రీనింగ్ కమిటీ ఆమోదం కోసం పంపాలని రెవెన్యూ శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌పై కూడా ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. చివరగా ఈ ఫైలు పంపించాలని సీఎస్ నేరుగా రెవెన్యూ శాఖను ఆదేశించినట్లు సమాచారం. ఆ తర్వాతే రెవెన్యూ శాఖ సదరు ఫైలును స్క్రీనింగ్ కమిటీకి పంపించింది. శుక్రవారం ఉదయం సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డి నేతృత్వాన కమిటీ భేటీ జరిగింది. ఇందులో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజైయ్‌జైన్‌తోపాటు, మరో కీలక అధికారి కూడా పాల్గొన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధం, కోడ్ సమయంలో కుదరదని తెలిసినా... దీనిని ముందు నుంచే అమలవుతున్న పథకంగా చెబుతూ అనుమతి కోసం ఈసీకి లేఖ రాయడంపై చర్చించారు. దీనిపై సుదీర్ఘ నోట్ తెప్పించుకొని చర్చించినట్లు తెలిసింది.

దీన్నేమంటారు సీఎస్?

ఎన్నికల కోడ్ వచ్చాక రహదారులపై ఉన్న విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పత్రాల్లో నేతల ఫొటోలను తొలగించారు. పేర్లు, ఫొటోలు చూపించి ఓటర్లను ప్రభావితం చేయకూడదనే ఇలాంటి చర్యలు తీసుకుంటారు. అలాంటిది... ఏకంగా జగన్ ఫొటోలున్న పట్టాల పంపిణీకి కోడ్ వర్తించదా? అసలు... రెండేళ్లుగా పెండింగ్‌లో పెట్టిన పట్టాలను సరిగ్గా ఎన్నికల ముందు ఇవ్వడం కుదురుతుందా? ఈ ప్రశ్నలకు సమాధానం సీఎస్‌కు తెలియనిది కాదు. అయినా సరే... ఆయన 'పట్టాలు' తప్పారంటే, అది జగన్ కోసమే అని చెప్పక తప్పదు. ఇప్పటికే సీఎస్ జవహర్ రెడ్డి తీరుపై విపక్షాలు అనేక ఆరోపణలు చేస్తున్నాయి. ఆయనను పక్కకు తప్పిస్తేనే ఎన్నికలు నిష్పాక్షికంగా జరుగుతాయని చెబుతున్నాయి. 'మీరు చెప్పింది నిజమే. నేను జగన్ పక్షపాతినే' అని స్వయంగా జవహర్ రెడ్డి చాటి చెప్పుకోవడమే కొసమెరుపు!

తిరుపతి ఆర్డీవోపై మరోసారి విచారణ

▸ జేసీని ఆదేశించిన సీసీఎల్ఏ సాయిప్రసాద్

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, మరో ముగ్గురు రెవెన్యూ అధికారులపై వచ్చిన తీవ్ర అవినీతి ఆరోపణలపై తాజాగా విచారణ జరిపించాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. ప్రస్తుత తిరుపతి జేసీ హెచ్.ఎం. ధ్యానచంద్రతో విచారణకు ఆదేశించింది. ఈ మేరకు తిరుపతి కలెక్టర్, జేసీకి భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అలాగే నిశాంత్‌రెడ్డిని కాపాడేందుకు సీసీఎల్ఏ కార్యాలయంతో పాటు సచివాలయంలో రెవెన్యూశాఖ నుంచి ఇద్దరు అధికారులు ప్రయత్నాలు చేస్తున్న అంశంపైనా విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు సమాచారం. 'ఆర్డీవో కోసం అడ్డదారులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు కలసి పనిచేసిన ఓ సాంకేతిక నిపుణుడు తిరుపతి జిల్లా పుత్తూరు ఏరియాలో హెచ్‌పీసీఎల్ బంక్ ఏర్పాటుకు అనుమతులు పొందారు. అయితే, భూమిపై ఎన్‌వోసీ ఇవ్వడానికి తిరుపతి ఆర్డీవో పేరిట ఆయన కార్యాలయంలో పనిచేసే అధికారి, పుత్తూరు తహసీల్దార్, కలెక్టరేట్‌లోని ఓ సూపరింటెండెంట్ భారీగా లంచం డిమాండ్ చేశారు. బాధితుడు కొంత సొమ్ము చెల్లించిన తర్వాత అక్రమార్కులు మరింత రెచ్చిపోయారు. విషయం తెలిసిన ప్రభుత్వం అప్పటి తిరుపతి జేసీగా ఉన్న శుభం బన్సల్‌తో విచారణకు ఆదేశించింది. ఈ విచారణ ముగిశాక బాధితుడి నుంచి వసూలు చేసిన సొమ్ము తిరిగి వెనక్కి ఇచ్చారు. ఈ విషయం తెలిసినా జేసీ బన్సల్ ఏ అధికారిపై చర్యలు తీసుకోలేదు. విచారణ తేలిపోయేలా నివేదిక ఇచ్చారు. సొమ్ము తీసుకున్నవారు బాధితుడికి క్షమాపణ చెప్పారని కథ ముగించేశారు. దీంతో జేసీగా బన్సల్ చేయాల్సిన పనేనా ఇది అని ఐఏఎస్ వర్గాలే విస్తుపోతున్నాయి. ఈ పరిణామాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో ఆర్డీవో నిశాంత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిపై తాజాగా విచారణ చేపట్టాలని ప్రస్తుత జేసీ ధ్యానచంద్రను సీసీఎల్ఏ ఆదేశించారు.

లోకేశ్ ఫోన్ ట్యాపింగ్!

▸ ఐ-ఫోన్ వ్యవస్థ హెచ్చరిక

▸ నెల రోజుల్లో ఆపిల్ నుంచి రెండో వార్నింగ్

▸ జగన్ ప్రభుత్వంపై టీడీపీ ఆగ్రహం

▸ ట్యాపింగ్ కోసం పెగాసెస్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు?

▸ ఇంకొందరు టీడీపీ నేతల ఫోన్లపైనా నిఘా

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మొబైల్ ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతోంది. ఐ-ఫోన్ సాంకేతిక వ్యవస్థ ఈ మేరకు ఆయనకు వర్తమానం పంపింది. ఆయన చాలాకాలంగా ఐ-ఫోన్ వాడుతున్నారు. మిగిలిన ఫోన్లతో పోలిస్తే ఆపిల్ కంపెనీ తయారు చేస్తున్న ఐ-ఫోన్లు భద్రతాపరంగా మెరుగ్గా ఉంటాయన్న అభిప్రాయంతో ఇటీవలి కాలంలో ప్రతిపక్ష నేతలు వాటినే వాడుతున్నారు. ఫోన్ల భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు సంబంధిత ఫోన్ వినియోగదారుకు ఆ సమాచారాన్ని పంపే సాంకేతిక వ్యవస్థను ఆపిల్ కంపెనీ వాడుతోంది. దాని నుంచే లోకేశ్‌కు గురువారం రాత్రి అత్యవసర హెచ్చరిక పంపింది. అదే హెచ్చరికను ఈ-మెయిల్ ద్వారా కూడా పంపింది. 'గుర్తు తెలియని సాఫ్ట్‌వేర్లతో మీ ఫోన్‌ను హాకింగ్, ట్యాపింగ్ చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. అప్రమత్తంగా ఉండండి. ట్యాపింగ్, హాకింగ్‌కు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి' అని అందులో పేర్కొంది. ఈ సందేశం వచ్చిన వెంటనే లోకేశ్ సంబంధిత సాంకేతిక నిపుణులను సంప్రదించి వారి సూచనలను పాటిస్తున్నారు. గతనెలలో కూడా ఆయనకు ఇదే మాదిరి హెచ్చరిక సందేశం వచ్చింది. ఒక నెలలోనే రెండోసారి మళ్లీ అదే ప్రయత్నం జరగడం విశేషం. జగన్ ప్రభుత్వమే ఆయన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. 'ఐ-ఫోన్లను సాధారణ సాఫ్ట్‌వేర్లతో ట్యాపింగ్ చేయడం సాధ్యం కాదు. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసెస్ వంటి అత్యున్నతస్థాయి సాఫ్ట్‌వేర్లతో మాత్రమే వాటి ట్యాపింగ్ సాధ్యపడుతుంది. పెగాసెస్ సాఫ్ట్‌వేర్‌ను వైసీపీ ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసి వాడుతోందని మేం అనుమానిస్తున్నాం' అని టీడీపీ ముఖ్యుడొకరు తెలిపారు. ఒక్క లోకేశ్ ఫోనే కాకుండా మరికొందరు టీడీపీ నేతల ఫోన్లను కూడా దొంగచాటుగా వినే ప్రయత్నం జరుగుతోందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ సందేహం చాలా కాలం నుంచి ఉండడంతో కొంతకాలంగా టీడీపీ తన కార్యకలాపాలన్నీ హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తోంది. అక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో జగన్ సర్కారు అక్కడ కూడా ట్యాపింగ్ చేయగలిగిందని.. ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వం మారాక ఆ అవకాశం పోయిందని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే ఎన్నికల వార్ రూంను కూడా అక్కడే ఏర్పాటు చేసింది. తెలంగాణ కంటే మించి ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని అనుమానిస్తున్న ఆ పార్టీ నేతలు.. ఇప్పుడు ఇందులో పాలుపంచుకుంటున్న పోలీసు అధికారులు, వారు అవలంబిస్తున్న విధానాలపై సమాచారం సేకరించే పనిలో పడ్డారు.

ఇది వారిద్దరి పనే: కనకమేడల

లోకేశ్‌కు ఫోన్ ట్యాపింగ్ హెచ్చరిక సందేశం రాగానే టీడీపీ నాయకత్వం వెంటనే అప్రమత్తమైంది. గుర్తు తెలియని ఏజెన్సీల ద్వారా పెగాసెస్ సాఫ్ట్‌వేర్ సాయంతో లోకేశ్ ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు ఐ-ఫోన్ సందేశాలు వచ్చాయని ఆ పార్టీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. 'రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, నిఘా చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఈసీ దృష్టికి అనేక మార్లు తెచ్చాం. వారిద్దరూ ఎన్నికల్లో ఎన్డీయే అవకాశాలను దెబ్బతీసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వీరిద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారి స్థానాల్లో తటస్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించాలి' అని కోరారు. లోకేశ్ ఐ-ఫోన్‌కు వచ్చిన అలర్ట్ మెయిల్స్ స్క్రీన్ షాట్లను ఈ లేఖకు జత చేశారు.

వైసీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోండి

లోకేశ్ ఫోన్ ట్యాపింగ్‌పై సీఈవో ముఖేశ్ కుమార్ మీనా కార్యాలయంలోనూ టీడీపీ సీనియర్ నేతలు, వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీ సోషల్ మీడియా ఆధారాల్లేని ఆరోపణలు చేస్తూ మైనారిటీల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. తప్పుడు సమాచారాలు, వార్తలు సృష్టించి దుష్ప్రచారాలు చేస్తున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చినా కూడా ఇంకా జగన్ బొమ్మ ఉన్న ఇళ్ల పట్టాలను, కుల ధ్రువీకరణ పత్రాలను కొంత మంది అధికారులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఈసీకి 34 ఫిర్యాదులు చేశామని.. వాటిపై చర్యలు లేవని ఆక్షేపించారు.



ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

ఓటమి భయంతో ట్యాపింగ్: దేవినేని

జగన్ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ప్రతిపక్షనేతలు, ఎన్నికల కమిషన్ అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నారు. 175 నియోజకవర్గాల్లో ప్రణీత్‌రావులను ఏర్పాటు చేసుకుని తాడేపల్లి కేంద్రంగా అత్యాధునిక టెక్నాలజీతో ఫోన్లు ట్యాప్ చేయిస్తూ జగన్, జనం వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడుతున్నారు. దీన్ని ఆనాడే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బయటపెట్టారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనల్లో అధికారులు కటకటాల్లోకి వెళ్తున్నా... జగన్‌రెడ్డికి ఊడిగం చేస్తున్న చీఫ్ సెక్రటరీ, డీజీపీ, అడిషనల్ డీజీ, డీఎస్పీలు నరేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు సహకరిస్తున్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వైసీపీ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని పేర్కొన్నారు. వైసీపీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, రామచంద్రారెడ్డి, మరి కొంత మంది ఎమ్మెల్యేలు తమ ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు చెప్పినా ఈ ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదన్నారు. వైసీపీ నేతల రహస్య వివరాలను కూడా ఫోన్ ట్యాపింగ్‌లతో జగన్ తెలుసుకుంటున్నారని తెలిపారు. అధికారులను అడ్డంపెట్టుకుని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి, న్యాయమూర్తుల ఫోన్లను ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లపై సజ్జల, ధనుంజయరెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అడిషనల్ డీజీ సీతారామాంజనేయులు సమాధానం చెప్పాలన్నారు.

వలంటీర్లంతా బానిసలన్నట్టు..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. "జగనన్న ఆదేశాలనే పాటించరా? రాజీనామాలకు ఎందుకు వెనుకాడుతున్నారు?" అని నిలదీస్తున్నారు.

ఏజెంట్లుగా కూర్చోబెట్టేందుకే...

వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని, వారిని పోలింగ్ ఏజెంట్లుగా కూడా నియమించవద్దని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీంతో వైసీపీ వంకర ఎత్తుగడ వేసింది. వలంటీర్ల చేత రాజీనామా చేయించి... వారిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించాలని యోచిస్తోంది. అప్పుడు... పోలింగ్ కేంద్రాల్లోనే ఓటర్లను బెదిరించి ప్రభావితం చేయవచ్చు. కానీ... వలంటీర్లలో అత్యధికులు రాజీనామాలు చేసేందుకు ఇష్టపడటంలేదు. "ఇప్పటి వరకు వైసీపీ నేతలు చెప్పిన పనులన్నీ చేశాం. బానిసల్లా గొడ్డుచాకిరీ చేశాం. అదంతా విధి నిర్వహణలో భాగమని సరిపెట్టుకున్నాం. కానీ... రాజీనామాలు చేసేసి పార్టీ కార్యకర్తలుగా మారాలంటే ఎలా?" అని వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. ఉన్నపళంగా గ్రామాల్లో పార్టీ కార్యకర్తల అవతారమెత్తలేమని మొహం చాటేస్తున్నారు. గ్రామాల్లో ప్రజల నాడిని స్పష్టంగా గమనిస్తున్న వలంటీర్లు వైసీపీకి ఇంకో చాన్స్ దక్కే అవకాశమే లేదనే అంచనాకు వచ్చారు. జనాలు ఎవరి అభిప్రాయంతో వారు ఉన్నారని, పథకాలు అమలు చేసినప్పుడు తమమాట విన్నప్పటికీ... ఇప్పుడెవరూ తమను పట్టించుకోవడం లేదని కొందరు వలంటీర్లు చెబుతున్నారు. ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో.. తామెంత నచ్చజెప్పినా జనం నమ్మే స్థితిలో లేరని వలంటీర్లు తమ అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేసి లేనిపోని ఇబ్బందుల్లో పడడం ఎందుకని భావిస్తున్నారు. ఇప్పటి దాకా ప్రభుత్వ సేవకులమని చెప్పి ఇప్పుడు వైసీపీ కార్యకర్తలమంటూ ప్రజల వద్దకు వెళ్తే ఛీకొడతారేమోనని మరికొందరు ముఖం చాటేస్తున్నారు.

వలంటీర్లపై జులుం...

వలంటీర్ల 'సహాయ నిరాకరణ'ను వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అదేదో సొంత సొమ్ము ఊరికే ఇచ్చినట్లు... "ఐదేళ్లుగా జగనన్న మీకు ఉద్యోగాలిస్తే ఇప్పుడు దూరంగా వెళ్తారా? రాజీనామాలు చేయాల్సిందే. చేయకుంటే ఊరుకునేది లేదు" అని హెచ్చరిస్తున్నారు. 'రాజీనామాలు చేయించండి. వైసీపీ కార్యకర్తల్లా పని చేసేలా చూడండి' అని స్వయంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు వైసీపీ నాయకులను ఆదేశించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు తమ వైఖరి స్పష్టంగా చెబుతున్నారు. వీరిని కొనసాగిస్తామని... రాజకీయాలు చేయని వలంటీర్లకు ముప్పుండదని.. పైగా వారికి ఇప్పుడిస్తున్న పారితోషికాన్ని రూ.10వేలు చేస్తామని.. వారి భవిష్యత్ మెరుగుపరుస్తామని.. బాగా చదువుకున్న వలంటీర్లకు నైపుణ్య శిక్షణ ఇచ్చి మంచి ఉపాధి అవకాశాలు లభించేలా చేస్తామని చంద్రబాబు హామీ ఇస్తున్నారు. వీటిని ఎక్కువ మంది వలంటీర్లు విశ్వసిస్తున్నారని వైసీపీ స్థానిక నేతలు సైతం అంగీకరిస్తున్నారు. జగన్ ఒత్తిడితో రాజీనామా చేస్తే.. టీడీపీ ప్రభుత్వంలో తమకు అవకాశాల్లేకుండా పోతాయని అంటున్నారని చెబుతున్నారు.

వలంటీర్లుగా పనిచేస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కేసులు పెడతామని ఇప్పటికే ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. అలాంటివారిపై విపక్షాలు కూడా ఫిర్యాదు చేయడం.. కొందరిపై అధికారులు వేటు వేయడం కూడా జరుగుతోంది. వారిపై కేసులు కూడా నమోదవుతున్నాయి. దీనిని బూచిగా చూపి.. ఇప్పుడు వలంటీర్లుగా వైదొలిగితే మళ్లీ జగన్ గద్దెనెక్కగానే వారి పోస్టులు వారికి ఇస్తామని వైసీపీ నేతలు ప్రలోభపెడుతున్నారు.

రాజీనామా చేయాల్సిందే..

▸ వైసీపీ నేత హెచ్చరిక

మెళియాపుట్టి, ఏప్రిల్ 12: స్థానిక ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి వలంటీర్లను సీఎం జగన్ సొంత మనుషుల్లా చూసుకుని ఒక గొప్ప అవకాశం కల్పించారని.. వారు కృతజ్ఞతలు చూపించడానికి ప్రస్తుత ఎన్నికల కంటే గొప్ప అవకాశం రాదని ఓ వైసీపీ ముఖ్య నేత సందేశం పంపారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన ఆయన.. శుక్రవారం వాట్సాప్‌లో హెచ్చరిక పంపారు. 'దయచేసి రేపటిలోగా రాజీనామా చేయాలి. లేదంటే మీ అందరినీ టీడీపీ కోవర్టుల్లా చూస్తాం. పైగా రేపు మళ్లీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎందరు చెప్పినా.. కనీసం సచివాలయం గేటు కూడా మీరు తాకలేరు. అర్థం చేసుకుని స్వచ్ఛందంగా రాజీనామా చేయండి' అని అందులో స్పష్టం చేశారు.

రాజీనామా చేసిన వలంటీర్లు.. ఏజెంట్లుగా కూర్చోకుండా చూడండి

▸ కేంద్ర ఎన్నికల పరిశీలకుడు మిశ్రాకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధుల వినతి

విశాఖపట్నం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజీనామా చేసిన వలంటీర్లు ఎన్నికల సమయంలో ఏజెంట్లుగా కూర్చోకుండా చూడాలని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు రామమోహన్ మిశ్రాను సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రతినిధులు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం కోరారు. రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు రేపు పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తే ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వారిద్దరూ శుక్రవారం సాయంత్రం విశాఖపట్నంలో రామమోహన్ మిశ్రాతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిబద్ధతతో పనిచేయాలని, రాగద్వేషాలకు అతీతంగా దృఢ వైఖరితో వ్యవహరించాలని మిశ్రాకు సూచించామన్నారు. "ప్రజాస్వామ్యం ఎన్నికల ముందు కాదని, ఆ తరువాతే అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఓటింగ్ నిష్పత్తి ప్రకారం అవకాశాలు ఇవ్వాలని రాజకీయ పార్టీలు కోరడం తగదు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసే సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని మా సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం వారిని ఆ విధుల నుంచి తప్పించింది. ఎటువంటి జాప్యం లేకుండా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కనీసం మే నెలలో అయినా 1, 2 తేదీలలోనే పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో చర్యలు చేపట్టాలని రామమోహన్ మిశ్రాను కోరాం" అని ఎల్వీ పేర్కొన్నారు.

ఆదేశాలు పాటించాల్సిందే: నిమ్మగడ్డ

రాజ్యాంగాన్ని రక్షిస్తామని ప్రమాణ స్వీకారం చేసి పదవులు అధిష్ఠించే నాయకులు రాజ్యాంగ సంస్థలైన కోర్టులు, ఎన్నికల సంఘం ఇచ్చే ఆదేశాలను తు.చ. తప్పకుండా ఆచరించాల్సిందేనని రాష్ట్ర ఎన్నికల పూర్వ ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ సలహాదారులు ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్నందున వారు కూడా ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తారని రమేశ్‌కుమార్ స్పష్టంచేశారు. "ఏపీలో 40 మంది సలహాదారులు ఉన్నారు. వారిలో 13 మందికి కేబినెట్ హోదా ఉంది. జీతాలు తీసుకుంటున్న వారు ఎన్నికల సమయంలో రాజకీయ చర్చల్లో పాల్గొనకూడదు. ఏ ఉద్యోగి అయినా అలా చేస్తే విధుల నుంచి సస్పెండ్ చేస్తారు. అవే నిబంధనలు సలహాదారులకు కూడా వర్తిస్తాయి. రాజకీయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కోరితే, వివరణ కోరామని చెప్పారు. దీనిపై మేం తీవ్ర అసంతృప్తితో ఉన్నాం. ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారి క్రియాశీలకంగా వ్యవహరించి కఠిన చర్యలు తీసుకోవాలే తప్ప వివరణలు కోరడం సరైన విధానం కాదు. సలహాదారులపై కఠిన చర్యలు తీసుకోకుంటే మేం ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేస్తా"మని స్పష్టంచేశారు.



విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, పక్కన ఎల్వీ సుబ్రహ్మణ్యం

వలంటీర్లతో రాజీనామా చేయించండి

▸ వైసీపీ కార్యకర్తల్లా పనిచేసేలా చూడండి

▸ నాయకులకు మంత్రి ధర్మాన పిలుపు

శ్రీకాకుళం, అర్బన్ 12: 'వలంటీర్లందరితో రాజీనామాలు చేయించి వారిని వైసీపీ కార్యకర్తలుగా పనిచేసేలా చూడాల'ని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఓ కల్యాణ మండపంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'పార్టీ తరఫున కార్యకర్తలుగా పనిచేసే వలంటీర్ల ద్వారా నియోజకవర్గం బయట ఉద్యోగాలు, పనులు చేసుకుంటున్న ఓటర్లను రప్పించి ఓటు వేయించేలా చూడాలి. చాలా కాలంగా ఓటు వేయని వారితో కూడా ఓటు వేయించేలా వలంటీర్లు పనిచేయాలి. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను చేసిన అభివృద్ధి పనుల గురించి ఇంటింటికీ వెళ్లి చెప్పుకునే అవసరం లేదు. ఈ విషయం ప్రజలకు తెలుసు. కార్యకర్తలే ఈ నిజాన్ని ముమ్మర ప్రచారం చేయాలి' అని అన్నారు. వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ వై వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రానున్న 30 రోజులు చాలా కీలకమని అన్నారు.

టీడీపీ బాట పట్టిన వలంటీర్లు

▸ నెల్లూరు జిల్లాలో 40 మంది, శ్రీకాకుళంలో ఇద్దరు చేరిక

నెల్లూరు, టెక్కలి, ఏప్రిల్ 12: వలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రకటన ఆయా వర్గాల్లో ఆలోచన రేకెత్తించింది. ఐదేళ్లపాటు వైసీపీకి అడ్డగోలుగా చాకిరీ చేసినా రూపాయి కూడా పెరగకపోవడాన్ని వలంటీర్లలో అనేక మంది ప్రశ్నిస్తున్నారు. పైగా తమను రాజీనామా చేసి, వైసీపీ కార్యకర్తల్లా పనిచేయాలని ఆదేశించడంపై పలువురిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే పలువురు వలంటీర్లు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో 40 మంది వలంటీర్లు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరులోని ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఇంకా చాలామంది వలంటీర్లు వైసీపీ నుంచి విముక్తి కోసం వేచి ఉన్నారని అన్నారు. వారంతా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం చిట్టయ్యవలస పంచాయతీ తులసిపేట ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారానికి అచ్చెన్నాయుడు వెళ్లగా.. తోట సింహాచలం, పట్ట కాశీపతి అనే ఇద్దరు వలంటీర్లు టీడీపీలో చేరిపోయారు.

కోటి బంగారం, వెండి స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం మండలం పొట్టిలంక పోలీస్ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకునట్టు దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా తమ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ఓ కంటైనర్ వాహనంలో సుమారు రూ.కోటి విలువ చేసే బంగారు, వెండి వస్తువులను గుర్తించినట్టు చెప్పారు. వాటికి వాహనం సిబ్బంది సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని జీఎస్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు.



స్టేషన్‌లో నుంచి బయటకు వస్తున్న బాలినేని

మా వాళ్లనే అరెస్టు చేస్తారా?

▸ పోలీసు స్టేషన్‌లో బాలినేని హల్‌చల్

▸ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదంటూ బైఠాయింపు

▸ అరెస్టులు విరమించి నోటీసులతో సరి

▸ తానూ కేసులో ఉన్నానని, నోటీసు తీసుకుంటానని బాలినేని వెల్లడి

▸ రెండు గంటల పాటు వన్‌టౌన్‌లో హైటెన్షన్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 12: వైసీపీ బరితెగింపు పరాకాష్ఠకు చేరింది. ఒంగోలులో వరుస ఘటనలే అందుకు నిదర్శనం. ఏకంగా పోలీస్ స్టేషన్‌లోనే ఎమ్మెల్యే, ఆయన తనయుడు, వారి అనుచరులు హల్‌చల్ చేశారు. శుక్రవారం ఉదయం ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వైసీపీ ఒంగోలు అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి సుమారు రెండు గంటల పాటు హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై దాడిచేసి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించిన సంగతి తెలిసిందే. అదేక్రమంలో రిమ్స్‌లో క్యాజువాలిటీ ప్రధాన ద్వారం వద్ద అద్దాలు పగలగొట్టిన కేసుకు సంబంధించి పోలీసులు అటు టీడీపీ, ఇటు వైసీపీ కార్యకర్తలను శుక్రవారం తెల్లవారుజాము నుంచి అరెస్టు చేశారు. ఈ క్రమంలో తనకు తెలియకుండా వైసీపీ కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు తీసుకుపోవడం ఏమిటంటూ బాలినేని నేరుగా ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. మొదట అక్కడ ఉన్న పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం అక్కడే రెండున్నర గంటల పాటు సీఐ లక్ష్మణ్ రూంలో కూర్చున్నారు. ఇదే సమయంలో ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి శ్రేణులతో కలిసి వచ్చి స్టేషన్ ఎదుట తిష్ట వేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ నెలకొంది. విషయం తెలుసుకున్న ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఒంగోలు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, కేసు దర్యాప్తు చేస్తున్న చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ ఉన్నారు. రిమ్స్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు ఇప్పటి వరకూ నలుగురు టీడీపీ, 10మంది వైసీపీ వారిని అరెస్టు చేశారు. బాలినేని వచ్చి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన తరువాత కేసులో ఉన్న వారందరికీ 41 సీఆర్పీసీ నోటీసులు ఇచ్చి, ఆర్డీఓ దగ్గర బైండోవర్ చేశారు. నేరుగా బాలినేని మీడియాకు అదే విషయం తెలియజేశారు. తాను కూడా ఈ కేసులో ఉన్నానని, నోటీసులు తీసుకుంటానని బాలినేని చెప్పడం గమనార్హం.

రూ.97,000 కోట్ల అప్పు కావాలి

▸ కేంద్రానికి జగన్ సర్కారు ప్రతిపాదన

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమకు రూ.97,000 కోట్ల అప్పు కావాలని కేంద్ర ప్రభుత్వానికి జగన్ సర్కారు ప్రతిపాదన పంపింది. దీనిపై సోమవారం కేంద్రం నిర్ణయం వెలువరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే అడహక్ ప్రాతిపదికన రూ.4వేల కోట్లకు అనుమతి తెచ్చుకొని, వాటిని వాడేశారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో అనుమతుల కోసం ఈ ప్రతిపాదనను పంపారు. ఇందులో ఇప్పటికే అనుమతులు వచ్చిన మొత్తం మినహాయించి, మిగిలిన రూ.93,000 కోట్లలో కేంద్రం ఎంత మొత్తానికి అనుమతిస్తుందో వేచిచూడాలి. గత ఆర్థిక సంవత్సరంలో నెలకు సగటున రూ.5,700 కోట్లు చొప్పున మొత్తం రూ.68,400 కోట్ల అప్పులకు రాష్ట్రానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. కానీ, ఈసారి ఏకంగా రూ.97 వేల కోట్లు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.80,000 కోట్ల వరకూ అనుమతులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కలువలతో అమ్మవారికి అర్చన చేస్తున్న అర్చకులు, కలువలను పూజకు తెస్తున్న ఈవో కేఎస్ రామారావు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ(ఇన్‌సెట్‌లో)

దుర్గమ్మకు కలువపూల అర్చన

వన్‌టౌన్, ఏప్రిల్ 12: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వ హిస్తున్న ప్రత్యేక పుష్పార్చనల్లో 4వ రోజైన శుక్రవారం దుర్గమ్మను కలువలతో, మరువంతో అర్చకులు విశేషంగా అర్చించారు. హారతి, మంత్రపుష్పం కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు. స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ, ఏఈవో రమేష్ బాబు సిబ్బందితో కలిసి కలువపూలు, మరువం ఉన్న బుట్టలను మేళ తాళాల మధ్య ఈవో వేదిక వద్దకు తెచ్చారు. సంకల్పం అనంతరం లలితా సహస్రనామం అనుసంధానంతో అమ్మవారికి కలువలు, మరు వం సమర్పించారు.

అమ్మవారి సన్నిధిలో అష్టావధానం

తిరుపతికి చెందిన యువశతవధాని ఉప్పల దడియం భారతశర్మ ఆధ్వర్యంలో దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథం వేదికపై అష్టావధాన కార్య క్రమాన్ని నిర్వహించారు. కవిపండితులు పాలపర్తి శ్యామలానంద ప్రసాద్-నిషిద్ధాక్షరి, మెట్ల వెంకటేశ్వరరావు-సమస్య, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ- దత్తపది, పింగళి వెంకటకృష్ణారావు-వర్ణన, ఈవో కేఎస్ రామారావు-అనువు, పి.భానుమతి-న్యస్తాక్షరి, దండిబొట్ల దత్తాత్రేయ శర్మ-అప్రస్తుత ప్రసంగాలను సంధించారు

దుర్గా గీతమాలిక ఆడియో ఆవిష్కరణ

దుర్గామల్లేశ్వరుల వైభవాన్ని వర్ణిస్తూ స్వరమాధురి మ్యూజిక్ రూపొందించిన దుర్గాగీత మాలిక ఆడియోను ధర్మపథం వేదికపై ఆవిష్కరించారు. ఈవో కేఎస్ రామారావు, ఏఈవో రమేష్‌బాబు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి, పండితులు పాల్గొన్నారు. రచన, స్వరకల్పన చేసిన మాధురిని ఈవో అభినందించారు. అనంతరం మాధురి తన గానంతో స్వరపుష్పార్చన సమర్పించారు.

ఐటీ విభాగంతో ఈవో సమావేశం

ఆలయంలో ఐటీ వ్యవస్థ నిర్వహణపై ఆ విభాగం అధికారులు, సిబ్బందితో ఈవో కేఎస్ రామారావు సమీక్ష నిర్వహించారు. 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి వైభ వాన్ని మరింత చేరువ చేసేందుకు ప్రతి సేవా కార్యక్రమాన్ని ప్రసారం చేయాలని, భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలు, పరోక్ష సేవలపైన అవగాహన కల్పించేందుకు డిజిటల్ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని, పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్) యంత్రాలను కౌంటర్లలో పెట్టి భక్తులకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఈవో సూచించారు.

కానిస్టేబులా..

మజాకా!

- పోలీస్ ఉన్నతాధికారుల పేర్లతో దుర్గగుడిలో అనధికార దర్శనాలు
- అడ్డుకుంటున్న ఉద్యోగులు, అర్చకులపై బెదిరింపులు

వన్‌టౌన్, ఏప్రిల్ 12: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో పోలీస్ ఉన్నతాధికారుల పేర్లు చెప్పి, పదుల సంఖ్యలో భక్తులను అనధికారికంగా తీసుకువెళ్లి దర్శనాలు చేయిస్తున్నాడని, అడ్డుకుంటున్న ఉద్యోగులు, అర్చకులపై బెదిరింపులకు దిగుతున్నాడని దేవస్థానంలోని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలు, ఉన్నతాధికారుల సమాచారాన్ని ముందుగా ఆయా విభాగాల ఉద్యోగులు దేవస్థానం సమాచార కేంద్రంలో తెలియజేస్తారు. వారు దేవస్థానానికి వచ్చాక ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది వారిని ప్రొటోకాల్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లి వారి వివరాలు అక్కడ తెలిపి వీఐపీ టికెట్లు కొనుగోలు చేసి, అనంతరం అమ్మవారి దర్శనానికి తీసుకెళుతుంటారు. వన్‌టౌన్ కానిస్టేబుల్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా భక్తులను తీసుకువెళ్లి అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్నాడు. ఉద్యోగులు ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల పేర్లు చెబుతున్నాడు. ఇటీవల ఆ కానిస్టేబుల్ ఎనిమిది మంది భక్తులను దేవస్థానం ప్రొటోకాల్ అధికారులు, సిబ్బంది అనుమతి లేకుండా ఆశీర్వచనం మండపం పక్కన నుంచి దర్శనానికి తీసుకెళ్లడంతో అక్కడ ఉన్న పలువురు ఉద్యోగులు అడ్డుకున్నారు. దీంతో ఆ కానిస్టేబుల్ ఉన్నతాధికారుల తాలుకా వారిని అడ్డుకుంటారా? మీపైన పై అధికారులకు ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయిస్తానని బెదిరించాడని ఉద్యోగులు, సిబ్బంది చెబుతున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు టికెట్లు లేకుండా ఎవరినీ అమ్మవారి దర్శనానికి అనుమతించొద్దని ఆదేశించడంతో వీఐపీలు, ఉన్నతాధికారులను తప్పనిసరిగా టికెట్ తీసుకోవాల్సిందేనని అధికారులు, ఉద్యోగులు సూచిస్తున్నారు. దాంతో వారు టికెట్ తీసుకునే అమ్మవారి దర్శనానికి వెళుతున్నారు. వన్‌టౌన్ కానిస్టేబుల్ సమాచార కేంద్రంలో తెలియజేయకుండా పోలీస్ అధికారుల పేర్లు చెప్పి అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లడం ఉద్యోగులకు, అర్చకులకు ఇబ్బందిగా మారింది. పలువురు ఉద్యోగులు కానిస్టేబుల్ వ్యవహారాన్ని ఆలయ ఈవో కేఎస్ రామారావు దృష్టికి తీసుకుని వెళ్లనున్నారు. దుర్గగుడిలో విధులు నిర్వహిస్తున్న ఆ కానిస్టేబుల్‌పై వన్‌టౌన్ సీఐ ధనశేఖర్‌రెడ్డి దృష్టి సారించాలని కోరుతున్నారు.

కంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్

అసోసియేషన్ నుంచి ముగ్గురి బహిష్కరణ

వన్‌టౌన్, ఏప్రిల్ 12: ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుంచి బాజీపఠాన్, రాజేశ్వరరావు, చీర్ల కిరణ్‌లను బహిష్కరించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోరుకొండ సతీష్, జనరల్ సెక్రటరీ సీఎం దాస్, ఆర్థిక విభాగం కార్యదర్శి బత్తిన ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గుత్తి ప్రేమనాథ్‌రెడ్డి, అదనపు జనరల్ సెక్రటరీ గురాన శ్రీనివాసరావులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిన బాజీపఠాన్ సంఘ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తానే సంఘానికి ప్రెసిడెంట్‌నంటూ ప్రచారం చేసుకుంటున్నాడని వారు తెలిపారు. మిగతా ఇద్దరు ప్రధాన కార్యదర్శి, అసోసియేట్ అధ్యక్షుడు అని ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో వారి ముగ్గురిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నామని, వారి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేశామని, తమ సంఘం స్వతంత్ర సంఘంగా ఉందని, కేఆర్ సూర్య నారాయణ ఆధ్వర్యంలో ఉన్న సంఘంలో చేరినట్లు ఆ ముగ్గురు ప్రకటించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత కార్యవర్గానికి, ఉద్యమానికి వారు ఇబ్బందిగా పరిణమించారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం కాదు..హత్య

- మృతుడి బంధువుల ఆరోపణపై కేసు నమోదు

ఉంగుటూరు, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో మృతి చెందలేదు, హత్య చేశారని ఆరోపిస్తూ శుక్రవారం మృతుడి బంధువులు ఆత్కూరు పోలీసులను ఆశ్రయించారు. నిందితులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేశారు. గత ఫిబ్రవరిలో చిన అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రి ఎదురుగా కొత్త ఫ్లైఓవర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అది యాక్సిడెంట్‌గా నిర్ధారించి కేసు నమోదు చేసిన సంఘటన విదితమే..పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుజిల్లా పెదపాడు మండలం, వీరమ్మకుంట గ్రామ శివారు వెంకటాపురానికి చెందిన లాజర్, వెంకట్ అనే ఇద్దరు సూరంపల్లిలో ఓ ఫంక్షన్‌కు హాజరై బైక్‌పై తిరిగి వస్తున్న క్రమంలో ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారని, ఈ ప్రమాదంలో లాజర్ మరణించగా వెంకట్‌కు గాయాలైనట్లు ఆత్కూరు ఎస్సై కేసు నమోదు చేశారు. కాగా లాజర్ మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసును సమగ్రంగా దర్యాప్తుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఏ.పైడిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు మీడియాతో మాట్లాడుతూ సూరంపల్లి ఫంక్షన్‌కు వెంకటాపురానికి చెందిన లాజర్, వెంకట్‌తోపాటు, అదేగ్రామానికి చెందిన గండికోట సత్యనారాయణ, కోడి నాగరాజు అనే వ్యక్తులు కూడా హాజరయ్యారని తెలిపారు. అక్కడ ఇరువర్గాల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో గొడవలు జరుగుతాయని వెంకట్, లాజర్ బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలో పిన్నమనేని ఆస్పత్రి ఎదురుగా వున్న కొత్త ఫ్లైఓవర్ వద్దకురాగానే సత్యనారాయణ, నాగరాజులు లాజర్‌ను అడ్డగించి హత్యచేశారని వారు ఆరోపించారు.

15న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 12: నూజివీడులోని బెతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్(బీఐఎస్)లో 9వ జూనియర్ ఇంటర్ డ్రిస్టిక్టు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలను ఈనెల 15న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రబోస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు నకలు, ఒరిజనల్ తీసుకుని రావాలని ఆయన సూచించారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపిక చేసిన జట్లు ఈనెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బెతెస్థ ఇంటిగ్రేటెడ్‌స్కూల్‌లో నిర్వహించే అంతర్ జిల్లాల పోటీలకు పంపుతామని ఆయన పేర్కొన్నారు.

పరీక్ష తొవిష్మదింటికి..

హాల్‌టికెట్లు ఇచ్చింది తొమ్మిదిన్నరకు

- విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని ఆంధ్రా లయోల కళాశాల యాజమాన్యం నిర్వాకం
- పరీక్ష పూర్తయ్యాక మళ్లీ హాల్‌టికెట్లు తీసేసుకున్న వైనం

గుణదల, ఏప్రిల్ 12: ఆంధ్రా లయోల కళాశాలలో బీఎంఎస్ రెండో ఏడాది విద్యార్థులకు ఆఖరి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలి. కానీ, పరీక్ష రాద్దామని వచ్చిన 100 మంది విద్యార్థులకు యాజమాన్యం హాల్‌టికెట్లు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులంతా ప్రిన్సిపాల్ రూమ్ వద్దకు చేరుకుని, అక్కడున్న సిబ్బందిని గట్టిగా అడిగారు. దీంతో మీరు ఫీజులు చెల్లించనందున హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ప్రిన్సిపాల్ రూమ్ వద్ద సిబ్బంది నుంచి సమాధానం వచ్చింది. తర్వాత విషయం మీడియా దృష్టికి రావడంతో కళాశాల యాజమాన్యం క్షణాల్లో హాల్ టికెట్లు ఇచ్చి, పరీక్షా కేంద్రం కేటాయింపు, ఇన్విజిలేటర్లను నియమించడం అంతా చకచకా జరిగిపోయాయి. పరీక్షను ఎంత సమయం ఆలస్యంగా ప్రారంభించారో అంతే సమయాన్ని అదనంగా ఇచ్చి పరీక్ష నిర్వహించారు. పరీక్ష రాశాక విద్యార్థుల నుంచి హాల్ టికెట్లను తిరిగి కళాశాల యాజమాన్యం తీసేసుకుంది.

విద్యార్థులు ఫీజులు చెల్లించినా..

ఆంధ్రా లయోలా కళాశాలలో డిగ్రీ కళాశాలలో మూడేళ్ల నుంచి బీఎంఎస్ కోర్సును ప్రవేశపెట్టారు. ఈ కోర్సులో ఈ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్, అగ్రిస్టోరేజ్ విభాగాలున్నాయి. ఈ విభాగాలన్నింటిలో కలిపి 100 మంది విద్యార్థులు ఉన్నారు. బీఎంఎస్‌కు కళాశాల ఆవరణలో డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశారు. అందులోనే విద్యార్థులంతా ఫీజులు చెల్లించారు. విద్యార్థులు చెల్లించిన ఫీజుల మొత్తాన్ని కళాశాల యాజమాన్యానికి ఆ డిపార్ట్‌మెంట్ వారు జమచేయలేదు. దీంతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ప్రిన్సిపాల్ రూమ్ వద్ద ఉన్న సిబ్బంది చెప్పారు. ప్రిన్సిపాల్ రూమ్‌కు, డిపార్ట్‌మెంట్ హెడ్‌కు ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫోన్ చేసినా వారు ఎత్తలేదు.



ప్రిన్సిపాల్ రూమ్ వద్ద హాల్‌టికెట్ల కోసం వేచి ఉన్న విద్యార్థులు

మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్

భారతీనగర్, ఏప్రిల్ 12: రంజాన్ పండుగ తర్వాత నిర్వహించే ఈద్ మిలాప్ మత సామరస్యానికి, ఐక్యమత్యానికి ప్రతీక అని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి చిన్ని పాల్గొన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో అల్లా దయవల్ల కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని ఆయన అన్నారు. రంజాన్ మాసంలో పలు సేవా కార్యక్రమాలు చేసిన ముస్లిం యువకులు, నాయకులను చిన్ని సన్మానించారు. మౌలానా మగ్బుల్ నద్వీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం ఆయన కేశినేని శివనాథ్‌కు ఖురాన్ గ్రంథాన్ని బహూకరించారు.



ఈద్ మిలాప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేశినేని చిన్ని



కేశినేని చిన్నిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉండవల్లి శ్రీదేవి

కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేస్తా

- డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

విద్యాధరపురం, ఏప్రిల్ 12: చంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ బలోపేతం కోసం, కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పనిచేస్తానని డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం కేశినేని శివనాథ్(చిన్ని)ను గురునానక్‌కాలనీలోని చిన్ని కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. తాను టికెట్ ఆశించినానని, చంద్రబాబు తనకు కొన్ని కారణాల వల్ల టికెట్ ఇవ్వలేదని ఉండవల్లి శ్రీదేవి తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో

శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి, ఉత్తమ ఫలితాలు సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు, ఎండీ వై.శారదాదేవి శుక్రవారం తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాలలో వారు అభినందించారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎస్.యామిని 466, కె.జాన్ మార్లిటో 465, డి.మాధురి 465, జి.రసజ్ఞ 465, ఎ.నాగసాయి 464, జి.తేజస్విని 464, పి.సాయిహర్ష 464, వై.హర్షనందన వెంకట సంతోష్ 463, కె.రోహిత్ 453, రైనాజైన్ 428, బైపీసీలో 440కి ఎస్.జాహ్నవి 435, బి.సింధు 433, సీహెచ్ శ్రీరామ్, కె.యషిత 430, బి.అనన్య 429, సీహెచ్ బ్రహ్మణి 428 మార్కులు, సీనియర్ ఎంపీసీలో 1000 మార్కులకు సీహెచ్ శ్రీరామసంజీవ్, టి.నాగభారతి, కె.నవ్య చంద్రిక, సీహెచ్ శ్రావణి 987, మనస్వి దుర్గ 986, టి.లక్ష్మీతేజస్విని 984, సీనియర్ బైపీసీలో ఎ.మధుమేఘన 989, ఎం.లావణ్య 987, ఆర్.సింధుశ్రీ 982, బి.తేజస్విమోహన్ 980, ఎం.చిన్మయి 980 మార్కులు సాధించారని తెలిపారు. కళాశాల అడ్వయిజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎ.మధుమేఘన (989) బైపీసీ



సీహెచ్ శ్రీరామసంజీవ్ (987),ఎంపీసీ

త్రివేణి విద్యార్థుల సత్తా

పటమట/అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో త్రివేణి కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ బి.సీతారామరెడ్డి శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 94 శాతం, జూనియర్ ఇంటర్‌లో 91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఎంపీసీ సీనియర్ ఇంటర్‌లో పి.లహరి 972, పి.కావ్య 970, ఎంఈసీలో వి.అనూష 958, జూనియర్ ఇంటర్‌లో ఎస్కే. మస్కాన్ 463/470, జూనియర్ ఎంఈసీలో పి.జ్యోతి 485, సీఈసీలో ఎ.సాయిమనోజ్ఞ 473 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు, బోధించిన అధ్యాప కులను డైరెక్టర్లు శ్రీధర్, సాంబిరెడ్డి, క్యాంపస్ ఇన్‌ఛార్జులు పుష్పలత, విజయలక్ష్మి, శ్యామల అభినందించారు.



పి .కావ్య (970/1000) ఎంపీసీ



వి.అనూష (958/1000) ఎంఈసీ

బ్యాంక్ మాజీ అధికారి ప్రభావతికి బెయిల్

విజయవాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఖాతాదారుడి బంగారు ఆభరణాలను కాజేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న బ్యాంక్ మాజీ అధికారిణి దావులూరి ప్రభావతికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు మేనేజర్‌గా పనిచేసిన ప్రభావతి తనకు పరిచయం ఉన్న యోగేశ్వరరావు అనే వ్యక్తితో బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో పెట్టించారు. ఈ ఆభరణాలను ప్రభావతి కాజేశారని ఆయన పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఆమె రిమాండ్‌లో ఉన్నారు. ప్రభావతికి బెయిల్ మంజూరు చేయాలని న్యాయవాది కిలారు బెనర్జీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు విచారించి బెయిల్ మంజూరు చేస్తూ శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది.

వైసీపీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో..

చంద్రబాబుపై అసత్యప్రచారం

- బ్రాహ్మణ ద్వేషి అంటూ దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ వ్యాఖ్యలు
- బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పి, శ్రీకాంత్ రాజీనామా చేయాలి
- టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ డిమాండ్

విద్యాధరపురం, ఏప్రిల్ 12: "కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో గురువారం నిర్వహించిన వైసీపీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషి అని, బ్రాహ్మణులకు ద్రోహం చేశారని దేవదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అసత్యాలు ప్రచారం చేశారు. ఆ పదవికి శ్రీకాంత్ తక్షణమే రాజీనామా చేసి బ్రాహ్మణ సామాజికవర్గానికి క్షమాపణ చెప్పాలి." అని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసిన శ్రీకాంత్‌కు ఆనాడు చంద్రబాబు బ్రాహ్మణద్వేషి అని తెలియదా అని ఈమని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో బ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వం చేకూర్చిన కోట్లాది రూపాయల లబ్ధిని మరచిపోయావా అని శ్రీకాంత్‌ను ఆయన నిలదీశారు. వైసీపీ ప్రభుత్వంలో దేవదాయశాఖ ముఖ్య సలహాదారుగా బ్రాహ్మణులకు ఏం మేలు చేశావో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అర్చకులపై దాడి జరిగినప్పుడు నిద్రపోయావా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆలయాలపై దాడులు జరిగితే పార్టీలకతీతంగా అందరూ ఖండించగా శ్రీకాంత్ ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు., శ్రీకాంత్ దేవదాయ సలహాదారు పదవిలో కొన సాగుతూ నిజమైన బ్రాహ్మణద్రోహిగా, ద్వేషిగా మిగిలిపోయారని ఆయన విమర్శించారు.

కూటమిని గెలిపించుకుందాం

- ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు

విస్సన్నపేట, ఏప్రిల్ 12 : వైసీపీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, భయపెట్టినా మే 13న జరిగే యుద్ధంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని తప్పక గెలిపించు కోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపు నిచ్చారు. కొండపర్వలో శుక్రవారం పరామర్శకు వచ్చిన ఆమెకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని, అత్యాచారాలు, అరాచకాలు పెరిగాయని భువనేశ్వరి ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగిందన్నారు. దీంతో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం కేసులుపెట్టి, భయపెట్టి ఓట్లు వేసుకోవాలని చూస్తుందన్నారు. వారిని ధైర్యంగా ఎదుర్కొని కూటమిని అధికారంలోకి తీసుకురావాలని భువనేశ్వరి కోరారు.

చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వీరులపాడు, ఏప్రిల్ 12: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్ పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ ఆదేశించారు. శుక్రవారం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనధికార నగదు, మద్యం, గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. నగదు, మద్యం ఏదైనా పట్టుబడిన వెంటనే ఉన్నతాధికా రులకు సమాచారం అందించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంచికచర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బి. సత్యనారాయణ, ఎస్సై వై. నాగేంద్రకృష్ణ పాల్గొన్నారు.



అనుచితంగా ప్రవర్తించి..

ఎన్నికల కమిషన్ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న డూండీ రాకేశ్

నాపై దాడి చేశారు

- పోలీసులు, వెలంపల్లి అనుచరులపై చర్యలు తీసుకోండి
- ఎన్నికల కమిషన్‌కు డూండీ రాకేశ్ ఫిర్యాదు

వన్‌టౌన్, ఏప్రిల్ 12: "ఇటీవల ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వైసీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు వెంట వచ్చిన ఆయన అనుచరులు నాతో అనుచితంగా ప్రవర్తించారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు నాపై దాడి చేసి, నిర్బంధించారు. చర్యలు తీసుకోండి" అని ఎన్నికల కమిషన్‌కు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేశ్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. మాచవరం పోలీసుస్టేషన్ పరిధిలో సంఘటన జరిగితే పటమట పోలీసులు వచ్చి అత్యుత్సాహం ప్రదర్శించారని ఆయన ఆరోపించారు. వైసీపీ నాయకులు గొడవపడితే తన చొక్కా పట్టుకుని సీఐ మోహనరెడ్డి రోడ్డుమీదకు తీసుకువచ్చారన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారన్నారు. ఇటువంటి అధికారులు ఎన్నికల విధుల్లో ఉంటే పోలింగ్ ప్రశాంతంగా జరగదని రాకేశ్ తెలిపారు.

మెరుగైన భావవ్యక్తీకరణతో

మరిన్ని విజయాలు



కేబీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, హాజరైన విద్యార్థులు

వన్‌టౌన్, ఏప్రిల్ 12: విద్యార్థులు భావవ్యక్తీకరణ, నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే మరిన్ని విజయాలను అందుకుంటారని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.హేమచంద్రారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో ఇటీవల మూడు ప్రాంతాల్లో క్విజ్ ప్రాథమిక పోటీలను నిర్వహించి వాటి నుంచి 12 బృందాలను సెమీఫైనల్, ఫైనల్ పోటీలకు ఎంపిక చేసి విజయవాడకు ఆహ్వానించామని ఆయన తెలిపారు. ఉన్నత విద్యామండలి అధికారులు ఆచార్య చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ ఎల్లారెడ్డి, ఎస్.శ్రీజ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపకుడు బి.మోహన్‌తేజ, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి జ్యోతి డిమాండ్

ఉంగుటూరు, ఏప్రిల్ 12: ఉపాధి కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. మండలంలోని లంకపల్లి అగ్రహారంలో జరుగుతున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్ కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రాజమహేంద్రిలో పురందేశ్వరి గృహప్రవేశం


గృహప్రవేశం చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 12: రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో గల నూతన గృహంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

విజయనగరాన్ని దోచుకున్న మంత్రి బొత్స విశాఖపై కన్నేశారు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపణ
- తమ పార్టీకి కుండ గుర్తు కేటాయించినట్టు ప్రకటన


తమ పార్టీ గుర్తు 'కుండ'ను చూపిస్తున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 12: విజయనగరాన్ని దోచుకున్న మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబం ఇప్పుడు విశాఖపై కన్నేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. స్థానిక రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండకు వైసీపీ నేతలు గుండు కొట్టించారని విమర్శించారు. తమ పార్టీకి ఎన్నికల సంఘం కుండ గుర్తు కేటాయించినట్టు ఈ సందర్భంగా తెలిపారు. కుండలు తయారుచేసే కుమ్మరి మాదిరిగానే తాను కూడా ప్రజల జీవితాలు తీర్చిదిద్దుతానన్నారు. తమ పార్టీని గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అనంతరం ఆయన కుమ్మరి చక్రంపై కుండ తయారుచేసి చూపారు.

ఐఆర్ఎఫ్ఎమ్ డైరెక్టర్ జనరల్‌గా అపర్ణగార్గ్

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(ఐఆర్ఎఫ్ఎమ్) డైరెక్టర్ జనరల్‌గా అపర్ణ గార్గ్ బాధ్యతలు చేపట్టారు. ఆమె సివిల్ సర్వీసెస్ 1987 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ అధికారిణి. ఇంతకు ముందు బెంగళూరులో రైల్ వీల్ ఫ్యాక్టరీకి ప్రధానఆర్థిక సలహాదారుగా, మైసూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సేవలందించారు. దక్షిణ రైల్వే, పశ్చిమ రైల్వే, నైరుతి రైల్వేలలో 35 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో అపర్ణగార్ పనిచేశారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

నాపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోండి

- ఎన్నికల కమిషన్‌కు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అనుచరులు అసభ్యంగా ప్రవర్తించారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే పోలీసులు నాపై దాడి చేసి, అక్రమంగా నిర్బంధించారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో పటమట పోలీసులకు సంబంధం లేకపోయినా అత్యుత్సాహం చూపించారు. గొడవ పడింది వైసీపీ మూకలైతే సీఐ మోహన్‌రెడ్డి నా చొక్కా పట్టుకుని రోడ్డు మీదకు లాక్కొచ్చారు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు.

మన్యం స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాన్ని రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మన్యం స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి, గిరిజనులకే కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. అదానీ అడుగులకు మడుగులొత్తుతూ.. రాష్ట్ర ప్రజల ఆస్తులను అప్పనంగా అప్పగిస్తున్న జగన్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి గిరిజన చట్టాలను, హక్కులను తుంగలో తొక్కి.. మన్యం స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టులను అదానీ కంపెనీలకు దారాదత్తం చేయడం సరికాదని అన్నారు.

ఎన్నికల్లో ప్రచారానికి బెయిల్ ఇవ్వండి: సిసోడియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఎన్నికల ప్రచారం చేయడానికి వీలుగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆప్ నాయకుడు మనీష్ సిసోడియా ఇక్కడి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 20లోగా సమాధానం చెప్పాలని ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా శుక్రవారం ఈడీ, సీబీఐలకు నోటీసులు పంపించారు. తదుపరి విచారణను అదే రోజున చేపట్టే అవకాశం ఉంది.

'ఉమ్మడి గుంటూరు'లో వైసీపీకి భారీ షాక్

- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన క్రిస్టినా దంపతులు

గుంటూరు ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. జిల్లాలో ఒకే రోజున ఒకవైపు సీఎం జగన్, మరోవైపు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార కార్యక్రమాలు జరిగాయి. గుంటూరు నగరంలోకి శుక్రవారం సాయంత్రం సీఎం జగన్ నిర్వహిస్తున్న 'సిద్ధం' బస్సు యాత్ర ప్రవేశించింది. సరిగ్గా అదే సమయంలో వేమూరు నియోజకవర్గం కొల్లూరులో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా, ఆమె భర్త.. హార్వెస్ట్ ఇండియా సేవా సంస్థ వ్యవస్థాపకుడు కత్తెర సురేశ్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరి చేరిక గురించి ముందుగా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. తాడికొండ సీటు మీకే ఇస్తామని కొంతకాలంపాటు ఇన్‌చార్జి బాధ్యతలు సురేశ్‌పై మోపి, ఉన్నపళంగా అతన్ని తప్పించి ప్రత్తిపాడు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ హోం మంత్రి మేకతోటి సుచరితకు తాడికొండ సీటును ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వారు మనస్థాపానికి గురై వైసీపీకి దూరంగా ఉంటున్నారు. వేమూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చొరవ తీసుకొని వారితో చర్చలు జరిపి టీడీపీలో చేరేందుకు ఒప్పించారు. చైర్‌పర్సన్ క్రిస్టినా టీడీపీలో చేరేందుకు కొల్లూరు బయల్దేరి వెళ్లే సమయంలో ఈ విషయం బహిర్గతమైంది. ఈ సమాచారాన్ని తెలుసుకొన్న జిల్లాకు చెందిన వైసీపీ నేతలతో పాటు అదే సమయంలో గుంటూరు నగరంలోకి ప్రవేశిస్తున్న సీఎం జగన్‌కు కూడా తెలియటంతో షాక్‌కు గురైనట్లు తెలిసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జడ్పీ చైర్‌పర్సన్ భర్త సురేశ్‌కు హార్వెస్ట్ ఇండియా సేవా సంస్థ ద్వారా ఎస్సీ సామాజిక వర్గంలో తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరుంది. క్రిస్టినా 2014లో తాడికొండ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. వీరు పార్టీని వీడతారని ఊహించని వైసీపీ అధిష్ఠానం ఈ పరిణామంతో షాక్‌కు గురయింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా మాట్లాడుతూ... 'చంద్రబాబు సీఎం కావాలన్న సంకల్పంతో నేను జడ్పీ చైర్‌పర్సన్ పదవిని కూడా వదులుకున్నా. వైసీపీలో గౌరవ, మర్యాదలు లేవు. 12ఏళ్ల పాటు ఆ పార్టీ కోసం నేను, నా భర్త ఎంతో కష్టపడ్డాం. అయినా అక్కడి నాయకులు అవేవి పట్టించుకునే స్థితిలో లేరు. మొదట వేమూరు సీటు మీదే అని అక్కడ ఐదేళ్ల పాటు తిప్పారు. ఆ తరువాత తాడికొండ మీదే అని మరో ఐదేళ్లు అక్కడ తిప్పారు. చివరకు యర్రగొండపాలెం వెళ్లమని చెప్పి అక్కడ కూడా సీటు ఇవ్వకుండా మొండి చేయి చూపించారు. మాట తప్పేది.. మడమ తిప్పేది వైసీపీ వాళ్లే. జగన్ ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో ఎక్కడా ఏ విధమైన అభివృద్ధి జరగలేదు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా.. యువకులకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావాలి' అని హెన్రీ అన్నారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర.. ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మంత్రి ఆతిషి ఆరోపించారు. కొద్ది రోజుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించనున్నారని తమకు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం ఉందని చెప్పారు. ఇటీవల జరిగిన అనేక పరిణామాలు దీనికి బలాన్నిస్తున్నాయని చెప్పారు. "కొన్ని నెలలుగా ఢిల్లీలో సీనియర్ ఐఏయస్ అధికారులను నియమించలేదు. ప్రభుత్వ శాఖల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీ మంత్రులు నిర్వహించే సమావేశాలకు అధికారులు రావడం లేదు" అని వివరించారు.

పెట్స్ తప్పిపోతే 'స్విగ్గీ' వెతికిపెడుతుంది

- ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టిన ఫుడ్ డెలివరీ సంస్థ
- సదరు పెంపుడు జంతువు ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ఫుడ్ డెలివరీ చేసే బాయ్స్‌కు వారి మార్గాల్లో ఎక్కడైనా అవి కనిపిస్తే యజమానికి లోకేషన్ షేర్ చేస్తారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: అపురూపంగా పెంచుకుంటున్న పెంపుడు జంతువులు తప్పిపోయినప్పుడు ఆ బాధ ఎలా ఉంటుందో యజమానికే తెలుసు! ఆ పరిస్థితుల్లో పెద్దగా కష్టపడకుండా తప్పిపోయిన పెట్స్‌ను ఇట్టే వెతికి పెట్టేలా ఏదైనా ఓ మొబైల్ యాప్ అందుబాటులోకి ఉంటే? పెట్ లవర్స్ కోసం ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ.. 'స్విగ్గీ పాలీస్' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పెంపుడు కుక్క, పిల్లి తప్పిపోయినప్పుడు దాని ఫొటోను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్విగ్గీలో దాదాపు 3.5 లక్షల డెలివరీ బాయ్స్ పనిచేస్తుండటంతో స్థానికంగా తిరుగుతుండే బాయ్స్‌కు ఆ మెసేజ్‌లు వెళతాయి. ఫుడ్ ఆర్డర్ల డెలివరీ కోసం వివిధ మార్గాల్లో బాయ్స్ తిరుగుతున్నప్పుడు ఆ ఫొటో పోలికలతో పెంపుడు జీవాలు కనిపిస్తే వారు స్విగ్గీకి చెందిన ప్రత్యేక బృందానికి లోకేషన్‌తో కూడిన సమాచారం చేరవేస్తారు. అంతే తప్ప.. సదరు పెంపుడు జంతువులను బాయ్స్ పట్టుకునే ప్రయత్నం చేయొద్దని స్పష్టమైన నిబంధన పెట్టారు. తర్వాత సదరు ప్రత్యేక బృందం, పెంపుడు జంతువుల కోసం సంబంధిత లోకేషన్‌కు వెళ్లాలని యజమానులను అప్రమత్తం చేసి.. 'మీ పెట్ అదే కావొచ్చు' అనే ఆకాంక్షనూ వ్యక్తం చేస్తుంది. కాగా ఈనెల 11న స్విగ్గీ తమ సంస్థకు చెందిన ఫుల్ టైం ఉద్యోగుల కోసం 'పా-టర్నిటీ పాలసీ'ని ప్రవేశపెట్టింది. ఇది పెట్స్ కలిగి ఉన్న సంస్థ ఉద్యోగులకు వివిధ ప్రయోజనాలను కల్పిస్తుంది. ఈ మేరకు పెంపుడు జంతువును అడాప్ట్ చేసుకునేందుకు సెలవు ఇవ్వడం, తీసుకున్న పెట్స్ సంబంధిత వాతావరణానికి అలవాటు పడేదాకా ఇంటి నుంచే పని (వర్క్ ఫ్రం హోం) చేసే అవకాశం కల్పించడం వంటి వెసులుబాటు ఉంటుంది.



తెలంగాణలో వ్యాపారం చేయలేవ్

- ఢిల్లీలోనూ వ్యాపారానికి నష్టం చేస్తానంటూ శరత్ చంద్రారెడ్డిని బెదిరించిన కవిత!
- రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపిన సీబీఐ
- భూమి కొనుగోలు పేరుతో కవితకు రూ.14 కోట్లు చెల్లించిన శరత్ చంద్రారెడ్డి
- జాగృతి సంస్థకూ రూ.80 లక్షల చెల్లింపు
- ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత కీలక పాత్ర
- కస్టడీ రిపోర్టులో వెల్లడించిన సీబీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు ప్రధాన కుట్రదారుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యక్తిగా సీబీఐ పేర్కొంది. అరబిందో గ్రూప్‌కు చెందిన శరత్ చంద్రారెడ్డికి ఐదు మద్యం రిటైల్ జోన్లు దక్కడంలో ఆమె కీలకంగా వ్యవహరించారని తెలిపింది. ఇందుకు బదులుగా ఆయన నుంచి కవిత ఆర్థిక లబ్ధి పొందారని న్యాయస్థానానికి వెల్లడించింది. పైగా.. తాను చెప్పిన మొత్తం ఇవ్వకపోతే తెలంగాణలో వ్యాపారం చేయలేవంటూ శరత్ చంద్రారెడ్డిని ఆమె బెదిరించారని, ఢిల్లీలో కూడా ఆయన వ్యాపారానికి నష్టం చేస్తానని హెచ్చరించారని తమ కస్టడీ రిపోర్టులో సీబీఐ పేర్కొంది. కవితను ఎందుకు విచారించాలనుకుంటున్నదీ రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సీబీఐ వివరించింది. 2021-22 ఢిల్లీ మద్యం విధానం ప్రకారం ఒకే సంస్థకు రెండు రిటైల్ జోన్ల కంటే ఎక్కువ కేటాయించరాదని, కానీ.. మూడు సంస్థలకు ఐదు జోన్లు కేటాయించారని, ఈ మూడు సంస్థలూ శరత్ చంద్రారెడ్డి డైరెక్టర్‌గా ఉన్న అరబిందో ఫార్మా గ్రూప్‌కు సంబంధించినవేనని సీబీఐ వెల్లడించింది. ఈ ఐదు జోన్లు తనకు దక్కినందుకు బదులుగా కవిత నుంచి రూ.14 కోట్ల విలువైన వ్యవసాయ భూమిని శరత్ చంద్రారెడ్డి కొనుగోలు చేసినట్టుగా ఒప్పందం జరిగినట్లు తెలిపింది. మహబూబ్‌నగర్‌లో ఉన్న ఈ భూమిని కొనుగోలు చేసేందుకు సేల్ అగ్రిమెంట్ కుదుర్చుకోవాల్సిందిగా శరత్ చంద్రారెడ్డిపై కవిత ఒత్తిడి చేశారని పేర్కొంది. ఆ భూమిని కొనడం తనకు ఇష్టంలేదని, దాని విలువ ఏమిటో కూడా తనకు తెలియదని శరత్ చంద్రారెడ్డి చెప్పినప్పటికీ.. వెంటనే రూ.14 కోట్లు చెల్లించాలని ఆమె డిమాండ్ చేసినట్టు వెల్లడించింది. దీంతో అరబిందో గ్రూపునకు చెందిన మహిరా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఈ మొత్తం చెల్లించి భూమి కొనుగోలు చేయక తప్పలేదని శరత్ చంద్రారెడ్డి చెప్పినట్లు సీబీఐ వివరించింది. ఇందులో రూ.7 కోట్లు 2021 జూలైలోనూ, మరో రూ.7 కోట్లు నవంబరులోనూ చెల్లించినట్టు ఆధారాలు లభించాయని తెలిపింది. అయితే ఆ తరువాత ఆ భూమి బదలాయింపు జరగలేదని వెల్లడించింది. మరోవైపు శరత్ చంద్రారెడ్డికి చెందిన ఐదు రిటైల్ జోన్ల కోసం ఒక్కో జోన్‌కు రూ.5 కోట్ల చొప్పున రూ.25 కోట్లు చెల్లించాలని కూడా కవిత ఆయనకు తెలిపారని సీబీఐ పేర్కొంది. ఒక దశలో ఈ మొత్తం చెల్లించేందుకు శరత్ చంద్రారెడ్డి విముఖత వ్యక్తం చేశారని, అయితే తాను చెప్పినట్టు వినకపోతే తెలంగాణలో వ్యాపారం ఎలా చేస్తావని, ఢిల్లీలో కూడా వ్యాపారానికి నష్టం చేస్తానని ఆయనను కవిత బెదిరించినట్టు సీబీఐ వెల్లడించింది. అంతేకాకుండా కవితకు చెందిన తెలంగాణ జాగృతి సంస్థకు కూడా సీఎస్ఆర్ కింద శరత్ చంద్రారెడ్డి రూ.80 లక్షలు బదిలీ చేశారని తెలిపింది.

కవితకు వ్యతిరేకంగా అనేక సాక్ష్యాలు..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు వ్యతిరేకంగా అనేక సాక్ష్యాధారాలు వెల్లడయ్యాయని సీబీఐ పేర్కొంది. కవితను ఈ సాక్ష్యాధారాల గురించి జైలుకు వెళ్లి ప్రశ్నించామని, అయితే తాము వేసిన ప్రశ్నలకు ఆమె సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వనందువల్లే తమ కస్టడీలో ఇంటరాగేషన్ చేయాలని నిర్ణయించామని వివరించింది.

అనేక పత్రాలు లభించాయి..

ఢిల్లీ మద్యం కుంభకోణం గురించి మొదటినుంచి జరిగిన పరిణామాలను వివరించిన సీబీఐ.. నిందితుడు బుచ్చిబాబు గోరంట్ల మొబైల్ ఫోన్లలో లభించిన వాట్సాప్ సంభాషణలు, సాక్షులు, అప్రూవర్ల స్టేట్‌మెంట్ల తర్వాత కల్వకుంట్ల కవిత పాత్ర బయటకు వచ్చిందని తెలిపింది. భూమి కుంభకోణం పేరుతో డబ్బు మళ్లింపునకు సంబంధించిన పత్రాలు కూడా తమకు లభించాయని వెల్లడించింది.

ఇండో స్పిరిట్‌లో కవితకు భాగస్వామ్యం..

విజయ్ నాయర్ కు రూ.90-100 కోట్లు చెల్లించామని, అందులో రూ.30 కోట్లు హవాలా ద్వారా మళ్లించామని అభిషేక్ బోయినపల్లి తనకు చెప్పినట్టు అప్రూవర్ దినేశ్ అరోరా వెల్లడించారని సీబీఐ తెలిపింది. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్న చారియట్ మీడియా సంస్థకు చెందిన రాజేష్ జోషి ఈ డబ్బు తీసుకున్నారని, ఢిల్లీ నుంచి ఈ డబ్బును హవాలా ద్వారా మళ్లించినట్టు హవాలా ఆపరేటర్లు కూడా ఒప్పుకొన్నారని వెల్లడించింది. అభిషేక్ బోయినపల్లి ఆదేశాల మేరకు తాను పెద్దఎత్తున నగదును మళ్లించినట్టు కవిత పీఏ అశోక్ కౌశిక్ చెప్పిన విషయాన్నీ సీబీఐ వెల్లడించింది. తన బినామీ అరుణ్ పిళ్లై ద్వారా ఇండో స్పిరిట్ హోల్ సేల్ లైసెన్స్‌లో కవితకు భాగస్వామ్యం ఉందని, సీఏ బుచ్చిబాబు, కవితకు మధ్య మొబైల్ ఫోన్లలో జరిగిన సంభాషణ ద్వారా ఈ విషయం తేలిందని సీబీఐ పేర్కొంది.

ఇండో స్పిరిట్‌కు చెల్లించాల్సిన డబ్బు.. కవితకు!

2022 ఆగస్టు 31న ఢిల్లీ మద్యం విధానాన్ని ఉపసంహరించుకున్నప్పుడు ఇండో స్పిరిట్‌కు రూ.60 కోట్లు చెల్లించాల్సి ఉందని సీబీఐ పేర్కొంది. అయితే ఆ డబ్బును ఆ సంస్థకు కాకుండా కవితకే చెల్లించాలని శరత్ చంద్రారెడ్డికి అరుణ్ పిళ్లై చెప్పినట్టు తెలిపింది. తాను చెల్లించిన రూ.100 కోట్లను తిరిగి సంపాదించుకోవాలని కవిత భావిస్తున్నట్లుగా శరత్ చంద్రారెడ్డి చెప్పారని సీబీఐ తెలిపింది. వీరి స్టేట్‌మెంట్ల తర్వాతే కవిత పాత్ర స్పష్టంగా తేలిందని పేర్కొంది.

అమెరికాలో భారత విద్యార్థుల మృతిపై విచారణ


- వెల్లడించిన విదేశాంగ శాఖ
- ఓ తెలుగు విద్యార్థి మృతిపైనా విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: అమెరికాలో ఇద్దరు భారత విద్యార్థుల మృతిపై విచారణ జరుగుతున్నట్లు భారత విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. సంబంధిత అధికారుల దృష్టికి భారత విద్యార్థుల మృతి విషయం తీసుకువెళుతున్నట్లు తెలిపింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌దీప్ జైశ్వాల్ శుక్రవారం మాట్లాడుతూ... అమెరికాలో దురదృష్టకర పరిస్థితుల్లో జనవరి నుంచి 10 మంది భారత విద్యార్థులు మృతి చెందారని చెప్పారు. వారి మరణాల వెనుక అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. శాంతి భద్రతల సమస్యలతోపాటు జాతుల సమస్యలు, ఇతర కారణాలు ఉన్నాయన్నారు. అలాగే ఆత్మహత్య మానసిక సమస్యలూ ఇందుకు దారితీశాయన్నారు. భారత కాన్సులేట్లు విద్యార్థులకు చేయగలిగినంత సాయం చేస్తున్నాయని చెప్పారు. భారత విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాన్సులేట్లు, భారత ఎంబసీ అందించే సాయం వివరాలు వారికి తెలిసేలా తగు ఏర్పాట్లు చేశామన్నారు.

అమెరికాలో పెరుగుతున్న టెక్ నియామకాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఉద్యోగాల ఊచకోతతో ఆందోళన చెందుతున్న టెకీలకు శుభవార్త! కరోనా కల్లోలం తర్వాత భారీగా ఉద్యోగులపై వేటు వేసిన అమెరికా టెక్ దిగ్గజాలు.. తిరిగి నియామకాలు ప్రారంభించాయి. అధికారిక గణాంకాల ప్రకారమే గత నెలలో యూఎస్‌లోని దిగ్గజ ఐటీ కంపెనీలు ఆరువేల మందిని నియమించినట్టు 'కంప్యూటింగ్ టెక్నాలజీ ఇండస్ట్రీ అసోసియేషన్' వెల్లడించింది. టెక్నాలజీ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ ఇన్‌ఫ్రా రంగాల్లో నియామకాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పేర్కొంది. అమెరికాలోని టెక్ కంపెనీలు మార్చి నెలలో 1,91,000 కొత్త ఉద్యోగాలను ప్రకటించాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఆ సంఖ్య 8000 అధికం. 2023 ఆగస్టు నుంచి ఇదే అత్యధికం. భారతదేశానికి చెందిన పలు ఐటీ కంపెనీలు అమెరికాలో తమ ఉనికిని బలంగా చాటుకుంటున్న సంగతి తెలిసిందే. వాటిలో టీసీఎస్ కంపెనీకి అక్కడ 50 వేల మంది ఉద్యోగులున్నారు. అలాగే ఇన్ఫోసిస్‌కు 35 వేల మంది, హెచ్‌సీఎల్‌కు 24 వేల మంది, విప్రోకు 20 వేల మంది, ఎల్‌టీఐ మైండ్ ట్రీకి 6500 మంది ఉద్యోగులున్నారు. ఓ నివేదిక ప్రకారం.. 2023లో అమెరికాలో టెక్ నియామకాలు 1.2 శాతం పెరిగాయి. కాంప్‌టీఏ అంచనాల ప్రకారం 2024లో అమెరికాలో టెక్ ఉద్యోగుల సంఖ్య 3.1 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. నియామకాల ట్రెండ్ ఇలాగే కొనసాగితే ఎక్కువగా లాభపడేది భారతీయులే.

ఆస్తులు కాదు.. వృద్ధుల సంరక్షణే లక్ష్యం



- అందుకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలి
- సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌పై బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబయి, ఏప్రిల్ 12: పిల్లలకు తాము బహుమతిగా ఇచ్చిన ఇళ్లల్లో వృద్ధ తల్లితండ్రులు నివసించేలా చూడడమే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ ప్రధాన ఉద్దేశమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. అంతేతప్ప తల్లిదండ్రులు ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయించడం ఈ చట్టం అసలు లక్ష్యం కాదని తెలిపింది. దీన్ని పరిగణనలోకి తీసుకొని ట్రైబ్యునళ్లు నిర్ణయాలను వెలువరించాల్సి ఉంటుందని పేర్కొంది. వృద్ధుడైన తండ్రిని సక్రమంగా చూసుకోవడం లేదన్న కారణంతో ఓ కుమారుడ్ని శిక్షిస్తూ మెయింటనెన్స్ ట్రైబ్యునల్ ఫర్ సీనియర్ సిటిజన్స్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కారణంతో ఆ కుమారునికి తండ్రి ఇచ్చిన మూడు గిఫ్ట్ డీడ్‌లను ట్రైబ్యునల్ రద్దు చేసింది. అంతేకాకుండా తండ్రి సంపాదించిన ఇల్లును ఖాళీ చేయాలని కూడా ఆదేశించింది. హైకోర్టు మాత్రం.. ఇలాంటి సందర్భాల్లో వృద్ధ తండ్రి సంరక్షణే ప్రధాన అంశంగా ఉండాలి తప్ప, గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయించడం కాదంటూ ట్రైబ్యునల్ ఆదేశాలను పక్కన పెట్టింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.మార్నే తీర్పు వెలువరించారు. అదే సమయంలో తండ్రి విడిగా నివసించవచ్చని, ఆయన పోషణ కోసం కుమారుడు నెలవారీ భృతి చెల్లించాల్సి ఉంటుందని ఆదేశించారు. ముంబయికి చెందిన ఓ వ్యక్తికి ముగ్గురు కుమారులు కాగా, భార్య చనిపోయింది. ముంబయిలోని ఖండవిలీలో నివసిస్తున్న చిన్న కుమారుని వద్ద ఉంటున్నాడు. ఖండివిలీలోని రెండు ఫ్లాట్లు, అంధేరీలోని ఒక ఫ్లాటును చిన్న కుమారునికి గిఫ్ట్ డీడ్‌గా రాసి ఇచ్చాడు. గిఫ్ట్ డీడ్ రాసిచ్చిన తరువాత ఆ కుటుంబం ప్రవర్తనలో మార్పు వచ్చింది. తండ్రితో కలిసి ఉండడానికి ఆయన ఇష్టపడుతున్నా భార్య, పిల్లలు మాత్రం అంగీకరించడం లేదు. దాంతో ఆయన గుజరాత్‌లో ఉంటున్న మరో కుమారుని వద్దకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ తండ్రి 2021 ఏప్రిల్‌లో ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాడు. 2003 అక్టోబరులో నిర్ణయాన్ని వెలువరించిన ట్రైబ్యునల్ కుమారుని పేరున రాసిన మూడు గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేసింది. ఖండివిలీలోని రెండు ఫ్లాట్లను ఖాళీ చేసి కుటుంబంతో సహా వెళ్లిపోవాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఆ కుమారుడు హైకోర్టులో అప్పీలు చేశాడు. గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేసే అధికారం ట్రైబ్యునల్ మేజిస్ట్రేట్‌కు లేదని వాదించాడు. అంధేరీలోని ఫ్లాటులో తనకు మూడో వంతు వాటా ఉందని, అలాంటప్పుడు దాన్ని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. వాదనలు విన్న జస్టిస్ మార్నే సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 23(1) ప్రకారం వృద్ధులను సక్రమంగా చూసుకోనప్పుడు వారిచ్చిన బహుమతులను రద్దు చేసుకునే అధికారం ఉందని తెలిపారు. అయితే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం సంక్షేమమని, అందువల్ల వృద్ధుల సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆస్తి తగాదాలను పరిష్కరించుకోవడం అసలు లక్ష్యం కాదని తెలిపారు. వాస్తవాలను గమనించి అంధేరీ ఫ్లాట్‌లో ఆ తండ్రి విడిగా ఉండాలని, ఆయనకు కుమారుడు నెలవారీ రూ.25 వేలు చెల్లించాలని ఆదేశించారు. ఆస్తులను పొందిన కుమారులు తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలన్న ఉద్దేశంతోనే సెక్షన్ 23(1)ని పొందుపరిచారని, దాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తున్నారని రుజువైతే మాత్రం గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయవచ్చని చెప్పారు.

ఆధారాలు ఉంటే తప్ప కింది కోర్టు తీర్పును కొట్టేయకూడదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: నేరంలో మరో కోణం ఉండొచ్చన్న భావనతో కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను అప్పిలేట్ కోర్టులు కొట్టివేయలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుడ్ని నిర్దోషిగా గుర్తిస్తూ కింది కోర్టు తీర్పులో లోపాలు ఉన్నాయనడానికి ఆధారాలు ఉంటేనే దాన్ని కొట్టివేయవచ్చని, లేకుంటే జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. ఓ హత్య కేసులో నిందితులు నిర్దోషులంటూ ట్రయల్ కోర్టు విడుదల చేయగా, ఆ తీర్పును హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని పక్కనపెట్టింది. నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పులపై అప్పీళ్లు వస్తే ఉన్నత న్యాయస్థానం తొలుత సాక్ష్యాలను పునఃపరిశీలన జరపాల్సి ఉంటుందని తెలిపింది. పునఃపరిశీలన జరిపే సమయంలో.. తన ఎదుట ఉన్న సాక్ష్యాలను ఆధారం చేసుకొని ట్రయల్ కోర్టు న్యాయబద్ధమైన అభిప్రాయాన్ని ఏర్పరుచుకుందా లేదా అన్నదాన్ని మొదట గమనించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత కేసులో హైకోర్టు ఈ పని చేసినట్టు కనిపించడం లేదని అభిప్రాయపడింది. నేరం చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితునిపై ఉందని హైకోర్టు వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొంది. కొత్త సాక్ష్యాలు లేకుండా ట్రయల్ కోర్టు తీర్పును తిరస్కరించకూడదంటూ స్పష్టం చేసింది.

బీసీవై పార్టీ వాహనాలొస్తే కాల్చేస్తాం

- ప్రచార వాహనాలను ధ్వంసం చేసిన పెద్దిరెడ్డి అనుచరులు
- నేతలపైనా దాడి.. చిత్తూరు జిల్లాలో ఘటన


బీసీవై పార్టీ నేత ఆనందరెడ్డిపై దాడి చేస్తున్న హరినాథరెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 12: 'మా గ్రామానికి బీసీవై పార్టీ వాహనాలు రాకూడదు. ఒకవేళ వస్తే పెట్రోల్ పోసి కాల్చేస్తాం' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు అల్టిమేటం జారీ చేశారు. చిత్తూరు జిల్లా సదుం మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ చిలకపాటివారిపల్లెకు శుక్రవారం సాయంత్రం వచ్చిన బీసీవైపీ వాహనాలను ధ్వంసం చేశారు. ఆ పార్టీ నేతలపైనా దాడి చేశారు. బీసీవై పార్టీ నాయకులు ఆనందరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ.. సదుం, పులిచెర్ల మండలాల్లో తమ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారానికి పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి అనుమతి పొందామన్నారు. రాత్రివేళ ఈ వాహనాలను ఆనందరెడ్డి ఇంటి వద్ద పెట్టుకునేందుకు చిలకపాటివారిపల్లెకు తీసుకొచ్చామని తెలిపారు. గ్రామంలోకి రాగానే వైసీపీ నాయకుడు హరినాథరెడ్డి, మరికొందరు నేతలు, కార్యకర్తలు కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. తమను దుర్భాషలాడారన్నారు. గ్రామం నుంచి వెంటనే వెళ్లిపోకుంటే చంపేస్తామని బెదిరించారన్నారు. ఆనందరెడ్డి ఇంటిపైనా రాళ్లు వేశారన్నారు. వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడానికి ప్రయత్నించగా.. అప్పటికే తమ సమాచారంతో అక్కడికి వచ్చిన పోలీసులు వారిని అడ్డుకున్నట్లు తెలిపారు. కాగా, విచారణ పేరిట పోలీసులు ఆనందరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డిని పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు. నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అనుచరులు చేస్తున్న దాడులు, వాహనాల ధ్వంసం చేసిన సంఘటనపై రామచంద్రయాదవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ రవికుమార్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ రవికుమార్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. అలాగే తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి, ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

కళాశాల బస్సు బీభత్సం

- బైకులు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకెళ్లిన వాహనం
- బాలుడు మృతి, పది మందికి తీవ్ర గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం



ద్విచక్ర వాహనాలు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకువెళ్లిన బస్సు

కశింకోట, ఏప్రిల్ 12: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం వద్ద అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు శుక్రవారం బీభత్సం సృష్టించింది. అతివేగంగా మూడు బైకులు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ ఎం.వి నోద్‌బాబు కథనం మేరకు.. అనకాపల్లి నుంచి మాకవరపాలెం వెళుతున్న అవంతి ఇంజనీరింగ్ కళాశాల బస్సు శుక్రవారం ఉదయం 9.15 గంటల సమయంలో బయ్యవరం సమీపంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పింది. రోడ్డుకు ఎడమవైపు నిలిపి ఉన్న మూడు బైకులను, ఆపై ఒక కారును ఢీకొంది. విశాఖ జిల్లా పెందుర్తి నుంచి పిఠాపురం దర్గాకు కారులో వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు బయ్యవరంలో టిఫిన్ సెంటర్ వద్ద ఆగారు. ఇంతలో బస్సు దూసుకువెళ్లడంతో షేక్ గౌస్ మొహిద్దీన్ (12) అక్కడికక్కడే మృతిచెందగా, ఆ సమయంలో అక్కడున్న పది మంది గాయపడ్డారు. వీరిలో రామకృష్ణ, మున్నీ బేగమ్ పరిస్థితి విషమంగా ఉంది.

సీఏఏపై సంఘ్, బీజేపీల మాదిరే కాంగ్రెస్: విజయన్

తిరువనంతపురం, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం కూడా సంఘ్ పరివార్, బీజేపీ మాదిరే ఉందని కేరళ సీఎం, సీపీఎం నేత పినరయి విజయన్ అన్నారు. సీఏఏపై కాంగ్రెస్ మౌనమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. సీఏఏని వ్యతిరేకిస్తూ తొలుత వామపక్షంతో గొంతు కలిపిన కాంగ్రెస్ కేరళ యూనిట్ నేతలు ఆ తర్వాత ఆ పార్టీ అధిష్ఠానం సూచనతో తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని ఆరోపించారు. సీఏఏపై రాహుల్‌గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. తన ఎన్నికల ప్రణాళికలో కూడా సీఏఏపై వైఖరేంటో కాంగ్రెస్ వెల్లడించలేదని ఆయన గుర్తు చేశారు.

ఇజ్రాయెల్, ఇరాన్‌లకు ప్రయాణం వద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలకు ప్రయాణం చేయవద్దని భారత పౌరులకు సూచించింది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ప్రస్తుతం నివసిస్తున్న భారతీయులు అక్కడి భారతీయ రాయబార కార్యాలయాలతో టచ్‌లో ఉండాలని, అలాగే తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొంది. పౌరులు తమ భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని, బయటకు వెళ్లడాన్ని బాగా తగ్గించుకోవాలని తెలిపింది.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 13 ఏప్రిల్ 2024

ఫన్ మెసేజింగ్‌కు టిప్స్

మెసేజింగ్‌లో కొత్త పుంతలు తొక్కే వాట్సాప్ తాజాగా ప్రాక్టికల్ టిప్స్ అందించింది. వాట్సాప్‌నకు సంబంధించిన రిచ్ ఫీచర్లను చాలా సులువుగా అందిపుచ్చుకోవడం నుంచి డిసప్పియరింగ్ మెసేజెస్, చాట్ వాల్‌పేపర్స్ కస్టమైజేషన్ వరకు వివిధ పనులకు ఈ టిప్స్ ఉపయోగపడనున్నాయి. అవేంటంటే...

- డిజెపియరింగ్ మెసేజెస్ మొదటిది. 24 గంటలు అంటే ఒక రోజు నుంచి వారం, 90 దినాల వరకు పంపిన మెసేజ్‌లు వాటంతట అవే అదృశ్యమయ్యేలా చూడటం సెండర్ చేతిలోనే ఉంటుంది. అయితే రిసీవర్ మెసేజ్ చూసినప్పటి నుంచి గడువు కౌంట్‌లోకి వస్తుంది.
- వన్ టు వన్ కాల్స్‌లో 32 మంది వరకు పాల్గొనవచ్చు. ఆడియో, వీడియో కాల్స్ మధ్య పెద్దగా కష్టపడకుండానే టోగెల్ చేసే అవకాశం యూజర్‌కు ఉంది. అందుకు డిఫాల్ట్‌గా కెమెరాకు తోడు దానికి స్విచ్ అయ్యే ఆప్షన్ అవతలివైపు వ్యక్తికి ఉండాలి.
- పర్సనలైజ్ చాట్ వాల్‌పేపర్ మరొకటి. విజువల్ అప్పీల్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. వీటికి తోడు వాట్సాప్ టెంప్లేట్స్, పర్సనల్ ఇమేజ్‌లను ఎంచుకునే వీలు ఉంటుంది. డిమ్మింగ్‌తో రీడబిలిటీని పెంచుకునే వీలు డార్క్‌మోడ్ యూజర్లకు ఉంటుంది.
- ప్రైవసీ సెట్టింగ్స్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ స్టేటస్, ప్రొఫైల్ ఇన్ఫర్మేషన్, విజిబిలిటీ, రీడ్ రిసీట్స్, గ్రూప్ ఇన్వైట్స్ తదితరాల విషయంలో ప్రైవసీ కంట్రోల్ విషయంలో కస్టమైజింగ్ సెట్టింగ్స్ చేసుకోవచ్చు. సెట్టింగ్స్ మెనూతో ఈ కంట్రోల్స్‌ను పొందవచ్చు.
- డేటా వినియోగం, మానిటరింగ్‌లోనూ యూజర్ సమర్థంగా పనిచేసుకోవచ్చు. స్టోరేజ్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ యూసేజ్ వీక్షణ, అడ్జస్ట్ మీడియా, ఆటో డౌన్‌లోడ్ సెట్టింగ్స్, మీడియా అప్‌లోడ్ క్వాలిటీ పెంపు, పారదర్శకతకు అవకాశం ఉంటుంది.





పేమెంట్‌తోనే విండోస్ 10 అప్డేట్స్!

మైక్రోసాఫ్ట్ - విండోస్ 10 యూజర్లకు 2025 అక్టోబర్ 14 నుంచి సపోర్టు ఉండదు. అయితే ఇంకా అదే ఆపరేటింగ్ సిస్టమ్ కావాలనుకునే వారికి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్డేట్స్(ఈఎస్‌యూ) ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ కింద మొదటి ఏడాది 61 డాలర్లు చెల్లించాలి. రెండో ఏడాది రెట్టింపు అంటే 122 డాలర్లు, మూడో ఏడాదికి 244 డాలర్లు చెల్లించాలి. వ్యక్తులకైనా, బిజినెస్ సముదాయాలకైనా ఇదే ఫీజు వర్తిస్తుంది. నిర్దేశిత తేదీ తరవాత విండోస్ 10 డివైజ్‌కు ఈఎస్‌యూ లైసెన్స్ తప్పనిసరి. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ఆధారిత అప్డేట్ సొల్యూషన్స్ అంటే ఇన్‌ట్యూన్ లేదా విండోస్ ఆటోప్యాచ్‌కు మాత్రం అయిదు డివైజ్‌ల వరకు 25 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. విండోస్ 365 ద్వారా విండోస్ 11 క్లౌడ్ పీసీలకు కనెక్ట్ అయితే లైసెన్స్ ఫీజు ఉండదు. అది 365 చందాలోనే కలగలుస్తుంది. దీంతో ముఖ్యంగా స్కూల్స్ ప్రయోజనం పొందనున్నాయి. వాటికి మొదటి ఏడాది ఒక డాలరు, రెండో ఏడాది రెండు డాలర్లు, మూడో ఏడాది నాలుగు డాలర్లుగా ఫీజు ఉంటుంది. ఈఎస్‌యూ అనేది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. అయితే విండోస్ 11కు మారేందుకు యూజర్లు హార్డ్‌వేర్‌పరంగా కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అందుకు అనుగుణంగానే ఈ తాత్కాలిక పరిష్కారాన్ని మైక్రోసాఫ్ట్ అమలు చేయనుంది.



అకౌంట్స్ నిషేధంలో కొత్త రికార్డు

వాట్సాప్ - ఇండియాకు చెందిన అకౌంట్ల నిషేధంలో కొత్త రికార్డు నెలకొల్పింది. స్పామ్ మెసేజ్‌లు, ఫేక్ న్యూస్‌ని అందించేవి పెరుగుతున్నాయని ఈ పరిణామం చెబుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అసలీ ధోరణి ఆందోళనకరమని కూడా అంటున్నారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే ఇండియాలో 7.6 మిలియన్ల అకౌంట్లను వాట్సాప్ నిషేధించింది. ఐటీ రూల్స్ 2021ని అతిక్రమించినందున ఈ చర్య చేపట్టాల్సి వచ్చిందని, తొలగించిన వాటిలో ఎక్కువగా స్పామ్ మెసేజ్‌లు, ఫేక్ న్యూస్‌ని అందించేవే ఉన్నాయని వివరించింది. తొలగించిన వాటిలో 14,24,000 క్రియాశీలంగా ఉన్న అకౌంట్లు కావడం గమనార్హం. ప్రతి నెల విడుదల చేసే నివేదికలో భాగంగా ఈ విషయాలను వాట్సాప్ పొందుపరిచింది.

ఇదిలా ఉండగా చాట్ సంభాషణలను వాట్సాప్ ఆరంభిస్తున్నట్టు డబ్ల్యుఏబేటాఇన్ఫో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్ బీటా టెస్టర్లకు అందుబాటులో ఉందని కూడా తెలిపింది.

ఒప్పోలో 'ఏఐ ఎరేజర్'

ఒప్పో ప్రత్యేకించి ఏఐ ఎరేజర్‌ని విడుదల చేసింది. ఇదో ఫొటో ఎడిటింగ్ టూల్. ఫొటో అనవసరమైన మెటీరియల్‌ను తొలగించడమే కాకుండా నేపథ్యాన్ని సహజంగా మలుచుకునేందుకు ఉపయోగపడుతుంది. ఒప్పో విడుదల చేసిన మొట్టమొదటి ఏఐ టూల్ ఇది. వన్‌ప్లస్ మేజిక్ ఎరేజర్ మాదిరిగానే ఇది పనిచేస్తుంది. ఒప్పో రెనో 11 సిరీస్ స్మార్ట్ ఫోన్లకు దీన్ని త్వరలో విడుదల చేయనుంది. అలాగే ఒప్పో స్మార్ట్‌ఫోన్లలో అర్హమైన వాటికీ ఎరేజర్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ ఫొటో ఎడిటింగ్ టూల్‌కి జనరేటివ్ ఏఐ టెక్నాలజీ సపోర్ట్ ఉంటుంది. ఇదే అనవసరమైన మెటీరియల్ తొలగింపులో సహాయపడుతుంది. కలర్ ఓఎస్ 14తో రన్ అయ్యే ఒప్పో స్మార్ట్‌ఫోన్లలో ఇది ఉంటుంది. ఇటీవల మార్కెట్లోకి తెచ్చిన వన్‌ప్లస్ 12, వన్‌ప్లస్ 11ఆర్‌లలో ఈ టూల్ ఉంది. ఫొటో యాప్‌తో టూల్‌ని యాక్సెస్ చేసుకోవచ్చు. దీన్ని ఉపయోగించుకునేందుకు మాత్రం యాక్టివ్ ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం. సరిగ్గా ఇలాంటి టూల్ గెలాక్సీ ఎస్23/24, గెలాక్సీ ఏఐ ఫీచర్స్ కలిగిన వన్‌యూఐ 6.1 లోనూ ఉంది.



బీబీకే ఎలక్ట్రానిక్స్ ఫోన్‌లకు ఫింగర్‌ప్రింట్ సెన్సర్స్



బీబీకే ఎలక్ట్రానిక్స్ గొడుగు కింద ఉన్న వన్‌ప్లస్, ఒప్పో, రియల్‌మి స్మార్ట్‌ఫోన్లకు బయోమెట్రిక్ అథెంటికేషన్ స్థానే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్లను రానున్నాయి. సదరు కంపెనీల నుంచి మున్ముందు వచ్చే ఫోన్లలో ఈ మార్పు ఉంటుంది. 'వైబో'లో పోస్టు పెట్టిన టిప్‌స్టర్ దీనికి డిజిటల్ చాట్ స్టేషన్ అని పేరు పెట్టారు. ఈ సెన్సర్లు ప్రత్యేకించి అల్ట్రాసోనిక్ సౌండ్ వేవ్స్‌ను ఉపయోగించుకుంటాయి. దాంతో చాలా వివరంగా 3డి మ్యాప్ సాధ్యమవుతుంది. ఈ పద్ధతిలో మోసగించడానికి అస్కారం తక్కువ. వాటర్ రెసిస్టెన్స్‌కు వీలుకల్పిస్తుంది. అలాగే ఆప్టికల్ ప్రత్యామ్నాయాలతో పోల్చుకుంటే ఈ సెన్సర్ల ఉత్పత్తి ఖరీదైన వ్యవహారం కూడా. శాంసంగ్ గెలాక్సీ ఎస్23, ఐకూ 12 ప్రొ, మెయిజు 21/22 ప్రొ ఇప్పటికే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్లను ఉపయోగిస్తున్నాయి. రాబోయే షావోమీ 15 సిరీస్‌లో స్నాప్‌డ్రాగన్ 8జన్ 4 చిప్‌సెట్ పవర్ ఉంటుందన్న పుకార్లు వినవస్తున్నాయి. గూడిక్స్ సింగిల్-పాయింట్ అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్‌ని ఇన్‌కార్పొరేట్ చేసుకుంటుందని కూడా నివేదికలు చెబుతున్నాయి. మొత్తమ్మీద గుర్తించదగ్గ మార్పు చోటుచేసుకుటోందని చెప్పవచ్చు.



పర్ఫెక్ట్ ఈమెయిల్‌కు ఏఐ సహకారం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూనే ఉంది. ఫలితంగా యూజర్లకు అదనంగా ప్రయోజనాలూ సమకూరుతున్నాయి. ముఖ్యంగా గూగుల్‌కు చెందిన 'జెమిని ఏఐ' ఇప్పుడు జీమెయిల్‌లో పర్సనల్ ఈమెయిల్ సెక్రటరీ అవతారం ఎత్తింది. దీన్ని పర్సనల్ ఈమెయిల్ సెక్రటరీగా ఎలా మలుచుకోవచ్చో చూద్దాం.

- వర్క్‌స్పేస్ ఇంటిగ్రేషన్ అందులో మొదటిది. జీమెయిల్ ఇన్‌బాక్స్ నిండిందంటే అది ఉత్పాదకతను చంపుతోందని అర్థం. అయితే జెమినీ ఈ విషయంలో సహాయపడుతుంది. లాస్ట్ మెయిల్‌ని సమ్మరైజ్ చేయమని అని అడిగితే చాలు, దానికి సంబంధించి షార్ట్ వెర్షన్‌ను సమ్మరీ రూపంలో తెలియజేస్తుంది. అదే విధంగా పొందికగా సమాధానం కూడా రూపొందిస్తుంది. ఆఫీస్ బాస్ కాదంటే మరొకరు పంపినవి అందులో ఏమైనా ఉన్నాయా అంటే అవి కూడా షార్ట్‌లిస్ట్ చేస్తుంది. అలా ముఖ్యమైన మెయిల్స్‌ను చాలా తేలికగా గుర్తించవచ్చు. చదవని లేటెస్ట్ మెయిల్ ఏదని కూడా యూజర్ అడిగి తెలుసుకోవచ్చు.
- కొన్ని ఆహ్వానాలను మన్నించలేకపోవచ్చు. అయితే మర్యాదగా తప్పించుకోవడం ఉత్తమ మార్గం. ఆ విషయంలో అందమైన మెసేజ్‌ను జెమినీ ఏఐ సహకారంతో రూపొందించుకోవచ్చు. వాటికి చిరాకుపడాల్సిన పని కూడా ఉండదు.
- ప్రమోషనల్ ఈమెయిల్స్ డ్రాఫ్టింగ్‌లో జెమినీకి చెందిన నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ సహకరిస్తుంది.
- ఈమెయిల్ న్యూస్ లెటర్స్‌తో సభ్యులను ఎంగేజ్ చేయడం నిజంగా పెద్ద తలనొప్పి వ్యవహారం. ప్రొడక్ట్ లేదా సర్వీస్‌పై బోరు కొట్టకుండా మేటర్ రాయడంలోనూ తోడ్పడుతుంది. గత నెల సాధించిన విజయాలు, ప్రొడక్ట్‌తో ఒనగూరే ప్రయోజనాలను పొందపరుస్తూ న్యూస్ లెటర్ డ్రాఫ్టింగ్ పనిని పూర్తి చేసుకోవచ్చు.

మాస్టరింగ్

జెమిని సహకారంతో పర్ఫెక్ట్ ఈమెయిల్స్‌తో పబ్బం గడుపుకోవడం ఒక ఎత్తు. సరిగ్గా అదే ఉపయోగించి అత్యున్నత స్థాయిలో పని పూర్తయ్యేలా చూసుకోవడం మరొక ఎత్తు. అందులో భాగంగా...

- ఇంటర్వ్యూ కాదంటే మరొక విషయమై అడిగినప్పుడు జెమిని ఏఐ తనదైన స్టయిల్లో సమాధానం ఇస్తుంది. ఆ సమాధానం సంతృప్తి కలిగించకుంటే 'రీజనరేట్'పై క్లిక్ చేస్తే ముందు ఇచ్చిన దానికి ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.
- ప్లేస్‌హోల్డర్స్‌తో ఈమెయిల్‌ని కస్టమైజేషన్ చేసుకోవచ్చు. రొటీన్ రిప్లయ్‌లో మనకు కావాల్సిన సమాచారాన్ని కూడా జొప్పించి డ్రాఫ్ట్‌ని అందంగా రూపొందిస్తుంది.
- బాస్‌కు ఇవ్వబోయే సమాధానం బాగోకుంటే, మరింత జవాబుదారీతనం, పొలైట్‌గా రూపొందించు అని అడిగితే మారుస్తుంది. రైట్ టోన్‌లో సమాధానాన్ని తయారుచేస్తుంది.
- కాల్ - టు - యాక్షన్ మరొకటి. మంచి జీమెయిల్ లక్షణం ఇది. అంటే మన జీమెయిల్‌కు సమాధానాన్ని రాబట్టగలగడం అని చెప్పుకోవచ్చు. ఇది కూడా సాధ్యమే.
- సబ్జెక్టులో బలం లేదంటే ఆకట్టుకునే విధంగా ఉంటేనే రిసీవర్ ఓపెన్ చేస్తాడన్నది తెలిసిన సత్యం. అందుకు ఈమెయిల్ కోసం పది సబ్జెక్టు లైన్లు ఇవ్వమని అడగొచ్చు. 50 కేరక్టర్లకు మించకూడదని కూడా చెప్పవచ్చు. అలా జెమినీ ఏఐతో జీమెయిల్‌ని సమర్థంగా ఉపయోగించుకుని ప్రయోజనం పొందవచ్చు.

ఆసస్ ల్యాప్‌టాప్ జెన్‌బుక్ డ్యుయో

ఆసస్ - డ్యూయల్ టచ్ స్క్రీన్ ల్యాప్‌టాప్ 'జెన్‌బుక్ డ్యుయో (యుఎక్స్8406)'ని ఈ నెల 16న ఇండియన్ మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ప్రీ బుకింగ్స్‌ను కూడా మొదలుపెట్టింది. ఫిబ్రవరిలో జరిగిన కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో దీన్ని మొదట ప్రదర్శించింది. ఈ ల్యాప్‌టాప్‌లో ఇంటెల్ కోర్ 9 ప్రాసెసర్ ఉంది. 75 వాట్స్ బ్యాటరీ బ్యాకింగ్ ఉంది. డ్యూయల్ 14- ఇంచీల ఫుల్, హెచ్‌డి, ఓలెడ్ డిస్‌ప్లే, డిటాచబుల్ కీబోర్డ్, బిల్ట్ ఇన్ మెటల్ కిక్ స్టాండ్ ఉన్నాయి. 16జీబీ ర్యామ్, ఒక టీబీ మేరకు స్టోరేజీతో వస్తోంది. సింగిల్ చార్జింగ్‌తో 13 గంటలు పనిచేసుకోవచ్చు. 49 నిమిషాల సేపు చార్జింగ్‌తో 60 శాతం బ్యాటరీ ఫుల్ అవుతుంది. వైఫైకి తోడు బ్లూటూత్ కనెక్టివిటీ, 1080పి వెబ్ కెమెరా కూడా ఉన్నాయి. దీని ధర ఇంకా ప్రకటించ లేదు. అయితే ఆరంభ ధర రూ.1,59,990 ఉండొచ్చని అంటున్నారు.



ఇన్‌స్టాలో ఆడియో స్టోరీస్ డౌన్‌లోడింగ్ ఆప్షన్



ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీలను ఆడియోతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాపీరైట్ కారణంగా ఆడియోను కలపడం కొద్దిగా క్లిష్టమైన వ్యవహారమే. అయినప్పటికీ అలా డౌన్‌లోడ్ చేసుకునేందుకు మార్గం ఉంది. అదెలాగంటే...

- డివైజ్‌లో ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- ప్రొఫైల్ టాప్‌లో స్టోరీలు కనిపిస్తాయి. అక్కడ సొంత స్టోరీని టాప్ చేయాలి. తదుపరి మూడు చుక్కల మెనూని టాప్ చేయాలి.
- మెనూ ఆప్షన్స్ నుంచి 'సేవ్ వీడియో'ని ఎంచుకోవాలి. అప్పుడు ఒక ప్రాంప్ట్ కనిపిస్తుంది. ఆడియో లేకుండా స్టోరీ డౌన్‌లోడ్ అయిందని తెలుపుతుంది.
- ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లోని మెసేజెస్ సెక్షన్‌లోకి వెళ్లాలి. ఎవరైనా యూజర్‌తో కాన్వర్సేషన్‌ను ఓపెన్ చేయాలి.
- చాట్ పరిధిలోనే కెమెరా ఐకాన్‌పై టాప్ చేయాలి. అలా ఫొటో లేదా వీడియోను పంపేందుకు ప్రక్రియను ఆరంభించాలి.
- డివైజ్ గ్యాలరీ నుంచి సేవ్ చేసిన వీడియోను ఎంచుకోవాలి.
- స్టిక్కర్ ఐకాన్‌పై టాప్ చేయాలి. అక్కడ మ్యూజిక్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- వీడియోకు అవసరమైన ట్రాక్‌ను సెర్చ్ చేసుకోవాలి. అది లభించగానే నిడివికి తోడు కట్ చేయాలని భావిస్తున్న భాగాన్ని ఎంచుకోవాలి. ఆపై 'డన్'ని టాప్ చేస్తే సరిపోతుంది.
- స్క్రీన్ లెఫ్ట్ కార్నర్‌లో 'కీప్ ఇన్ చాట్' ఆప్షన్‌ని టిక్ చేయాలి. అలా రిప్లే, వాయిస్ వన్ ఆప్షన్లను కూడా ఎంచుకోవాలి.
- సెండ్ బటన్‌ను టాప్ చేసి ఎవరికైనా పంపుకోవచ్చు.
- వీడియోను పంపిన తరవాత దాన్ని టాప్‌తో హోల్డ్ చేస్తే ఇతర ఆప్షన్స్ అక్కడ కనిపిస్తాయి. అందులో నుంచి సేవ్‌ని సెలక్ట్ చేసుకుంటే సరిపోతుంది. అక్కడితో సరి, విజయవంతంగా ఆడియోతో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ అయినట్టు లెక్క.

డిజి యాత్ర కొత్త యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి




డిజి యాత్ర ఫౌండేషన్ తమ యాప్‌లో మేజర్ మార్పులు చేసింది. అందువల్ల విమానాశ్రయాల్లో దీన్ని ఉపయోగించే వారు, పాత యాప్ తొలగించి కొత్తది డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాస్తవానికి దీని విషయంలో కొంతకాలంగా గందరగోళం చోటుచేసుకుంది. ఆ నేపథ్యంలో కొత్తగా రూపొందిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

ఇందులో భాగంగా మొదట పాత డిజి యాత్ర యాప్‌ను తొలగించాలి. తదుపరి గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ ప్లే స్టోర్ నుంచి డిజి యాత్ర యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై 'న్యూ' అని ఉంటుంది. తరవాత అకౌంట్‌ని రీక్రియేట్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ని సేవ్ లొకేషన్‌లో సేవ్ చేసుకోవాలి.

కొత్తదాంట్లో ట్రావెల్ వివరాలను స్టోర్ చేసుకోవచ్చు. అలాగే యాప్ పరిధిలోనే డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అసలీ మార్పు వెనుక కారణాలను యాప్ నిర్వాహకులు వెల్లడించలేదు. డొమైన్ మార్చినట్టు మాత్రం చెబుతున్నారు. కొత్త యాప్ డెవలపర్ పేరు 'డిజి యాత్ర ఫౌండేషన్' అని ఉంటుంది. ఫిషింగ్ అటాక్స్‌కు గురికాకుండా ఉండేందుకు పేరును జాగ్రత్తగా పరిశీలించుకుని మరీ కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిది.

ఫిషింగ్ మెసేజెస్‌పై గూగుల్ వార్నింగ్!

గూగుల్ - ఫిషింగ్ స్కామ్స్, తెలియకుండా డివైజ్‌ల్లో ఇన్‌స్టాల్ అయ్యే మాల్వేర్‌ల నుంచి రక్షణకుగాను గూగుల్ మెసేజెస్ నుంచి వార్నింగ్ మెసేజ్‌లు వచ్చే ఏర్పాటుపై పని చేస్తున్నట్టు సమాచారం. లింక్‌ని క్లిక్ చేసినప్పుడు నష్టం పొంచి ఉంటే ఈ ఫీచర్ పనిచేస్తుంది. అలా జరిగినప్పుడు వార్నింగ్ మెసేజ్ అందుతుంది. అప్పుడు ఆ మెసేజ్‌పై ఉన్న బాక్స్‌పై టిక్ చేయడం ద్వారా అదనపు రక్షణ పొందవచ్చు. 'పైయూనికావెబ్' ఒక టిప్‌స్టర్ ఈ విషయాన్ని రాశాడు. 'డూ యూ ట్రస్ట్ ద సెండర్' అని వార్నింగ్ వస్తుంది. ఇదో రెండు అంచెల ప్రక్రియ కాగా సదరు లింక్‌పై క్లిక్ చేయవచ్చా కాదా అన్నది యూజర్ తేల్చుకోవచ్చు. అప్పటికీ ముందుకు వెళ్లాలని అనుకుంటే బాక్స్‌లో 'ఐ అండర్‌స్టాండ్ దిస్ లింక్ మే బి హార్మ్‌ఫుల్' అని వస్తుంది. వద్దు అనుకుంటే కేన్సిల్ బటన్‌ని టాప్ చేస్తే సరిపోతుంది. ఫీచర్ ఆర్‌సీఎస్ మోడ్‌లో ఉన్నందున స్టాండర్డ్ ఎస్ఎంఎస్ కూ పని చేస్తుంది. ఈ ఫీచర్ త్వరలోనే ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి ఉందని సమాచారం.





గూగుల్ విడ్స్ ఏఐ వీడియో యాప్!

గూగుల్ కొత్తగా విడ్స్ పేరిట ఏఐ పవర్డ్ వీడియో క్రియేషన్ యాప్‌ని పరిచయం చేస్తోంది. వర్క్‌స్పేస్‌లో భాగంగా దీన్ని కలపనుంది. ఈజీ ఎడిటింగ్ టూల్స్, మల్టిపుల్ స్టాక్ వీడియోలు, ఇమేజ్‌ల సమాహారం ఇది. వీడియో, రైటింగ్, ప్రొడక్షన్, ఎడిటింగ్ అసిస్టెంట్‌గా విడ్స్ ఉపయోగపడుతుంది. గూగుల్ డాక్స్, షీట్స్, స్లయిడ్స్ పక్కన ఇది ఉంటుంది. స్టోరీ టెల్లింగ్ మీడియమ్‌గా పనిచేస్తుంది. సేల్స్‌పర్సన్, హెచ్ఆర్ ఆన్‌బోర్డింగ్ వీడియోస్, ట్రైయినింగ్ వీడియోస్ సహా పలు ప్రయోజనాలకు అవసరమయ్యే వీడియోలను రూపొందించుకోవచ్చు. ఈజీ టు యూజ్ ఇంటర్‌ఫేస్, కొలాబిరేటివ్ ఫీచర్స్, వీడియో షేరింగ్ ఆప్షన్స్ కూడా ఇందులో ఉంటాయి.

- దీని కోసం మొదట టెక్స్ట్ ప్రాంప్ట్ రాసుకోవాలి. ఐడియా సహా లక్ష్యం, ఆడియెన్స్, లెంథ్ వంటి వివరాలు అందులో ఉండాలి.
- @ ఉపయోగించి ప్రాంప్ట్‌తో సంబంధిత డాక్యుమెంట్‌ని అటాచ్ చేయాలి. గూగుల్ డ్రైవ్ నుంచి ఫైల్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- గూగుల్ విడ్ దానంతట అదే స్టయిల్‌బోర్డ్‌ని జనరేట్ చేస్తుంది. యూజర్ తన ప్రాధాన్యాలకు అనుగుణంగా ఎడిట్ లేదా రీఅరేంజ్‌మెంట్స్ అప్పుడు చేసుకోవచ్చు.
- తదుపరి నెక్స్ట్ పేజీకి డైరెక్ట్ అవుతారు. అక్కడ వీడియో స్టయిల్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- మొదట రూపొందించిన డ్రాఫ్ట్‌కు అనుగుణంగా వాటన్నింటినీ విడ్స్ కలిపి ఇస్తుంది. దానికి వాయిస్ ఓవర్‌ను జతచేయవచ్చు. అయితే ఇది ఇంకా రూపకల్పన దశలోనే ఉంది. జూన్‌లో విడుదలయ్యే అవకాశం ఉంది.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ • శనివారం 13 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా

హైదరాబాద్, గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్(ఎస్‌పీజీఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యం ఉంది. మెరిట్ స్కాలర్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కూడా ఉన్నాయి.

స్పెషలైజేషన్లు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సైన్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్స్‌ఏటీ/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in, escihyd.org

విదేశాల్లో చదువుకు కీలకం

లెటర్ ఆఫ్ రికమండేషన్

మంచోడని మన గురించి నలుగురూ చెప్పుకోవాలని అనుకోవడం సర్వ సాధారణం. సగటు మానవుడి సాధారణ కోర్కెగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే దీనికి సంబంధించిన ఆధునిక రూపమే లెటర్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్). ఇక్కడ కాన్సెప్ట్ మంచోడని కాదు, విదేశీ విద్యా సంస్థలో సీటుకు అర్హుడు అని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అది తను చదువుకున్న సంస్థకు చెందిన ప్రొఫెసర్ల వంటి వారు అన్నమాట. మరీ ముఖ్యంగా విదేశాల్లో చదువుకోవాలంటే అవసరమైన పత్రాల్లో ఇది కీలకమైనది అని కూడా చెప్పవచ్చు.



విదేశాల్లో చదవాలని భావించే అభ్యర్థి కేరెక్టర్, డెడికేషన్, అకడమిక్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించి విలువైన విషయాలను ఈ లెటర్ తెలియజేస్తుంది. కాలేజీ ప్రొఫెసర్లు, ఎంప్లాయర్లు మెంటార్లు, విభాగాధిపతులు ఇచ్చే ఈ లెటర్లతో అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది, పోటీతత్వం కూడా తెలుస్తుంది. స్ట్రక్చర్డ్ ఫార్మేట్‌కు తోడు సరైన ఉదాహరణలతో ఉండే లెటర్ ఒక వ్యక్తి స్థిరత్వం తదితరాలను తెలియజేస్తుంది. అకడమిక్ కెరీర్‌లో అభ్యర్థి సాధించిన గ్రేడ్స్, క్రెడిట్స్‌కు మించిన విషయాలు ఈ లెటర్‌లోనే వెల్లడి అవుతాయని కూడా చెప్పవచ్చు. కోరుకున్న కోర్సులో సీటు లభించేందుకు తోడ్పడుతుంది. అభ్యర్థికి ఉన్న విశ్వసనీయత, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా సీటు పొందడానికి ఉన్న అవకాశాలు పెరుగుతాయి. పొందికగా తీర్చిదిద్దిన లెటర్ ఆఫ్ రికమండేషన్ నిజానికి విదేశాల్లో చదవాలని ఆకాంక్షించే అభ్యర్థి లక్ష్యసాధనలో ఇతోధికంగా తోడ్పడుతుంది.

ఎవరితో... ఎందుకు

లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను ఎవరితో రాయించుకోవాలి అన్నది ఒక ప్రశ్న. వివిధ వర్గాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని మదించుకుని మరీ ఆ వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. అలా సిఫార్సు చేయించుకోదగ్గ వ్యక్తుల్లో ప్రొఫెసర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్ లేదా డీన్, ఉద్యోగం చేసి ఉంటే ఎంప్లాయర్, పరిశోధన పర్యవేక్షకుల వరకు అందరూ వస్తారు. మెంటార్లు, కోచ్‌లు, గైడెన్స్ కౌన్సెలర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. అభ్యర్థి నాయకత్వ పటిమ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విషయాలను విస్తారంగా, విపులంగా, వివరంగా వీరు మాత్రమే ప్రస్తావించగలుగుతారు.

అకడమిక్, నాన్ అకడమిక్ అంశాల సమ్మిళితంగా ఉన్న రికమండేషన్ లెటర్, అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను సమగ్రంగా తెలియజేయగలుగుతుంది. రికమండ్ చేసే ప్రతి వ్యక్తి తనదైన కోణంలో అభ్యర్థి సదరు కోర్సు చేసేందుకు ఎలా, ఎందుకు అర్హుడో తెలియజేస్తారు. లెటర్ మాత్రం వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యాసంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

కరెక్ట్ ఫార్మేట్

ఈ లెటర్‌కు సంబంధించినంతవరకు కోర్ ఎలిమెంట్ అంతా ఒక్కటే. ఒక అభ్యర్థి సీటు పొందేందుకు అవసరమైన సిఫార్సు అందులో ఉంటుంది. అయితే కోర్సును బట్టి చిన్నపాటి మార్పులు లెటర్ రాసే తీరులో ఉంటుందని గమనించాలి. ఫార్మేట్, సిఫార్సు చేసే వ్యక్తి - అందుకునే వ్యక్తి కాంటాక్ట్ సమాచారం తదితరాలు యథాతథం. లెటర్‌ను ఉద్దేశించిన వ్యక్తిని గౌరవప్రదంగా సంబోధించడం సహా సాధారణ విషయాలకు తోడు అందులోని కంటెంట్ అభ్యర్థితో తనకు ఉన్న సంబంధాన్ని తెలియజేయాలి. తనకు ఎంత కాలం నుంచి తెలుసు, ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరకంగా అభ్యర్థి వ్యక్తిగత విషయాలకు సంబంధించి తనది భరోసా అన్న విధంగా ఉండాలి.

లెటర్ బాడీలో అభ్యర్థి అర్హతలు, సాధించిన విజయాలు, సంబంధిత అనుభవం, కోర్సులో చేర్చుకునేందుకు అర్హుడు అంటూ తెలియజేసే ఉదాహరణలు ఉండాలి. ఇదంతా చదివితే అభ్యర్థికి ఉన్న బలాలు, నైపుణ్యాలు, కేరక్టర్ తెలియడమే కాదు, ఎంపిక చేసేందుకు దోహదపడాలి. అభ్యర్థి విశ్వసనీయతను పెంచాలి. అలాగే లెటర్ చివరి పేరాలో ముందు చెప్పిన అంశాలను క్రోడీకరించాలి. ఇంకేమైనా సమాచారం అవసరమైతే అది కూడా అందించేందుకు తాను సిద్ధమని కూడా తెలియజేయాలి. లెటర్ రాసిన వ్యక్తి సంతకం, కాంటాక్ట్ సమాచారం చివర్లో ఉండాలి. ప్రొఫెషనల్ సైన్-ఆఫ్‌తో మొత్తం పద్ధతిగా ఉండాలి.

లెటర్ రికమండేషన్ వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యా సంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

ఈ ఆరూ ముఖ్యం

- లెటర్ ఆఫ్ రికమండేషన్స్ ఎన్ని సమర్పించినప్పటికీ అవి అభ్యర్థిలో ఉండే వివిధ కోణాలను చెప్పగలగాలి. విజయాలు, పర్సనాలిటీ అకడమిక్ లేదా ఎక్స్‌ట్రాకరిక్యుల్ సక్సెస్‌ను తెలియజేయగలగాలి. ఉదాహరణకు పరిశోధన నైపుణ్యాలు ఒక లెటర్‌లో ఉంటే మరొక దానిలో తరగతి గదిలో అభ్యర్థి కనబరిచిన సామర్థ్యాలను తెలియజేయాలి.
- రికమండ్ చేసే వ్యక్తికి మీరు తెలిసినప్పటికి సంబంధిత బేసిక్ సమాచారాన్ని అభ్యర్థి అందించాలి. సీవీ, అకడమిక్ జీపీఏలు, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్, లెటర్ సబ్మిషన్‌కు డెడ్‌లైన్ తదితరాలు తెలియజేయాలి. అప్పుడే సదరు రికమెండర్ తన సిఫార్సును చక్కగా డ్రాఫ్ట్ చేయగలరు.
- ఆ లెటర్‌లో ప్రత్యేకించి కొన్ని సందర్భాలు, ఉపాఖ్యానాలు కూడా ఉండాలి. అభ్యర్థి లక్షణాలను తెలియజేసే విధంగా అవి ఉండాలి. లక్షణాలు, నైపుణ్యాలు తదితరాలను కేవలం ధ్రువీకరణలతో సరిపెట్టకూడదు. వాటికి సరైన ఉదాహరణలనూ జోడించాలి. రీసెర్చ్ ప్రాజెక్టుల్లో అనుభవాలు లేదంటే చోటుచేసుకున్న చర్చలను కూడా కలిపితే అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది.
- ఆ లెటర్‌లో అభ్యర్థికి సంబంధించిన బలాలకు తోడు అకడమిక్ ప్రోగ్రెస్, డెవలప్‌మెంట్‌కూ తగు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ అంశాల్లో కచ్చితత్వాన్ని అడ్మిషన్ కమిటీ ఎవాల్యుయేట్ చేస్తుంది. బలహీనతలను ఎలా అధిగమిస్తారన్నది కూడా చూస్తుంది.
- లెటర్ డ్రాఫ్టింగ్‌లో సమతుల్యత పాటించాలి. అస్సలు ఏమీ లేకపోవడం లేదంటే పెద్ద ఎత్తున విషయాలను కుమ్మరించడం... రెండూ పనికిరావు. ప్రొఫెషనల్ అయినప్పటికీ పర్సనలైజ్డ్ సిఫార్సులకు అడ్మిషన్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. అందుకని ప్రతి లెటర్ దేనికది యూనిక్‌గా ఉండాలి. బేసిక్ ఫార్మాట్ నుంచి పక్కకు తప్పకుండానే కంటెంట్ తదితర విషయాల్లో తగు జాగురూకత పాటించాలి. మొత్తమ్మీద బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి.
- ప్లగారిజాన్ని తప్పించాలి. మరొక లెటర్‌కు కాపీ కారాదు. ఒరిజినల్ అనిపించాలి. కాపీని సులువుగా పట్టేస్తారు. ముందునుంచీ చెబుతున్నట్టు లెటర్ ఒరిజినల్‌గా ఉండేలా చూడాలి. అభ్యర్థిని తీసుకునేలా ఉండాలే తప్ప ఒక డూప్లికేట్ మాదిరిగా అనిపించి అసలుకే మోసం తెచ్చేలా ఉండకూడదు. అంటే కాపీ, పేస్ట్ పని మంచిది కాదని గుర్తించాలి.

ప్రపంచంలోనే తొలి థియేటర్ ట్రైనింగ్ సంస్థగా 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'గా పేరుంది. 1959లో సంగీత నాటక అకాడమీ విభాగంగా ఈ సంస్థ ఆరంభమైంది. 1975లో స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ విభాగం నిధులతో ప్రస్తుతం పనిచేస్తోంది. తగు జాగ్రత్తలతో ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించిన సిలబస్, శిక్షణతో పకడ్బందీగా సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంస్థ డ్రమటిక్ ఆర్ట్స్‌లో మూడేళ్ల కాలవ్యవధి కలిగిన డిప్లొమాకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులను యాక్టింగ్, డిజైన్, డైరక్షన్‌కు తోడు థియేటర్ సంబంధ డిసిప్లిన్స్‌లో ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. ఈ ఏడాది జూలై 24 నుంచి కోర్సు ఆరంభమవుతుంది. సీట్లు 32 కాగా వీటిలో మూడింటిని విదేశీ విద్యార్థులకు కేటాయించారు. హిందీ ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది.

అర్హత: ఏ డిసిప్లిన్‌లో అయినా మూడేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆరు వేర్వేరు థియేటర్ ప్రొడక్షన్స్‌లో పాల్గొని ఉండాలి. అందుకు తగు ప్రూఫ్‌ని సమర్పించాలి. హిందీ/ ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలి. ఈ ఏడాది జూలై 1 నాటికి వయసు 18-30 మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

ఎన్ఎస్‌డీలో డిప్లొమా



ఎంపిక: ఇది రెండు దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారికి ఫైనల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో వేర్వేరు తేదీల్లో ఈ రెండూ జరుగుతాయి. హైదరాబాద్‌లో మే 27న జరుగుతుంది. వివరాలు ఎన్ఎస్‌డీ వెబ్‌సైట్‌లోనూ ఉంటాయి. తుది ఎంపిక న్యూఢిల్లీలో ఉంటుంది. జూన్ 23 నుంచి 27 వరకు అంటే అయిదు రోజులు ఉంటుంది. దీనికి పిలిచిన అభ్యర్థులకు వారి సొంత ఊరి నుంచి ట్రావెల్ ఎక్స్‌పెన్సస్‌కు తోడు డీఏ చెల్లిస్తారు. నిపుణులతో కూడిన కమిటీ వీరి ప్రతిభను పరిశీలించి తుది ఎంపిక జరుపుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. అందుకు మెడికల్ టెస్ట్ కూడా ఉంటుంది.

కోర్సు వివరాలు: కోర్సు కాల వ్యవధి మూడేళ్లు కాగా ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ 20 వారాల పాటు ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్లు కామన్. చివరి మూడు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ ఉంటుంది. ఇందులో డిజైన్, డైరక్షన్‌లో మాత్రం అయిదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9,500 చెల్లిస్తారు.

దరఖాస్తు: ఫీజు రూ.50. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మే 10

సంస్థ చిరునామా: NATIONAL SCHOOL OF DRAMA, Bahawalpur House, Bhagwandas Road, New Delhi-110001

వెబ్‌సైట్: www.nsd.gov.in http://www.onlineadmission.nsd.gov.in

ఎన్‌పీసీఐఎల్, ముంబయిలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

ముంబయిలోని కేంద్రప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) కింది విభాగాల్లో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 400 పోస్టులు. (ప్రస్తుత ఖాళీలు 396, బ్యాక్‌లాగ్ ఖాళీలు 4)

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక: గేట్ 2022/ 2023/ 2024 స్కోర్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

జాబ్ కార్నర్

సీఎంఎస్ఎస్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ ఒప్పంద ప్రాతిపదికన కింది 15 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఖాళీలు

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): 1
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): 1
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): 2
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ అస్యూరెన్స్): 1
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): 2
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): 2
7. మేనేజర్(ఫైనాన్స్): 2
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్) 2
9. ఆఫీస్ అసిస్టెంట్: 1
10. వేర్‌హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): 1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఐసీడబ్ల్యూఏ, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టుల 45 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,00; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

వెబ్‌సైట్: cmss.gov.in

ఎన్ఐఓహెచ్‌లో క్లర్క్‌లు

అహ్మదాబాద్(గుజరాత్)లోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ రెగ్యులర్ ప్రాతిపదికన అయిదు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

1. అప్పర్ డివిజన్ క్లర్క్: 1
2. లోయర్ డివిజన్ క్లర్క్: 4

విద్యార్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీతోపాటు టైపింగ్ నైపుణ్యాలను కలిగి ఉండాలి.

వయసు: 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి.

జీతం: నెలకు అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టుకు రూ.25,500 - రూ.81,100; లోయర్ డివిజన్ క్లర్క్‌కు రూ.19,900 - రూ.63,200

ఎంపిక: రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: www.nioh.org/recruitment



హెచ్ఏఎల్‌లో పోస్టులు

లఖ్‌నవూలోని హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ పార్ట్‌టైమ్/ విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టుల సంఖ్య: 5

విద్యార్హత: ఎంబీబీఎ/ బీఏఎంఎస్/ బీహెచ్‌ఎంఎస్/ బీయూఎంఎస్, పీజీ/డిప్లొమాతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 65 సంవత్సరాలకు మించకూడదు

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: https://www.hal-india.co.in/career

చిట్టీస్



ఉడుత భక్తి!

ఒక వెదురు చెట్టులో ఉడత నివాసం ఉండేది. ఆ ఉడుతకి జాలి గుణమెక్కువ. ఎవరే ఇబ్బంది పడినా స్పందించేది. తనకు సాయం చేసినవారి పట్ల భక్తి భావంతో ఉండేది. ఉడతాసాయం చేసేది. వెదురు బొంగులమీద గెంతుతూ ఆడుకునే ఉడతను చూసి ఓ గద్ద అసూయ పడింది. పైగా ఆ ఉడుతను కాళ్లతో రక్కి తినందే నిద్రపోకూడదని మనసులో అనుకుంది. ఎప్పటిలాగే మధ్యాహ్నం సమయంలో ఉడుత ఆడుకుంటూ వెళ్లి నీళ్లు నిలిచిన చిన్న గుంత దగ్గరికి పోయింది. ఒక్క క్షణంలో గద్ద ఉడుత మీదకు రివ్వున వచ్చింది. అది చూసి చావే గతి అనుకుంది. ఆ తర్వాత ఏమైందో దానికి గుర్తులేదు.




ఉడుత కళ్లు తెరిచి చూడగానే కాకుల గుంపు ఒకటి కనిపించింది. 'అసలు నేనెందుకు ఇక్కడున్నా?' అన్నది. 'మాకు ఉడుతలంటే ప్రేమ. ఎవరికీ ఏ హాని తలపెట్టకూడదని మాకు మా పెద్దలు చెప్పారంటూ ఓ కాకి కాస్త ఉడుత ముందుకు వచ్చి చెప్పింది. 'మీ మేలు మర్చిపోలేను' అంటూ ఉడుత తన ఇంటికి వెళ్లిపోయింది. ఒక రోజు ఉడుత చెట్లపై ఆడుకుంటోంది. ఆ సమయంలో ఓ వేపచెట్టు దగ్గరకు వెళ్లింది. అక్కడ గద్దలన్నీ గుంపు కూడాయి. 'కాకులపై రాత్రిపూట దాడి చేద్దాం. ఈ అడవిలో మనమే రాజులం' అంటూ గద్దలు మాట్లాడుకుంటున్నాయి. ఈ విషయం విని.. కాకులకు ఈ విషయం చెప్పింది ఉడుత. కాకులన్నీ జాగ్రత్తగా ఉండాలని, గద్దలను ఎదుర్కునేందుకు వ్యూహం పన్నాయి. ఒకేసారి గద్దలు కాకుల గుంపుపై రాత్రిపూట దాడి చేశాయి. అనుకున్న పథకం ప్రకారమే.. కాకులు గద్దలను ఎదుర్కున్నాయి. పైగా కాకులు నల్లగా ఉండటంతో చీకట్లో గద్దలకు ఏమీ అర్థం కాలేదు. దాదాపు అన్ని గద్దలు నేల కూలాయి. ఆ తర్వాత గద్దలు కాకుల జోలికి రాలేదెన్నడూ.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 280

7		4			6			
		9	2					
	2	8		7	3			
8						9		2
		7	8		4	1		
9		3						4
			7	3		6	4	
					5	3		
			6			8		9

సుడోకు - 279 సమాధానం

3	8	4	9	5	1	6	2	7
9	5	6	2	7	4	1	3	8
2	1	7	8	6	3	9	5	4
1	9	8	5	4	2	7	6	3
4	6	2	7	3	8	5	9	1
5	7	3	6	1	9	4	8	2
7	2	9	4	8	6	3	1	5
8	4	1	3	9	5	2	7	6
6	3	5	1	2	7	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.